## అసమానతలు లేని అభివృద్ధి కోసం

# ప్రజారక్షణ భేరి



# ప్రజా ప్రణాళిక

ప్రచురణ:

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ

# అసమానతలు లేని అభివృద్ధికోసం

## ప్రజారక్షణ భేరి

ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| (1) | ముందుమాట | 5 |
| (2) | ప్రణాళిక | 6 |
| (3) | రాష్ట్రంలో వ్యవసాయ రంగ పరిస్థితులు – ప్రత్యామ్నాయ విధానాలు | 8 |
| (4) | అసంఘటిత రంగ కార్మికులు సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలి | 11 |
| (5) | ఉపాధి చట్టాన్ని కాపాడుకుందాం. పని దినాలు, వేతనాలు పెంచాలి. | 13 |
| (6) | ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం – హామీలు – అమలు | 15 |
| (7) | కౌలురైతుల సమస్యలు – ప్రత్యామ్నాయాలు | 16 |
| (8) | విద్యుత్ సంస్కరణలు – ప్రజలపై భారాలు | 17 |
| (9) | దళిత సమస్య – కులవివక్ష అంతానికి పోరాటం | 18 |
| (10) | గిరిజన సమస్యలపై | 20 |
| (11) | మైనారిటీ సమస్యలపై | 22 |
| (12) | వ్యవసాయ, ఆక్వా రంగ సమస్యలు పరిష్కరించాలి | 24 |
| (13) | ప్రత్యామ్నాయ విధానాలతోనే అందరికీ ఉద్యోగం | 24 |
| (14) | నేటి విద్యారంగం – ప్రత్యామ్నాయం | 26 |
| (15) | చరిత్ర పాఠాలు తొలగింపు శాస్త్రీయ విద్యకు దూరం | 28 |
| (16) | ఆరోగ్య రంగం | 30 |
| (17) | వ్యవసాయాభివృద్ధికి సహకార రంగం అవసరం | 32 |
| (18) | వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి | 34 |
| (19) | పట్టణ సంస్కరణలు – ప్రజలపై భారాలు | 36 |
| (20) | జీడికి గిట్టుబాటు ధర – జీడి పంటల సమగ్రాభివృద్ధికై బోర్డు ఏర్పాటు | 39 |
| (21) | స్థానిక సంస్థలు – వికేంద్రీకరణ – సచివాలయాలు | 40 |
| (22) | నీటిపారుదల రంగం – భూసేకరణ – పునరావాసం | 43 |
| (23) | పారిశ్రామికాభివృద్ధి, సేవారంగం | 46 |

# అసమానతలు లేని అభివృద్ధికోసం

## ముందుమాట

రాష్ట్ర విభజన అనంతరం ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు జరుపుతామన్న మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాటతప్పి విద్రోహానికి పాల్పడింది. కేంద్రం నుండి రావాల్సిన సహాయం రాకపోగా తెలుగు ప్రజల త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేయాలనే కుట్ర చేస్తున్నది. పోలవరం నిర్వాసితులను గోదాట్లో కలిపింది. రాజధాని అభివృద్ధి గంగలో కలిసింది. వెనుకబడిన ప్రాంతాలకు సహాయం చేయకపోగా ఇచ్చిన నిధులను కూడా వెనక్కు తీసుకున్నది.

ఈ కాలంలో ఒక్క భారీ పరిశ్రమ రాలేదు. విద్యావంతులకు ఉద్యోగాలూ లేవు. నేడు రాష్ట్రం కరువుకాటకాలకు నిలయంగా మారింది. ఉపాధి లేక వ్యవసాయ కూలీలు, ఉద్యోగాలు లేక విద్యావంతులు వలసబాటపట్టారు. తెలంగాణా, కర్నాటక ఎన్నికల ప్రయోజనాలకోసం మన రాష్ట్ర భవిష్యత్తును ఫణంగా పెట్టింది. జాతీయ ప్రాజెక్టు పోలవరానికి నిధులివ్వని కేంద్రం అప్పర్ భద్రాకు జాతీయహోదా కల్పించి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. కృష్ణా జలాలను పున:పంపిణీ చేయడానికి కమీషన్‌కు నివేదించింది. ఆంధ్రా, తెలంగాణా మధ్య ఘర్షణ పెట్టడానికి సిద్ధపడింది. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి దేశాన్ని బలహీనపరుస్తున్నది. అమెరికా అడుగులకు మడుగులొత్తుతూ యుద్ధోన్మాద ఇజ్రాయల్‌ను వెనకేసుకొస్తున్నది.

ఇన్ని రకాలుగా రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపిగానీ, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం గానీ ఈ పదేళ్ళ నుండి కిమ్మనడంలేదు. బిజెపికి సాష్టాంగపడ్డాయి. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని విస్మరించిన జనసేన ఏకంగా బిజెపి పొత్తులో కుదురుకుంది. ఈ మూడు పార్టీల అవకాశవాదం వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. పార్లమెంటులో బిజెపి ప్రవేశపెట్టిన ప్రతి ప్రజా వ్యతిరేక బిల్లును ఈ రెండు పార్టీలు బలపర్చాయి. ప్రజలపై భారాలు మోపే కేంద్రం నిర్ణయాలను వైసిపి ప్రభుత్వం తూచా తప్పకుండా అందరికన్నా ముందు అమలు చేస్తున్నది. కరెంటు ఛార్జీలు మోయలేని భారం అయింది. ఆస్థిపన్ను పెంచారు. చెత్తపన్ను వేసింది. ఇసుక, మద్యం ధరలు పెరిగాయి. భారాలకు వ్యతిరేకంగా ప్రతిఘటించిన ప్రజలపై తీవ్ర నిర్బంధానికి పూనుకుంటున్నది. తమ సొంత రాజకీయ అవసరాలకోసం రాష్ట్ర ప్రయోజనాలను ఈ మూడు పార్టీలు కేంద్రానికి తాకట్టుపెట్టాయి. గొర్రె కసాయిని నమ్మినట్లుగా టిడిపి - బిజెపిని నమ్ముకుంటున్నది. ప్రాంతీయ పార్టీలను అడ్రసు లేకుండా చేస్తున్న బిజెపి నైజాన్ని వైసిపి, టిడిపి, జనసేనలు అర్థం చేసుకోకుండా రాష్ట్రానికి హాని చేస్తున్నాయి. ఇప్పటికైనా ఆ పార్టీలు బిజెపిని వదిలి తమ స్వంత కాళ్ళపై నిలబడి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి.

ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా వామపక్ష పార్టీలు కృషి చేస్తున్నాయి. అసమానతలు లేని అభివృద్ధి నినాదంతో సిపిఐ(యం) రెండు నెలలపాటు ప్రజారక్షణ భేరి క్యాంపెయిన్ నిర్వహించింది. ప్రజలెదుర్కొంటున్న సమస్యలకు ప్రత్యామ్నాయ పరిష్కారం చూపుతూ ప్రజా ప్రణాళికను విడుదల చేసింది. దీనికోసం రాష్ట్రస్థాయిలో మేధావులను ఆహ్వానించి రెండు రోజులపాటు (అక్టోబర్ 7,8 తేదీలలో) సెమినార్ నిర్వహించింది. ఆ తరువాత వివిధ అంశాలపై అన్ని అక్టోబర్ 2-29 మధ్య జిల్లాల్లో సదస్సులు నిర్వహించింది. అక్కడ వచ్చిన అభిప్రాయాలను తీసుకొని నిర్దిష్టమైన ప్రతిపాదనలతో డిమాండ్స్ రూపొందించాము. ఆ డిమాండ్స్‌ను ప్రజల్లోకి తీసుకుపోవడానికి మూడు బస్సుయాత్రలు జరిగాయి. 12 రోజులపాటు 26 జిల్లాల్లో 120 నియోజకవర్గాలను కలుపుతూ 3500 కిలోమీటర్లు ప్రయాణించాయి. 170 సభలు జరిగాయి. లక్ష మందికి పైగా వీటిల్లో పాల్గొన్నారు. ప్రజారక్షణ భేరి ముగింపుగా నవంబర్ 15 విజయవాడలో భారీ బహిరంగ సభ జరిగింది. దీనికి పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు సహా జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఈ క్యాంపెయిన్ రాష్ట్రంలో బిజెపి విద్రోహాన్ని ఎండగట్టడానికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎలుగెత్తి చాటడానికి, సిపిఐ(యం) స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి, ప్రజా ప్రణాళికను ప్రచారం చేయడానికి తోడ్పడింది. వామపక్ష పాలనలో ప్రజా ప్రణాళికలు అమలయ్యాయి. మానవాభివృద్ధిలో మొదటిస్థానంలో వున్న కేరళ దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశంలో రాజకీయ అవినీతికి అతీతంగా ఉన్న పార్టీ సిపిఐ(యం), వామపక్ష పార్టీలు.

వివిధ సదస్సుల్లో ఆమోదించిన తీర్మానాలను, రాష్ట్ర సెమినార్‌లో రూపొందిన ప్రజా ప్రణాళికను పుస్తక రూపంలో మీకు అందిస్తున్నాము. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవడానికి, చర్చించడానికి ఈ పుస్తకం తోడ్పడుతుంది. పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు దీనిని అధ్యయనం చేయాలని కోరుతున్నాను.

అభివందనములతో...

**విజయవాడ,**
**తేది : 14 నవంబర్, 2023.**

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి

# ప్రజా ప్రణాళిక

1. కరెంటు యూనిట్ రూపాయికే, పేదలకు 300 యూనిట్లు ఉచితం, స్మార్ట్‌మీటర్లు వద్దు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు
2. రూ. 400 లకే గ్యాస్, రూ. 60లకే లీటర్ పెట్రోల్, డీజిల్, ఇసుక ఉచితం
3. తలకు 10 కేజీల ఉచిత బియ్యం, పప్పు, నూనెల సరఫరా, నిత్యావసర సరుకుల ధరలు తగ్గింపు
4. అందరికీ సంక్షేమం – పెన్షన్లు, రేషన్ కార్డులు, అన్ని రకాల పెన్షన్లు రూ.5000లు.,పేద మహిళలకు ప్రత్యేక సహాయం
5. 2 సెంట్ల ఇల్లు, 5 లక్షల ఆర్థికసాయం, నివాసిత ప్రాంతాల్లోనే ఇళ్ళకు పట్టాలు, కొత్త కాలనీలకు అన్ని సౌకర్యాలు, చెత్తపన్ను, డ్రైనేజీ ఛార్జీలు రద్దు, ఇంటిపన్ను తగ్గింపు
6. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, అమరావతిలోనే రాజధాని
7. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు, పోడు భూములకు పట్టాలు, ప్రత్యేక డిఎస్సీ, ఏజెన్సీలో నాన్ షెడ్యూలు గిరిజన గ్రామాలు, జిఓ 3 అమలు
8. ఓపిఎస్ పునరుద్ధరణ, ప్రైవేటు ఉపాధ్యాయులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పిఎఫ్
9. భూమిలేని వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు 2 ఎకరాల భూమి, సేకరించిన భూముల్లో పరిశ్రమలు, లేదంటే రైతులకు వాపస్
10. అసలు పట్టాదారులకే అసైన్డ్ భూములపై హక్కులు, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు
11. గ్రామీణ ఉపాధి 200 రోజులు, రోజు వేతనం రూ.600, పట్టణ ఉపాధి గ్యారంటీ చట్టం, సమానపనికి సమాన వేతనం
12. చిన్న పరిశ్రమలు, వ్యాపారులకు రక్షణ, మెగా మాల్స్‌పై ఆంక్షలు, రాష్ట్రంలో ఐటి, ఫార్మా, టెక్స్‌టైల్స్, జూట్, పేపర్, అగ్రి, సినీ పరిశ్రమల అభివృద్ధి, స్థానికులకు 75% ఉద్యోగాలు
13. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, సమగ్ర సంక్షేమ చట్టం, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్, ప్రభుత్వ ఉద్యోగులుగా స్కీం వర్కర్స్
14. అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, విద్యార్థులకు పూర్తి ఫీజు రియంబర్స్‌మెంట్, కిడ్నీ పేషెంట్లకు మందులు, పెన్షన్, సుజాతరావు కమిటీ సిఫార్సుల అమలు
15. రైతులకు గిట్టుబాటు ధర, ప్రతి ఎకరాకు సాగునీరు, మోటార్లకు ఉచిత విద్యుత్, ప్రతీకౌలు రైతుకూ గుర్తింపు కార్డు, రుణం గ్యారెంటీ, స్వామినాథన్, జయతీఘోష్, రాధాకృష్ణ కమీషన్‌ల సిఫార్సుల అమలు
16. 40 వేల టీచర్లకు మెగా డిఎస్సీ, 2 లక్షల 50 వేల ప్రభుత్వ ఖాళీలు భర్తీ, నిరుద్యోగ భృతి నెలకు రూ.5000.
17. 2024 నుండే చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లు, మహిళల రక్షణ, అభివృద్ధికి కమిషన్, మద్యపానంపై నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన
18. సామాజిక న్యాయం, ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు, కులగణన, వివక్షపై కఠిన చర్యలు, సబ్‌ప్లాన్ అమలు, దళితులకు రక్షణ, జస్టిస్ పున్నయ్య కమిటి సిఫార్సుల అమలు, డప్పు, చర్మ కళాకారులందరికీ పెన్షన్లు.
19. వెనుకబడిన ప్రాంతాలకు లక్ష కోట్లతో ప్యాకేజీ, నిర్ణీత కాల పరిమితిలో వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టుల పూర్తి, నిర్వాసితుల పునరావాసానికి ప్రాధాన్యత, 2013 భూసేకరణ చట్టం పకడ్బందీగా అమలు.

20. పిల్లలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఉచిత వృద్ధాశ్రమాలు, శ్రామిక మహిళల పిల్లలకు డేకేర్ సెంటర్లు, జానపద, వృద్ధ కళాకారులకు భృతి
21. మైనార్టీల హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్లు, మత సామరస్యం, సచార్, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సుల అమలు
22. వృత్తులకు రక్షణ, ఆధునిక పరికరాల సరఫరా, బిసిలకు సబ్‌ప్లాన్, ప్రత్యేక నిధులు, ఎస్సీ,ఎస్టీ, బిసి కార్పొరేషన్లకు నిధులు, స్వయం ఉపాధికి రుణాలు – సబ్సిడీలు
23. వికలాంగుల చట్టానికి రూల్స్ నోటిఫై, ఇతర పెన్షన్లతో సంబంధం లేకుండా నెలవారీ భృతి రూ.6000 లు.
24. విస్తారమైన పాసింజర్ రైళ్ళ పునరుద్ధరణ, జనరల్ బోగీల పెంపు, ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు,మహిళలు, వికలాంగులు విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ప్రయాణం
25. స్థానిక సంస్థలకు నిధులు – విధులు, స్థానిక సంస్థల పరిధిలోకి సచివాలయాలు, గ్రామీణాభివృద్ధికి నిధులు
26. రాష్ట్రాల అధికారాలు, అభివృద్ధి వికేంద్రీకరణ, పట్టణాభివృద్ధికి చర్యలు
27. ప్రభుత్వ రంగం బలోపేతం, సహకార వ్యవస్థ పటిష్టం, డైరీ, చక్కెర మిల్లుల పున: ప్రారంభం
28. కర్నూలుకు హైకోర్టు, విజయవాడ, విశాఖ బెంచీలు, సత్వర న్యాయం – యువ న్యాయవాదులకు ప్రోత్సాహం, అవినీతిపై ప్రజాయుద్ధం – పకడ్బంధీగా చట్టాల అమలు, బడా కార్పొరేట్లపై పన్ను, బ్యాంకు బకాయిల వసూళ్ళు
29. పరిశుభ్రమైన వాతావరణం, సముద్రతీర సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
30. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ – రాజ్యాంగానికి లోబడి సుపరిపాలన, ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల బాండ్లు రద్దు, కార్పొరేట్ నిధులకు చెక్, పౌరుల వ్యక్తిగత గోప్యానికి భద్రత
31. ప్రజాస్వామ్య, లౌకిక సంస్కృతి పరిరక్షణ, భారతీయ ఉత్తమ సాంప్రదాయాలు, స్వాతంత్ర్యోద్యమ వారసత్వం కొనసాగింపు.

# రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితులు - ప్రత్యామ్నాయ విధానాలు

రాష్ట్రంలో వ్యవసాయ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 685 మండలాలకు సుమారు 300 మండలాలలో లోటు వర్షపాతం నమోదు అయ్యింది. 85.97 లక్షల ఎకరాలు సాధారణ సాగు కావలసి ఉండగా 60.22 లక్షల ఎకరాలలోనే పంటలు సాగు అయ్యాయి. సుమారు 26 లక్షల ఎకరాలలో పంటలు సాగు కాలేదు. వేసిన పంటలు కూడా డ్రైస్పెల్ కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి భారీగా తగ్గే పరిస్థితి వుంది. జూలై, ఆగష్టు మాసాలలో వర్షాలు లేకపోవటంతో ఖరీఫ్‌లో వేసిన పంటలలో అధిక భాగం దెబ్బతిన్నాయి. సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలతో రబీ పంటలకు, తక్కువ కాల వ్యవధి పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళిక రూపొందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. మొత్తంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలి. వ్యవసాయాన్ని నిలబెట్టేందుకు ప్రత్యామ్నాయ విధానాల అమలు కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రైతాంగం ఢిల్లీ ఉద్యమ స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి.

**ప్రాజెక్టులు కట్టరు - సాగునీళ్లు ఇవ్వరు**

రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం. దాని నిర్మాణానికి, పునరావాసానికి నిధులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కేంద్రంపై వత్తిడి చేసి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం మెతక వైఖరి ప్రదర్శిస్తోంది. తన బాధ్యతగా నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాల్సిన హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు – నగరి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం, చిన్న, పెద్ద రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాల నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వం రెండూ క్షమించరాని నిర్లక్ష్యం ప్రదర్శించాయి. ఆ నిర్లక్ష్యం కొనసాగుతూనే వుంది. గత ప్రభుత్వం తన 5 ఏళ్ల పాలనా కాలంలో రూ. 80,792 కోట్లు కేటాయించి అందులో రూ. 56,894 కోట్లు అంటే మొత్తంలో 70% మాత్రమే ఖర్చు చేసింది. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఈ 5 సంవత్సరాలలో రూ. 61,573 కోట్లు కేటాయించి అందులో రూ. 32,059 కోట్లు అంటే 52% మాత్రమే ఖర్చు చేసింది. వైసిపి ప్రభుత్వం సాగునీటి రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత ఏపాటిదో దీన్నిబట్టి స్పష్టం అవుతోంది.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కీలకం. సాగునీటి రంగానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ఏటా బడ్జెట్ లో కనీసం 15 శాతం నిధులు కేటాయించాలి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2019 లో 37 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా ప్రకటించింది, కాని నిధులు కేటాయించింది లేదు, నిర్మాణం చేపట్టింది లేదు. ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మాణం పూర్తి చేసింది లేదు.

రాష్ట్రంలో ఉన్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులలో ఈ సంవత్సరం నీటి నిలువలు సగానికి మించి లేవు. నీటి కొరత కారణంగా నాగార్జున సాగర్ ఆయకట్టు క్రింద 12 లక్షల ఎకరాలలో వరి నాట్లు పడలేదు. సాగర్ ఆయకట్టుకు నీరు అందించలేమని ఆరుతడి పంటలు వేసుకోండని ప్రభుత్వం ప్రకటించింది. రాయలసీమ, ఉత్తరాంధ్రలలో పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయి. లక్షల ఎకరాలలో విత్తనాలు పడలేదు. వేసిన పంటలు కూడా వర్షాభావ పరిస్థితుల వలన పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఇలా ఉంటే కేంద్ర ప్రభుత్వం కృష్ణా జలాల పునఃపంపిణీ గురించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అధికారం ఇస్తూ 07.09.2023 గెజిట్ విడుదల చేసింది. ఇది పూర్తిగా రాయలసీమ,నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులకు నష్టం కలిగిస్తుంది. బిజెపి తన రాజకీయ స్వార్థంతోనే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదానికి తెరలేపింది.

**కొనసాగుతున్న రైతాంగ ఆత్మహత్యలు**

రాష్ట్రంలో కరువు, తుఫాన్ లతో పంటలు దెబ్బతిని, దిగుబడులు తగ్గిపోతున్నాయి. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలు, వ్యవసాయ ఉపకరణాల ధరలు పెరిగిపోయాయి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు అవసరమైన పెట్టుబడి రుణాలు బ్యాంకులు ఇవ్వటం లేదు. అనివార్యంగా పెట్టుబడి కొరకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, మధ్యదళారులపై రైతులు ఆధార పడవలసి వస్తోంది. మార్కెట్ మాయాజాలం, ప్రభుత్వాల నిర్లక్షంతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. పెట్టిన పెట్టుబడులు కూడా దక్కక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ప్రతి రైతు కుటుంబం సగటున రూ. 2.50 లక్షలు రుణ భారాన్ని మోస్తున్నారు. అప్పులు, అవమానాలు భరించలేక జీవించటం కష్టమవుతున్నది. ఈ ఒత్తిళ్లతో కొందరు రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గడిచిన 3సం॥లలో మన రాష్ట్రంలో 2582 మంది రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలలో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉంది. 2020తో పోల్చుకుంటే 2021లో 14.5 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. రైతాంగ ఆత్మహత్యలు వ్యవసాయరంగంలో సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రైతు

కుటుంబాలలో యువతరం వ్యవసాయం నుండి ఇతర వృత్తులలోకి మళ్లుతున్నారు. పట్టణాలకు వలసపోతున్నారు. వ్యవసాయం నుండి వలసలు నివారించాలి. రైతులు, కౌలు రైతులకు రూ. 2 లక్షల రూపాయల వరకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి. రైతాంగానికి విశ్వాసం కల్పించాలి.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలు**

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక 3 వ్యవసాయ చట్టాలతో రైతు వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల పరం చేసే ప్రయత్నం చేసింది. అయితే భారత రైతాంగం సంవత్సరంపైగా సాగించిన చారిత్రక పోరాటంతో కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల చట్టాలను తిప్పి కొట్టగలిగింది. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తామని, విద్యుత్ సవరణ బిల్లును రైతు సంఘాలతో చర్చించిన తరువాతనే పార్లమెంటు ముందుకు తీసుకు వస్తామని హామీ ఇచ్చింది. కాని ఆచరణలో ఇచ్చిన హామీ అమలు చేయకపోగా, దానిని ఉల్లంఘించి 2022 లో విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టింది. మద్దతు ధరల చట్టం గురించి అసలు ప్రస్తావించడం లేదు. రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయం, విద్యుత్తు, సహకారం అన్నింటిలోకి కార్పొరేట్ కంపెనీలను జొరబెట్టడమే పనిగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరిస్తున్నది. ప్రశ్నించాల్సిన మన రాష్ట్ర ప్రభుత్వం మారు మాట్లాడకుండా, రాష్ట్ర ప్రయోజనాలను, రైతుల ప్రయోజనాలను కేంద్రం ముందు తాకట్టు పెడుతున్నది.

**మద్దతు ధరలపై అమలు కాని ఎన్నికల హామీ - గిట్టుబాటు కాని వ్యవసాయం**

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి, మినుములు,పెసలు వంటి కొన్ని పంటలకు మద్దతు ధరలు అంటూ ప్రకటిస్తున్నది. కానీ ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ సూచించిన సి2+50 ఫార్ములాను అనుసరించి అన్ని పంటలకు మద్దతు ధరలు అమలు చేస్తామని, 2022వ సంవత్సరం నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని 2014 ఎన్నికల సందర్భంగా బిజెపి, నరేంద్రమోడీ ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. ఇచ్చిన హామీ అమలు చేయకపోగా, రైతులకు మద్దతు ధరలు అమలు చేస్తున్నామని బుకాయిస్తున్నారు. దేశానికే ఆదర్శంగా కేరళ వామపక్ష ప్రభుత్వం మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధరలకు అదనంగా బోనస్ ప్రకటించి పండ్లు, కూరగాయలతో సహా అన్ని పంటలకు మద్దతు ధరలు అమలుచేస్తూ రైతాంగానికి అండగా నిలబడుతోంది. రైతులపట్ల తన నిబద్ధతను చాటుకుంటున్నది. కాని మన రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరల ఊసే ఎత్తడం లేదు. ఆర్బీకెల ద్వారా విత్తనం నుండి విక్రయం దాకా అన్నీ అమలు చేస్తున్నామంటూ బాకాలు ఊదుతున్న ప్రభుత్వం ఆర్బీకెలను ఈ క్రాప్ నమోదుకే పరిమితం చేస్తోంది. వరి, పత్తి, వేరుశెనగ, పసుపు, జొన్న, ఉల్లి, టమోటా వంటి పంటలకు మద్దతు ధరలు లేక రైతులు ఏదో ఒక రేటుకు తెగనమ్ముకోవలసి వస్తోంది. తీరా పంటలన్ని రైతుల చేతులు దాటి మధ్య దళారుల చేతికి పోయిన తరువాత ధరలు పెరుగుతున్నాయి. ఉత్పత్తిదారునిగా, వినియోగదారునిగా రెండు వైపులా రైతు నష్టపోతున్నాడు, దెబ్బతింటున్నాడు. కనుక రైతాంగానికి మద్దతు ధరలు ఇచ్చేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి.

**ఉద్యాన పంటలకు ప్రోత్సాహం కరువు**

రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తరిస్తున్నది. ఆహారపంటల తరువాత విస్తారంగా ఉద్యాన పంటల సాగు పెరిగింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 45 లక్షల ఎకరాలకు పైగా సాగు విస్తరించింది. వరి, మొక్కజొన్న, వేరుశెనగ, పత్తి, పొగాకు వంటి పంటల స్థానంలో ఉద్యాన పంటల సాగు విస్తరిస్తున్నది. రాయలసీమను ఫ్రూట్ బాస్కెట్ గా అభివృద్ధి చేస్తామని, వ్యవసాయ పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు, హామీలు గానే మిగిలాయి. మామిడి, అరటి, బత్తాయి వంటి పండ్లు విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంది. అటువంటి పండ్ల తోటల పెంపకానికి అవసరమైన ప్రోత్సాహం ప్రభుత్వం వైపు నుండి లేదు. ప్రారంభంలో ఇచ్చిన ప్రోత్సాహం నేడు కరువు అయ్యింది. పండ్లు నిలువ చేసేందుకు అవసరమైన శీతల గిడ్డంగుల నిర్మాణం ప్రభుత్వం చేపట్టాలి. గతంలో లాగా సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు ఇవ్వాలి. ఎగుమతులకు అనుమతి ఇవ్వాలి.

**సమగ్ర పంటల బీమా అమలు చేయాలి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా రైతుల కంటే కార్పొరేట్ కంపెనీలకే అనుకూలంగా ఉంది. అందుకే దేశ వ్యాప్తంగా మన రాష్ట్రంతో సహా 7 రాష్ట్రాలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా నుండి బయటకు వచ్చాయి. 2020 నుండి 2022 మధ్య రెండు సంవత్సరాలు మన రాష్ట్ర ప్రభుత్వం సొంతంగానే పంటల బీమాను అమలు చేసింది. రైతాంగానికి కొంత మెరుగైన బీమా పరిహారం అందింది. కాని కేంద్ర ప్రభుత్వం వత్తిడితో మళ్లీ 2023 నుండి ప్రధాన మంత్రి ఫసల్ బీమాలో చేరింది, ఈ సంవత్సరం పంటల భీమా పూర్తిగా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకే అప్పగిస్తూ జీవో 660 ని విడుదల చేసింది. ఇది రైతులకు తీవ్రంగా నష్టం చేస్తుంది. కనుక ఈ జీవో ను రద్దు చేయాలి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా నుండి బయటకు రావాలి. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతతో అన్ని పంటలకు వర్తించేలా సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి.

**భూసేకరణ - న్యాయమైన పరిహారం - పునరావాసం కల్పించాలి**

రాష్ట్రంలో శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు అన్ని జిల్లాలలో జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ హైవేలు నిర్మాణం, రైల్వే

లైన్లు, గ్యాస్ పైపులైన్లు, సోలార్ విద్యుత్, ఓడ రేవులు, ప్రత్యేక ఎస్ఇజెడ్ లు, కారిడార్ల నిర్మాణం పేరుతో లక్షల ఎకరాల భూములను రైతుల నుండి సేకరిస్తున్నారు. అయితే ఎక్కడా భూసేకరణ సందర్భంగా 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించడం గాని, న్యాయమైన పరిహారం ఇవ్వడం గాని, గ్రామ సభలలో ప్రజలు ముఖ్యంగా భూములు కోల్పోతున్న రైతుల ఆమోదం తీసుకోవడం వంటివి పాటించటం లేదు. అధికారులు, అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా చట్టాన్ని ఉల్లంఘించి రైతులను అదిరించి, బెదిరించి బలవంతంగా భూములు లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు, కట్టబెడుతున్నారు. దశాబ్దాల తరబడి తాతలు, తండ్రుల కాలం నుండి ప్రభుత్వ భూములు, ఫారెస్టు, బంజరు భూములను సాగు చేసుకొని జీవిస్తున్న రైతులకు హక్కు పత్రాలు లేవనే పేరుతో పట్టా భూములతో సహా సాగులో ఉన్న భూములను కూడా దౌర్జన్యంగా లాక్కొని పరిహారం నిరాకరిస్తున్నారు. పట్టా భూములకు నామమాత్రపు పరిహారం చెల్లిస్తూ భూములను లాక్కుంటున్నారు. పరిహారం చెల్లించిన తరువాతనే నిర్మాణ పనులు ప్రారంభించాలనే సూత్రాన్ని ఎక్కడా పాటించటం లేదు. గిరిజన గ్రామాలు, గిరిజన కుటుంబాల భూములు సేకరిస్తే భూమికి భూమి ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని చట్టం ఉన్నా, చట్టాన్ని అమలు చేయకుండా నిరాకరిస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాలు తప్ప భూములు కోల్పోతున్న రైతుల ప్రయోజనాలు ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. ఈ రకమైన రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సమైక్య పోరాటానికి రైతాంగం సిద్ధపడాలి.

### సహకార రంగం నిర్వీర్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యత్నం

సహకార బ్యాంకులు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, సహకార పాల డైరీలు, సహకార చక్కెర మిల్లులు, నూలు మిల్లులు ఈరకంగా సహకార వ్యవస్థ రాష్ట్రంలో అనేక ఏళ్లుగా వేళ్లూనుకున్నది. ఇటీవల ప్రభుత్వం పొదుపు మహిళలను కూడా సహకార సంఘాలలోచేర్చి ఆర్థిక కార్యకలాపాలలో భాగస్వాములను చేస్తూ సొంత కాళ్లపై నిలబడేందుకు ప్రోత్సహిస్తున్నది. సహకార వ్యవస్థ గ్రామీణ, పట్టణ జీవితంలో లక్షల, కోట్ల మందిని ప్రభావితం చేస్తోంది. అటువంటి సహకార వ్యవస్థను కబళించేందుకు కేంద్ర ప్రభుత్వం బహుళ రాష్ట్రాల సహకార సంఘాల చట్టాన్ని ముందుకు తెచ్చింది. దానికి హోమ్ మంత్రి అమిత్‌షాకు బాధ్యతలు ఇచ్చారు. సహకార స్ఫూర్తికి, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సహకార వ్యవస్థను తన గుప్పిట్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తోంది. తానేమి తక్కువ కాదనట్టుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మన సహకార పాలడైరీలను గుజరాత్ అమూల్ కంపెనీకి కట్టబెడుతోంది. రాష్ట్రంలో ఉన్న సహకార చక్కెర మిల్లులను మూసివేసి, వాటి ఆస్తులను రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రింద తెగనమ్ముతున్నారు. రైతులే సభ్యులుగా ఉంటూ, రైతుల ప్రయోజనాల కొరకు, రైతుల చేత నిర్వహించబడుతున్న వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చి వ్యాపారులు, ప్రైవేటువ్యక్తుల పరం చేస్తున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను, ఆప్కాబ్‌లను పెద్దపెద్ద వ్యాపార సంస్థలపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తం సహకార రంగాన్ని సర్వనాశనం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

### వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు

1. వ్యవసాయ రంగం అభివృద్ధికి కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇసూ హంద్రీనీవా, గాలేరు – నగరి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం, చింతలపూడి ఎత్తిపోతల, వరికెపూడిసెల ఎత్తిపోతల పథకాలు, వేదవతిపై ఎత్తిపోతల ద్వారా రిజర్వాయర్ల నిర్మాణం, ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణం, తుంగభద్రపై మేళిగనూరు నుండి వరద కాలువ నిర్మాణం, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ఆధునీకరణవంటి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్ణీత కాల వ్యవధిలో నిర్మాణం పూర్తి చేయాలి. కృష్ణానది జలాల పంపిణీ పై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గజిట్ ను రద్దు చేయాలి.
2. రైతులు పండించిన అన్ని పంటలకు పెట్టుబడి పై (సి2+50 ఫార్ములా ప్రకారం) 50 శాతం ఆదాయం వచ్చేలా మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయాలి. మామిడి, జీడి, కొబ్బరి, ఆయిల్ పామ్, పొగాకు, సుబాబుల్, పట్టు రైతులకు మద్దతు ధరలు అమలు చేయాలి. ధాన్యానికి క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 2810/– లు అమలు చేయాలి. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీకి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. తేమ, తరుగు పేరుతో కోతలు నిరోధించాలి.
3. రైతులు, కౌలు రైతులకు రూ.2.00 లక్షల వరకు అన్ని రకాల బ్యాంకుల రుణాలు మాఫీ చేయాలి. కేరళ తరహాలో రాష్ట్రంలో రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలి.
4. రైతులకు వ్యవసాయపెట్టుబడులకు రూ.2.00 లక్షల వరకు సున్నా వడ్డీకి, రూ.5.00 లక్షల వరకు పావలావడ్డీకి బ్యాంకు రుణాలు ఇవ్వాలి.
5. రైతు భరోసా రూ 13,500/–లు స్థానంలో ఎకరాకు రూ. 10 వేల చొప్పున 10 ఎకరాల వరకు రైతులు, కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి.

6. అన్ని పంటలకు సమగ్ర పంటల బీమా అమలు చేయాలి. ప్రైవేటు కార్పొరేట్ కంపెనీల లాభాల కొరకు ఉద్దేశించబడిన ప్రధాన మంత్రి ఫసల్ బీమాను తిరస్కరించాలి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా నుండి బయటికి రావాలి.
7. పోలవరం ముంపు బాధితులకు పరిహారం ఇచ్చి, పునరావాసం కల్పించి, పోలవరం నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలి.
8. విద్యుత్ సవరణ బిల్లు 2022ను వెనక్కు తీసుకోవాలి, రైతులు, ప్రజలకు భారం కానున్న విద్యుత్ రంగ సంస్కరణలు నిలిపివేయాలి. వ్యవసాయ మోటార్లకు మీటర్లు, గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని నిలిపివేయాలి. పెంచిన విద్యుత చార్జీలు తగ్గించాలి.
9. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటుచేయాలి. పండ్ల తోటల రైతులకు గతంలో లాగా డ్రిప్, తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు సబ్సిడీతో ఇవ్వాలి. పండ్ల ఉత్పత్తులు నిలువచేసుకునేందుకు శీతలగిడ్డంగులు, కోల్డ్‌స్టోరేజీలు ప్రభుత్వం నిర్మించాలి, జ్యూస్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ఎగుమతులకు అనుమతించాలి.
10. వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగామార్చే ప్రయత్నాలను విరమించుకోవాలి. సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రైవేటు వ్యాపారులు, కంపెనీల పరం కాకుండా సహకార సంఘాలను నిలబెట్టాలి.
11. పాల రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న లీటర్ పాలకు రూ.4.00 లు బోనస్ ఇవ్వాలి. రాష్ట్రంలో సహకార పాలడైరీలను అమూల్ నుండి కాపాడాలి.
12. మూతపడిన సహకార చక్కెర పరిశ్రమలను, సహకార పాల డైరీలను పునరుద్ధరించాలి.
13. పరిశ్రమలు, ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, రైల్వే లైన్లువంటి ప్రభుత్వ అవసరాలకు భూసేకరణ సందర్భంగా 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలి. పరిహారం ఇచ్చి, పునరావాసం కల్పించిన తరువాతనే భూమిలో ప్రవేశించి నిర్మాణం చేపట్టాలి.
14. తక్కువ వర్షపాతంతో పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను గ్రామం యూనిట్‌గా కరువు ప్రాంతాలుగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలి. ఉపాధి హామీ పనులు 100 రోజులు అదనంగా కల్పించాలి.

# అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలి

మన రాష్ట్రంలో అసంఘటితరంగ కార్మికులు సుమారు 1.50 కోట్లకుపైగా ఉన్నారు. వీరు 70 షెడ్యూల్డు పరిశ్రమల్లో పనిచేసే 50 లక్షల మంది, భవన నిర్మాణ రంగం కార్మికులు 20 లక్షలు, హమాలీ కూలీ కార్మికులు 6 లక్షలు, ప్రయివేటు రవాణా (ఆటో, లారీ, మొదలగు) 35 లక్షలు, సెక్యూరిటీగార్డ్సు 6 లక్షలు, ప్రయివేటు విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది 5 లక్షలు, స్కీం వర్కర్స్ (అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం మొదలగు కార్మికులు) 3 లక్షలు, మున్సిపల్, విద్యుత్, గ్రామ పంచాయతీ, విఆర్‌ఏ, టిటిడి లాంటి సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులు సుమారు 2 లక్షలు, ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ 3 లక్షల మంది, సచివాలయ వలంటీర్లు 3 లక్షలు, వీరుగాక ఇంటిపనివారలు, గృహ పరిశ్రమల్లో పనిచేసేవారు, బీడి, క్వారీ, గనులు, కొబ్బరి వలుపు – దింపు, ఆక్వా, జీడిపిక్కలు, పొగాకు, నర్సరీల్లో, చింతపండు, ఆగర్‌బత్తీ, క్యాటరింగ్, ధాబాల్లో తదితరాల్లో పనిచేసేవారు, స్కూళ్ళలో పనిచేసే శానిటేషన్, ఆయాలు, హాస్పిటల్స్‌లో పనిచేసే నర్సులు, గిగ్ వర్కర్స్‌గా (స్విగ్గీ, జోమోటో, అమెజాన్, ఊబర్, ఓలా, ఈ–కామర్స్ ద్వారా ఇంటింటికి వస్తూ సేవలందించేవారు) లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరికి అదనంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం క్రింద నమోదు కాబడిన 80 లక్షల మంది వ్యవసాయ కార్మికులు అసంఘటితరంగ కార్మికులే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన వ్యవసాయ రంగంలో పనులు దొరకక మరియు దొరికినా పరిమిత పనిదినాలు మాత్రమే ఉపాధి ఉండడం, చదువుకున్న నిరుద్యోగులు లక్షల సంఖ్యలో నేడు చదువుతో నిమిత్తం లేకుండా ఏదొక ఉపాధికోసం అసంఘటిత రంగ కార్మిక వాహినిలో ప్రతి ఏటా చేరుతున్నారు. వీరు ఉత్పత్తి, సేవా రంగాల్లో ఇతోధిక సేవలందిస్తున్నారు. రాష్ట్ర జిడిపిలో సగానికి పైగా వీరి పాత్ర ఉంటుంది. అయినా వారి సంక్షేమం గురించిగానీ, పని పరిస్థితులు, వేతనాలు, ఈవిత భద్రత గురించి ప్రభుత్వాలు ఆలోచించడం గానీ, సమగ్రమైన చట్టాన్ని రూపొందించడంగానీ నేటి వరకూ జరగకపోవడం విషాదం.

### వీరెదుర్కొంటున్న సమస్యలు

ఒకవైపు వేరు వృత్తి సమస్యలు ఉపాధి గ్యారెంటీ లేకపోవడం, పనిగంటల నియంత్రణ లేకపోవడం, పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాలుండవు, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ పెన్షన్ తదితర గ్యారెంటీలేవీ వీరికి లేవు. ఇంకోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పన్నుల భారం, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, కరెంటు ఛార్జీలు పెరుగుదల, రవాణా ఛార్జీల భారం, ఇంటిపన్ను, చెత్తపన్ను తదితరాలు, ఇంటి అద్దెల పెరుగుదల మొదలగు ఈతిబాధలు వర్ణనాతీతం. జాతీయ క్రైం

రిపోర్టు ప్రకారం మోడీగారి రెండవ టర్మ్ (2019-21) 3 సంవత్సరాల్లో 2 లక్షల మంది దినసరి కూలీలు ఆర్థిక బాధలు తాళలేక ఆత్మహత్యలు చేసుకొన్నారు. సెంటర్ ఫర్ సైన్స్ మరియు ఎన్విరాన్‌మెంట్ రిపోర్టు ప్రకారం సరైన తిండి దొరకకనే వారు 71% మంది ఉన్నారు. అందులో అనారోగ్యంతో ఏటా 17 లక్షల మంది మరణిస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికులే అధికులనేది వేరే పేర్కొనాల్సిన అవసరం లేదు.

పెరిగిన పిల్లల విద్య ఖర్చులు, కేంద్రం నియమించిన అర్జున్‌సేన్ గుప్తా నివేదిక ప్రకారం అసంఘటిత రంగ కార్మికుల ఆదాయంలో 65% కుటుంబ వైద్య ఖర్చులకే పెట్టాల్సి వస్తుందని పేర్కొన్నారంటే వీరి దైన్య స్థితి ఎట్లుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు అందిన వారికైనా అది అరకొరా సహాయమే. అందనివారు లక్షలాదిమంది రాష్ట్రంలో ఉన్నారు.

**కనీస వేతన నిర్ణయం ఎట్లుండాలి?**

1957 సంవత్సరంలోనే 15వ భారత కార్మిక మహాసభ డాక్టర్ అక్రామ్ సిఫార్సులకనుగుణంగా భార్య, భర్త, ఇద్దరు పిల్లలకు 3 యూనిట్లుగా తీసుకొని ఒక్కొక్కరికి రోజుకి 2700 క్యాలరీల శక్తినిచ్చే ఆహారం ఖర్చు, నలుగురికి 70 మీటర్ల బట్టల ఖర్చు, నెలకయ్యే ఇంటి అద్దె, కరెంట్ మరియు రవాణా ఖర్చులు ఆయా కాలాల్లో వీటికి అయ్యే ధరలు ఆధారంగా కనీస వేతనం నిర్ణయించాలని, మరియు 1992 సంవత్సరంలో సుప్రీం కోర్టు పైవాటితోపాటు కనీస వేతనంలో 25% విద్య, వైద్యం భవిష్యత్ అవసరాలు, పండుగలు, వినోదాలకు అదనంగా తోడుచేసి కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించబడాలని తీర్పు చెప్పింది. దీని ప్రకారం నేడున్న ధరల్లో ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26,000లుంటేగానీ కుటుంబాలు గడవడం కష్టమని కేంద్ర ప్రభుత్వమే ప్రకటిస్తున్నా ఆచరణలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని పట్టించుకోవడం లేదు. ఎక్కడాకూడా వీరికి 5 నుండి 15 వేలకు మించి వేతనాలే రావడం లేదంటే వీరి దీన స్థితి అర్థం చేసుకోవచ్చు.

ఈ పరిస్థితిని గుర్తించి మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన ఉన్న కేరళ ప్రభుత్వం అసంఘటిత రంగంలోని అన్‌స్కిల్డ్ కార్మికులకు రోజుకు 680 - 750రూపాయల వరకు తగ్గకుండా (నెలకు 21-23 వేలు) కనీస వేతనం ఇవ్వాల్సిందేనని అట్లా ఇవ్వనివారు, సంస్థలు శిక్షార్హులని చట్టం చేసిన ఏకైక రాష్ట్రమది. మన రాష్ట్ర ప్రభుత్వం పేరుకి సంక్షేమమే మాధ్యేయ అంటూనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం రూపాయి ఇవ్వకపోయినా నిర్మాణ యజమానుల నుండి వసూలు చేసిన సెస్సు వారి సంక్షేమానికి ఖర్చు చేయాల్సి ఉండగా గత, నేటి ప్రభుత్వాలు 1750 కోట్లు తమ పథకాలకు దారి మళ్ళించాయి. కనీస వేతనబోర్డు నామకా: ఉన్నదేగానీ 2006-2007 సంవత్సరం నుండి కనీస వేతనాలపెంపు ఉన్నా నేటికీ జరగలేదు. ఉన్న కొద్దిపాటి చట్టాల అమలు జరపాల్సిన కార్మిక శాఖ యాజమాన్యం అనుకూల శాఖగానే ప్రభుత్వ ఆదేశాల్తో పనిచేస్తుందంటే అసంఘటిత రంగ కార్మికుల యోగ క్షేమాలు, వారి సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వ శ్రద్ధేమిటో అర్థమౌతూనే ఉంది.

**అందుకే మార్క్సిస్టు పార్టీ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి దిగువ కనీస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నది :**

(1) అసంఘటిత రంగ కార్మికులందరికీ పెరిగే ధరలకనుగుణంగా కనీసవేతనం నెలకు రూ.26,000లు, 8 గంటల పని, ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ, కనీస పెన్షన్ రూ.10,000లు ఇచ్చేలా తదితర గ్యారెంటీలతో సంక్షేమ, సమగ్ర చట్టం చేయాలి.

(2) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్ని భర్తీ చేయాలి.

(3) ప్రభుత్వ శాఖల్లో ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, టైంస్కేల్, పీస్‌రేట్లపై పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయాలి. అప్పటి వరకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి.

(4) స్కీం వర్కర్స్ అందరినీ కార్మికులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలి. సెంటర్లను కుదించి కార్మికుల్ని తగ్గించే చర్యలు ఉపసంహరించుకోవాలి. కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ స్కీంలకు ఇచ్చే నిధులు అవసరాలకనుగుణంగా పెంచాలి.

(5) భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని రాష్ట్ర ప్రభుత్వం జమచేయాలి. సెస్సు నిధులు వారి సంక్షేమానికే ఖర్చు చేయాలి. ప్రభుత్వ స్కీములతో ముడిపెట్టకుండా వారి క్లెయిమ్స్ పరిష్కరించాలి. సంక్షేమ బోర్డుని కార్మిక ప్రతినిధులుండేలా పునర్‌నిర్మించాలి.

(6) కార్మికుల్ని కార్పొరేట్లకు (యజమానులకు) బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. కార్మిక చట్టాల్ని పునరుద్దరించాలి.

(7) కార్మిక చట్టాల్ని కఠినంగా అమలు జరిపేలా కార్మిక శాఖని సమర్థవంతంగా పనిచేయించాలి.

(8) గ్రామీణ ఉపాధిహామీ పథకానికి నిధులు పెంచాలి. సవత్సరానికి 200 రోజులు పని, రోజుకి రూ.600లు వేతనం

గ్యారెంటీ చేయాలి. ఉపాధి పనుల బకాయిలు వెంటనే చెల్లించాలి.

(9) పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టి ఉపాధికి గ్యారెంటీ కల్పించాలి.

(10)ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అసంఘటిత కార్మికులందరూ అర్హులయ్యేలా చర్యలు చేపట్టాలి.

# ఉపాధి చట్టాన్ని కాపాడుకుందాం పని దినాలు, వేతనాలు పెంచాలి. పట్టణ ప్రాంతాలలో అమలు చేయాలి

వామపక్ష పార్టీల పోరాటాలు, 2004లో వామపక్షాల సహకారంతో యుపిఎ 1 ప్రభుత్వం ఏర్పడింది. వామపక్షాల ఒత్తిడితో ఉపాధిహామీ చట్టం వచ్చింది. ఒకప్రక్క వ్యవసాయ రంగంలో యంత్రాలు రావడం, ఆహార ధాన్యాల స్థానంలో ఆక్వా, వ్యాపార పంటలు రావడం వల్ల కూలీలకు పనులు లేకుండా పెద్ద ఎత్తున వలసలు పోతున్నారు. ఆటువంటి సమయంలో ఉపాధిహామీ వల్ల పేదలకు పట్టెడన్నం దొరకుతుంది. ఎండా కాలంలో ఏ పనులు దొరకక వ్యవసాయ కూలీలు మొదలుకొని డిగ్రీ చదువుకున్న యువతీ, యువకులు కూడా ఉపాధి పనులకు వెళుతున్నారు. కరోనా సమయంలో ఉపాధిహామీ చట్టం దేశ వ్యాప్తంగా గ్రామీణ పేదలను ఆదుకున్నది. ఇటువంటి చట్టానికి మరింత నిధులు పెంచి అమలు చేయాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం దీని పీక నొక్కడానికి పూనుకున్నది. కాబట్టి ఈ చట్ట రక్షణ కోసం ప్రజలంతా ఉద్యమించాలని సిపిఎం పిలుపునిస్తున్నది.

మన రాష్ట్రంలో కోటి పది లక్షల మంది వ్యవసాయ కార్మికులు, మరో కోటి మంది చిన్నా, సన్నకారు రైతులు, వృత్తిదారులు ఉన్నారు. వీరికి ఉపాధిహామీ అనేది ప్రధాన వనరు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంత పేదలు, అసంఘటిత రంగ కార్మికులకు ఏడాది పొడవునా పని లేకుండా కుటుంబాలు గడవక పస్తులతో జీవిస్తున్నారు. భారత దేశం వెలిగిపోతుందన్న మోడీ పాలనలో ప్రపంచ దేశాలలో ఆకలి, దరిద్ర్యంలో 111వ స్థానానికి పడిపోయింది. ఒకే సారి చట్టాన్ని రద్దు చేస్తే పేదలు తిరగబడతారనే భయంతో ఈ పథకంలో అనేక షరతులు పెట్టింది. ఒక పూట బదులు రెండు పూటల పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. సమ్మర్ అలవెన్స్ రద్దు చేశారు. మంచినీళ్ళకు, పార, తట్ట, గడ్డపార పదునుకు ఇచ్చే డబ్బులు నిలిపి వేశారు. ఆన్‌లైన్ మస్టర్లు పెట్టి పేదలను హింస పెడుతున్నారు. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయించుకోవాలి. కూలీలకు కేటాయించే నిధులను రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం సిమెంట్ రోడ్లకు, భవనాలకు మళ్ళించి పేదల కడుపు కొడుతుంది.

**ఉపాధిహామీ ఉసురు తీస్తున్న బిజెపి, వైసిపి ప్రభుత్వాలు**

ఆనాడు వామపక్ష పార్టీల బలం ఉండబట్టి చట్టం సమర్థవంతంగా అమలు జరిగింది. సకాలంలో వేతనాలు వచ్చాయి, కనీస సౌకర్యాలు కల్పించబడ్డాయి. వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు కూడా ఉపాధి పని దొరికింది. ఈ కారణంగా వ్యవసాయరంగంలో కూడా రోజు వేతనాలు పెరిగాయి. ఈ ఫలితంగా పేదలలో భూస్వాములతో భేరమాడే శక్తి పెరిగింది, వలసలు తగ్గాయి పేదల కొనుగోలు శక్తి పెరిగింది. దీనిని భరించలేని భూస్వాములు వాళ్ళు పిలిచినప్పుడు కూలీలు రావడంలేదని, మా మాట వినటం లేదనే అక్కసుతో ఈ చట్టాన్నే రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఒత్తిడి చేశారు. గ్రామీణ సంపన్నులు, పెట్టుబడిదారుల ఒత్తిడికి తలొగ్గిన బిజెపి ప్రభుత్వం ఈ పథకానికి పూర్తిగా నిధులు తగ్గించింది. 2022- 23 బడ్జెట్‌లో లక్ష కోట్లు కేటాయిస్తే 2023-24 బడ్జెట్‌లో 70వేల కోట్లకు కుదించింది. ఈ కారణంగా అడిగిన వారందరికి పనులు ఇవ్వడం లేదు.

**రెండు పూటల ఎందుకు పని చేయాలి?**

ఉపాధి చట్టంలో పని చేసే కార్మికులకు కొలతలు ప్రకారంగా వేతనాలు ఇస్తారు తప్ప రోజు కూలి కాదు. పేదలు ఎన్ని గంటలు పని చేయాలని నిబంధన లేదు. మన రాష్ట్రంలో కూలీలు పొద్దు పొడవక ముందే పనికి వెళ్ళి 11గం॥ల తరువాత ఇళ్ళకు చేరుకుంటున్నారు. ఎర్రటి ఎండలో చేతులు బొబ్బలెక్కెలా పని చేసినా రోజుకు రూ. 150 నుండి 200/-లకు మించి కూలి రావడం లేదు. చేసిన పనికి ప్రతి వారం కూలి చెల్లించాలని చట్టం చెబుతుంటే నెలలు తరబడి వేతనాలు అందక పూట గడవని పేదలు ఈ పనిపట్ల ఆనాసక్తి చూపిస్తున్నారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు కావాల్సింది కూడా ఇదే. పేదలు పనికి రాకపోతే ఆ డబ్బులను వారు బొక్కేయొచ్చని పన్నాగం పన్నుతున్నారు. అదే వామపక్ష పార్టీలు పాలనలో ఉన్న కేరళ రాష్ట్రంలో వ్యవసాయ పనులలో స్త్రీ, పురుషులనే తేడా లేకుండా రోజు కూలి రూ. 650/-లు ఇస్తున్నారు. ఉపాధిహామీ పనులకు రూ. 350/-లు చెల్లిస్తున్నారు. అంతేగాకుండా గ్రామీణ పేదలకే కాకుండా కేరళ ప్రభుత్వం తమ రాష్ట్ర నిధులతో పట్టణ ప్రాంత పేదలకు కూడా ఉపాధిహామీ పనులు కల్పించి దేశంలోనే ఆదర్శంగా నిలించింది.

**సమ్మర్ అలవెన్స్:** చట్టం ప్రారంభం అయినప్పటి నుండి ఎండా కాలంలో 20% నుండి 30% వరకు సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారు ప్రస్తుతం రద్దు చేశారు. దీనివల్ల ఎర్రటి ఎండలో చేతులు బొప్పలెక్కెలా పని చేసినా గిట్టుబాటు కూలి రావడం లేదు.

కావాలనే బిజెపి, వైసిపి ప్రభుత్వాలు సమ్మర్ అలవెన్స్ రద్దు చేశాయి. కాంట్రాక్టర్లు పని చేయక ముందే వేలకోట్లు ముందస్తు అడ్వాన్సులు ఇస్తున్న ప్రభుత్వాలు పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**కనీస సౌకర్యాల కొరత :** పనిచేసే చోట భద్రత, మంచినీళ్ళు రూ.5/-లు,టెంట్, 5 కి.మీ దూరం మించి పనికి వెళ్ళాల్సి వస్తే రాను పోను చార్జీలు, గునపం సానకు డబ్బులు, తట్టకు రూ.5లు, మేట్లకు రూ.5లు, గాయాలైతే ప్రాథమిక చికిత్స కిట్లు, ఐదుగురి పిల్లలకు ఒక ఆయాను, గర్భిణీలు, వృద్ధులు, వికలాంగులు చేయగలిగే పనులు ఇవ్వాలని చట్టమే చెబుతుంది. నేడు బిజెపి ప్రభుత్వం ఇవన్నీ రద్దు చేసింది. చూస్తూ ఉండేదానికన్నా తిరగబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీసి రద్దు చేసిన వాటిని సాధించుకోవాలి.

**మస్టర్లు :** చట్టం ప్రారంభం నుండి మస్టర్లలో అటెండెన్స్ వేసుకొని ప్రతి శనివారం కొలతలు వేసి ఒక్కొక్క మనిషికి ఎంత వేతనం వస్తుందో తెలుసుకోవడానికి పే స్లిప్‌లు ఇచ్చేవారు. నేడు అవన్నీ రద్దు చేసి ఆన్‌లైన్‌లో అటెండెన్స్ తీసుకోవాలని నిర్ణయించింది. పని చేసే చోట నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోతే అప్‌లోడ్ కాక చేసిన పని కూడా వృధా అవుతుంది, మస్టర్ కూడా పడదు. ఇది ఎంత దుర్మార్గం? రాష్ట్రంలో చాలా గ్రామాలలో ముఖ్యంగా ఏజెన్సీలో ఫోనే పని చేయదు. నెట్ ఎక్కడుంటుంది.

గతంలో ప్రతి 10-20 మంది గ్రూపుకు ఒక మేట్ ఉండేవాడు. నేడు వైసిపి ప్రభుత్వం వారిని తొలగించి రాజకీయ ప్రయోజనాలతో సైట్ సూపర్‌వైజర్స్‌ను నియమిస్తున్నది. వీరికి కనీసం ఫోన్ కూడా ఇవ్వలేదు. కొన్నిచోట్ల క్షేత్రస్థాయి సిబ్బంది పై అధికారులు, రాజకీయ నాయకులతో కుమ్మక్కై పని చేయని వారి దొంగ మస్టర్లు చేర్పించి డబ్బులు మింగుతున్నారు. మొత్తం మీద ఉపాధిహామీ పీక నులమడానికి బిజెపి, వైసిపి ప్రభుత్వాలు పూనుకున్నాయి.

# ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం - హామీలు - అమలు

- కె.ఎస్. లక్ష్మణరావు

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలుగా విభజించటానికి చేసిన చట్టం 2014 జూన్ 2 నుండి అమలులోకి వచ్చినది. విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేదు. విశాఖపట్నం నగరంలోగల పరిశ్రమలను మినహాయిస్తే మిగిలిన రాష్ట్రం పారిశ్రామికంగా వెనుకబడి ఉన్నది. అనేక జిల్లాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. ఈ చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చినది.

1. **సెక్షన్ 46:** రాయలసీమ, ఉత్తర ఆంధ్రాలోని 7 జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించాలి. ఈ ప్రాంతాల అభివృద్ధికోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి. బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేకప్యాకేజీ ఉంటుందని హామి ఇచ్చారు. కానీ మూడేళ్ళపాటు కేవలం 1,050 కోట్లు ఇచ్చారు. ఆ తరువాత ఆ ఊసే లేదు.
2. **సెక్షన్ 90:** పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. ప్రజా ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రం స్వీకరిస్తుంది. పర్యావరణం, అటవీ, పునరావాస, పునర్నిర్మాణం అనుమతులన్నింటిని కేంద్రం ఇవ్వాలి.
3. **సెక్షన్ 94 (4):** విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, శాసనసభ, శాసనమండలి తదితర మౌలిక వసతులతో కొత్త రాజధాని నిర్మాణం కోసం కావలసిన సౌకర్యాలు సృష్టించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మద్ధతు ఇవ్వాలి. రాజధాని నిర్మాణానికి కేంద్రం కేవలం 1500 కోట్లు ఇచ్చినది. రాజధాని విషయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా దొంగనాటకాలు సాగించినది.
4. **సెక్షన్ 95 :** రాజ్యాంగంలో 371(డి) నిబంధన ప్రకారం ఉన్నత విద్యలో రెండు రాష్ట్రాలలలో పదేళ్ళపాటు ఉమ్మడి అడ్మిషన్ ప్రక్రియ కొనసాగించాలి. ఆ విధంగా కొనసాగలేదు.
5. **షెడ్యూల్స్ 9,10:** షెడ్యూల్ 9లో గుర్తించిన 90 సంస్థలను, షెడ్యూల్ 10 లో గుర్తించిన 107 సంస్థలను ఉమ్మడి ఆస్తులుగా గుర్తించి, వాటిని 52:48 పద్ధతిలో పంచుకోవాలి. ఆ విధంగా జరగలేదు.
6. **షెడ్యూల్ 13:** ఉన్నత విద్యకు సంబంధించి 10 జాతీయ విద్యాసంస్థలను ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయాలి. వీటికి 11 వేలకోట్లు ఖర్చు చేయాలి. వీటిలో 8 సంస్థలను ఏర్పాటు చేశారు. కాని ఇప్పటి వరకు కేటాయించినది కేవలం 3 వేలకోట్లు మాత్రమే. ఆ సంస్థలకు ఇప్పటికీ మౌలికవసతులు లేవు.
7. **షెడ్యూల్ 13 (మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు):**

    ఎ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దుగ్గరాజపట్నం వద్ద కేంద్రప్రభుత్వం దశలవారీగా నూతన భారీ నౌకాశ్రయాన్ని నిర్మించి మొదటిదశ 2018 నాటికి పూర్తి కావాలి.

    బి) ఆంధ్రప్రదేశ్‌లో కడప జిల్లాలో సమగ్ర, భారీ ఉక్కు కర్మాగారం సెయిల్ సహకారంతో నిర్మించాలి.

    సి) ఆంధ్రప్రదేశ్ లో గ్రీన్‌ఫీల్డ్ ముడి చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో రసాయన సముదాయాన్ని నెలకొల్పాలి.

    డి) విశాఖపట్నం - చెన్నై పారిశ్రామిక కారిడార్ ఆవకాశాలు పరిశీలించాలి.

    ఇ) విశాఖపట్నంలో కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేయాలి.

    ఎఫ్) ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నుండి హైదరాబాద్‌కు ర్యాపిడ్ రైలు, రోడ్డు అనుసంధాన్ని చేయటానికి కేంద్రం చర్యలు తీసుకోవాలి.

    జి) విశాఖపట్నం, విజయవాడ - గుంటూరు - తెనాలిలో మెట్రో రైలు సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో అమలు చేయవలసిన పైఅంశాలు పరిశీలిస్తే 2014 జూన్ నుండి ఇప్పటి వరకు నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం 5 కోట్ల ఆంధ్రులకు ఎంత అన్యాయం చేసిందో అర్థమౌతుంది. మౌలిక సదుపాయాలలో భాగంగా ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదు. ప్రత్యేక హోదా ఇవ్వలేదు. 2014- 19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గాని, 2019- 23 మధ్య ఉన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గాని విభజన హామీలు అమలులో కేంద్రంపై ఒత్తిడి తేవటంలో పూర్తిగా విఫలం చెందారు.

## డిమాండ్లు

- ★ కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిహామీకి రూ. 2లక్షల కోట్లు కేటాయించాలి. రాష్ట్రం 10% నిధులు ఇవ్వాలి.
- ★ కుటుంబానికి 200 రోజులు పని, రూ. 600/-లు వేతనం.
- ★ పట్టణ ప్రాంతాలలో అమలు చేయాలి.
- ★ రెండు పూటల పని రద్దు చేయాలి. సమ్మర్ అలవెన్స్ 40% ఇవ్వాలి.
- ★ పని చేసే చోట కనీస సౌకర్యాలైన టెంట్, నీళ్ళు, మెడికల్ కిట్ ఇవ్వాలి.
- ★ నీళ్ళకు రూ. 10/-లు, గునపం సానకు రూ. 50/-లు, తట్టకు రూ. 20/-లు ఇవ్వాలి.
- ★ ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలి. పే స్లిప్‌లు ఇవ్వాలి.
- ★ క్షేత్రస్థాయి మేట్లకు స్మార్ట్ ఫోన్, రూ.5/-లు పారితోషికం ఇవ్వాలి.
- ★ యంత్రాలు, కాంట్రాక్ట్ పద్ధతి రద్దు చేయాలి.

# కౌలు రైతుల సమస్యలు- ప్రత్యామ్నాయాలు

బిజెపి పార్టీ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. కానీ రైతుల ఆదాయం రెట్టింపు కాదు కదా కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. ఏర్పడింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయలేమని సుప్రీంకోర్టుకు చెప్పి పిచ్చి లెక్కలేసి మద్దతు ధరలు ఇస్తున్నామని రైతాంగాన్ని మోసం చేస్తుంది. పైగా మూడు వల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నించింది. విద్యుత్ సంస్కరణలు తెచ్చి వ్యవసాయానికి గొడ్డలిపెట్టుగా తయారు చేసింది ఢిల్లీలో రైతాంగం 13 నెలల సుదీర్ఘ పోరాటం అనంతరం వ్యవసాయ చట్టాలు వెనక్కి తీసుకుంటామని, విద్యుత్ సంస్కరణలు అమలు చేసే ముందు రైతు సంఘాలతో చర్చించి ముందుకెళతామని హామీ ఇచ్చారు. కానీ కేంద్రప్రభుత్వం తన చట్టాలను దొడ్డి దారిన అమలు చేయడానికి ప్రయత్నిస్తుంది. కౌలు రైతులను గుర్తించనని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణం. కేంద్రం ఇస్తున్న ప్రధానమంత్రి సమ్మాన్ నిధి రూ.6000/ – లు కౌలు రైతులకు ఇవ్వడం లేదు. మిగతా రైతాంగానికి ఇస్తున్న ఏ రాయితీ కూడా కౌలు రైతులకు వర్తింప చేయటం లేదు. బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ప్రధానమంత్రి సమ్మాన్ నిధి ఇవ్వడం లేదు. అంటే అమ్మినవారికి, కొత్తగా కొనుక్కున్న రైతులకు కూడా ఇవ్వటం లేదు.

మన రాష్ట్రంలో సగటున 70% మంది కౌలు రైతులు ఉంటారు ఇటీవల అధ్యయనాల ప్రకారం ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలో కూడా కౌలు రైతులు బాగా పెరుగుతున్నారు. సాగు మొత్తాన్ని కౌలు రైతుల నెత్తికెత్తుకుని మోస్తున్నా ప్రభుత్వం నుండి ఏ సహాయం, భరోసా అందటం లేదు. ఈ స్థితిలో కౌలు రైతులను ఆదుకోవడానికి రైతాంగ పోరాటాలు, ఆందోళనల నేపథ్యంలో 2011లో అప్పటి ప్రభుత్వం రుణ అర్హత కార్డులు చట్టం తెచ్చింది. భూయజమాని అనుమతి లేకపోయినా కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా కార్డులు ఇచ్చేవారు. కౌలు రైతులకు పూర్తిగా న్యాయం జరగలేదని వ్యవసాయ శాఖ, ఋణ అర్హత కార్డులకు తోడు, సాగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. అయినా ఎక్కువశాతం మంది కౌలు రైతులకు కార్డులు అందలేదు. ఈ స్థితిలో 2019లో రాష్ట్ర ప్రభుత్వం పంట సాగు హక్కు పత్రం (సిసిఆర్సి) చట్టం తెచ్చింది. కార్డులు ఇవ్వడానికి భూ యజమాని సంతకం తప్పనిసరి చేసింది దీనితో భూయజమానులు సంతకం పెట్టడానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా గతంలో వచ్చినన్ని కార్డులన్నా నేడు కౌలు రైతులకు అందడం లేదు. రుణం, నష్టపరిహారం, భీమా, రైతు భరోసా రావడం లేదు. చివరకు పంట అమ్ముకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.

రాష్ట్రంలో 30 లక్షల మంది కౌలు మీద ఆధారపడిన కుటుంబాల వారు ఉన్నారు. 2019లో ఎల్ సి కార్డులు, 7,14,000 ఇచ్చారు. రెండు లక్షలకు పైగా సాగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 2023లో సుమారు 7 లక్షల 70 వేల మందికి సిసిఆర్ కార్డులు వచ్చాయి. పై అంకెలు పరిశీలిస్తే కౌలు రైతుల యెడల పాలకవర్గాల శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. సాగు ధ్రువీకరణ పత్రం లాంటి కొత్త పథకాన్ని రూపొందించి కౌలు రైతులకు అందించాలి. దేవాలయ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి పంట సాగు హక్కు పత్రాలు ఇచ్చేది కూడా ప్రభుత్వమే కానీ రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాలకు పైగా దేవాలయ భూములను తౌలుదారులు సాగు చేస్తున్నారు. అయినా దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు కార్డులు ఇవ్వడంలో ప్రభుత్వ అశ్రద్ధ ఉంది. ఈ సంవత్సరం కేవలం 3000 మందికి మాత్రమే దేవాలయ భూముల కౌలు రైతులకు రైతు భరోసా వచ్చిందంటే ఎంత తక్కువమందికి ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. దేవాలయ భూములు క్రమంగా రాజకీయ నాయకులు, భూస్వాములు, పెద్దల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. దేవాలయ భూములను భూమిలేని పేదవారికి కౌలుకి ఇవ్వాలని,

దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, ప్రకారం పంట రుణాలు, ఇతర అన్ని సదుపాయాలు వర్తింప చేయాలి.

అర్.ఓబు గైడ్ లైన్స్ ప్రకారం పంటలు సాగు చేసిన వారికి పంట రుణాలు ఇవ్వాలి. సాగు చేయని భూయజమానులే పంట రుణాలు తీసుకుంటున్నారు. మొత్తం పంట రుణాలలో కౌలు రైతులకు 10% మాత్రమే ఇవ్వాలని బ్యాంకరు ప్రణాళిక తయారు చేశారు. ఈ సంవత్సరం కౌలు రైతులకు 4 వేల కోట్ల రూపాయలు పంట రుణాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. 7.7 లక్షలు సిసిఆర్ కార్డులు వస్తే కేవలం లక్ష మందికి కూడా బ్యాంకు రుణాలు అందలేదు. ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలి. సున్నా వడ్డీ పథకాన్ని లక్షలకు పెంచి వడ్డీ రాయితీని ప్రతి కౌలు రైతుకు వర్తింప చేయాలి. పంట వేసిన వారి పేరుతోనే ఈ క్రాపింగ్ చేయాలి. కార్డు లేకపోయినా, యజమాని ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులు, కౌలు రైతుల పేరుతోనే ఈ క్రాపింగ్ చేయాలి.

1) భూ యజమాని సంతకం తొలగించి గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
2) కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింపచేయాలి. 3) కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు, పంట నష్టపరిహారాలు, పంటల భీమా ఇవ్వాలి.
3) దేవాలయ భూములు కౌలు చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలి. 5) భూమిలేని ప్రతి కౌలు రైతుకి కులంతో సంబంధం లేకుండా రైతు భరోసా ఇవ్వాలి.
4) కౌలు రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.
5) కేరళ తరహాలో రైతులు, కౌలు రైతులను ఋణ విముక్తి చేయాలి.
6) కేరళ తరహాలో వరి, కొబ్బరి, ఆక్వా, కూరగాయలు, పాడి, అరటి, ఇతర అన్ని పంటలకు మద్దతు ధరలు.
7) రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి కొనుగోలు చేయాలి.
8) కౌలు రైతుల పేరుతోనే ఈ క్రాపింగ్ చేయాలి.

# విద్యుత్ సంస్కరణలు - ప్రజలపై భారాలు

విద్యుత్ బిల్లులు చూడగానే షాక్ కొడుతోంది. పెరిగిన బిల్లులతో జనం గగ్గోలు పెడుతున్నారు. విద్యుత్ వాడకం పెరగటం కాదు. ప్రభుత్వం ట్రూప్, ఎస్.పి.పి.సి సర్దుబాటు చార్జీల పేరుతో మూడు పోట్లు పొడిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయి ప్రజలకు షాక్ ఇస్తున్నాయి. గత సంవత్సరం కరెంటు చార్జీలు పెంచి 1400 కోట్ల రూపాయల భారం మోపింది. స్లాబులు మార్చేశారు. గత పది ఏళ్ల నుంచి వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో జనం నెత్తిన తాజా భారం వేశారు. ఈనెల బిల్లులో 2014 సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్ళీ యూనిట్ 20 పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్తు యూనిట్కు మరో 20 పైసలు, 2023 ఏప్రిల్ నెలల్లో ఉ పయోగించిన కరెంటుకు యూనిట్కు 40 పైసలు కలిపి మొత్తం యూనిట్కు 80 పైసలు చొప్పున జనం నెత్తిన బండ వేశారు. మరో రెండు కోట్లు భారం వేసేందుకు ప్రభుత్వం పూనుకుంటుంది. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ఇక ప్రతి నెల వంటగ్యాస్ లాగానే కరెంటు చార్జీలు కూడా పెంచడానికి ఆదేశాలు ఇచ్చేశారు. కరెంట్కి బిల్లులే కాకుండా ఫిక్స్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారు. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయి.

ప్రపంచంలో కరెంటు చార్జీలు తగ్గాయి. ఒకనాడు సోలార్ విద్యుత్ యూనిట్ 12 రూపాయలు ఉండగా, ఇప్పుడు ఉత్పత్తి ఖర్చు తగ్గి రెండు రూపాయలకు రేటు పడిపోయింది. నిజంగా కరెంటు చార్జీలు తగ్గించాలి. అయినా తగ్గించకుండా ఎందుకు పెంచుతున్నారు? దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలే కారణం. విద్యుత్ రంగాన్ని అదాని తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారు. విదేశాల బొగ్గు దిగుమతి చేసేది, బొగ్గు రవాణా చేసే ఓడరేవులు అదానీవే. ఇప్పుడు తాజాగా స్మార్ట్ మీటర్లు తయారు చేసే కంపెనీ అదానీ ప్రారంభించారు. ఇలా విద్యుత్ రంగం మొత్తాన్ని అదానీ, కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్ళిపోతుంది. ప్రభుత్వాలు వారికి దోచిపెడుతున్నాయి. అందుకే మన జేబులు ఖాళీ చేస్తున్నారు. చార్జీలు పెంచుతున్నారు. రాజకీయ అవినీతి పరులు, కార్పొరేట్లు, పాలకులు కుమ్మక్కైపోయారు. రెండు మూడు రూపాయలకు కొనాల్సిన విద్యుత్తు బహిరంగ మార్కెట్లో 10 నుండి 20రూపాయలు నిబంధనలకు కొంటున్నారు. విరుద్ధంగా హిందూజా సంస్థకు 1200 కోట్ల రూపాయలు అప్పనంగా చెల్లించారు. రేపో, మాపో సర్దుబాటు చార్జీల పేరుతో మళ్లీ ఈ భారం ప్రజలపైనే వేస్తారు. వ్యవసాయ పంపు చెట్లకు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్ ఎసరు పెట్టబోతున్నారు. 200 యూనిట్లు లోపు వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తానని మాట చెప్పి జగన్ మాట తప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు క్రమంగా నీరుగారుస్తున్నారు. చిరు వ్యాపారులకు విపరీతంగా రేట్లు పెంచారు. మున్సిపాలిటీలు

వాడే కరెంటు బిల్లులు పరోక్షంగా జనం నెత్తినే పడతాయి. వ్యాపార సంస్థలు, పరిశ్రమలపై భారం పెరిగి అవి అంతిమంగా ప్రజలపైనే పడుతుంది. మళ్లీ ఇప్పుడు ప్రతి ఇంటికి, షాపుకు స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారు. దానికి ఖర్చు ప్రతి కనెక్షన్పై సుమారు 13000 వరకు ఉంటుంది. అదాని కంపెనీకి కాంట్రాక్ట్ ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని జనమే చెల్లించాలి. ఒకసారి కట్టమంటే జనం తిరగబడతారు. అందుకే. నెలకు 120 నుండి 150 రూపాయలు వరకు, పది సంవత్సరాలు పాటు వసూలు చేయటానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఈ మీటర్ వస్తే ముందు డబ్బు చెల్లించి సెల్ ఫోన్ మాదిరిగా ప్రీపెయిడ్ పద్ధతి కూడా వస్తుంది. ఏ గంట ఎంత కరెంటు వాడేమో లెక్క తెలుస్తుంది. డిమాండ్ను బట్టి గంట, గంటకు ఒక్కొక్క రేటు భవిష్యత్తులో నిర్ణయించే ప్రమాదం ఉంది. రాత్రిపూట ఎక్కువ రేటు ఉండే ప్రమాదం పొంచి ఉంది. అందుకే ఈ స్మార్ట్ మీటర్లు మన కొంపముంచుతాయి. ఈ మీటర్లతో అదానికే ప్రయోజనం. ప్రజలకు నష్టం. భారం అవుతుంది. అందుకే దీనిని ఆదిలోనే తిప్పి కొట్టాలి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు లొంగి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి సంస్కరణ పేరుతో చార్జీలు పెంచితే జనం తిరగబడ్డారు. రాష్ట్ర ప్రజల్ని సమీకరించి ప్రతిఘటింపజేయడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారు. నాడు కాంగ్రెస్ నేత వైయస్ రాజశేఖరరెడ్డి కూడా ప్రతిపక్ష ఎంఎల్యేగా నిరాహార దీక్ష చేశారు. కానీ నేడు ఆయన కుమారుడు జగన్ ప్రజలు తిరస్కరించిన విధానాలనే అమలు చేస్తున్నారు. కొత్త రూపాలలో జనాన్ని బాదేస్తున్నారు. మోడీ ప్రభుత్వం రీవ్యాంప్డ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ స్కీమ్ (ఆర్.డి.ఎస్.ఎస్) పేరిట రాష్ట్ర ప్రభుత్వం పై షరతులు విధిస్తోంది. వ్యవసాయానికి మీటర్లు బిగించాలని, ఇళ్లను ప్రీపెయిడ్మటర్లు పెట్టాలని అలా అయితేనే అధనపు అప్పులకు అనుమతి లభిస్తుందని బెదిరిస్తుంది. వై.సి.పి ప్రభుత్వం వాటికి తలొగ్గి ప్రజలపై భారాలు వేస్తోంది. కార్పొరేట్ల దోపిడీ అపితే, ప్రభుత్వాల అవినీతిని అరికడితే కరెంటు చార్జీలు పెంచకుండా తగ్గించవచ్చు. వ్యవసాయానికి ఉచితంగా ఎప్పుడూ ప్రజలకు ఇస్తున్న రాయితీలు కొనసాగిస్తూనే గృహవినియోగదార్లకు యూనిట్ రూపాయికే సరఫరా చేయవచ్చు. ఎలా తగ్గించచ్చో విద్యుత్ నియంత్రణ మండలిలో సిపిఎం, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు పలుసార్లు రాతపూర్వకంగా వివరించారు. అయినా ప్రభుత్వానికి పట్టలేదు. ఇక ప్రభుత్వంపై పోరు తప్పదు. ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలి.

## దళిత సమస్య - కులవివక్ష అంతానికి పోరాటం

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్ల తర్వాత కూడ దళితులు కులవివక్షను ఎదుర్కొంటున్నారు. బిజెపీ అధికారంలోకి వచ్చాక అగ్రకుల దురంహకారులు, మనువాదులు మరింత పెట్రేగిపోతున్నారు. హిందుత్వ పేరుతో  కుల వ్యవస్థకు ఎక్కడలేని గౌరవం కల్పిస్తున్నారు. భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలమైన లౌకిక భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేందుకు మనువాద మతోన్మాద కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. స్వాతంత్ర్య పోరాట ఫలితంగా డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఆధ్వర్యంలో తయారైన రాజ్యాంగం విద్య, ఉపాధి అవకాశాల్లో కొన్ని అవకాశాలు కల్పించింది. అందులో కొంత పురోగతి ఉంది. అయినా ఇప్పటికీ దేశంలోని అణగారిన తరగతులైన దళితులు, గిరిజనులు , మైనారిటీలు, మహిళలకు రక్షణ లేకుండా పోయింది. సామాజిక తరగతులకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించినా ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్పు చేసి మనుస్మృతిని దేశంపై రుద్దేందుకు బిజెపి ప్రయత్నిస్తుంది. ఈ నేపథ్యంలో భారత లౌకిక, ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

### దళితులపై అనాగరిక దాడులు

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుండే కులవివక్షపై పోరాడింది. కులవ్యవస్థకు పునాదిగా ఉన్న ఫ్యూడల్ వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించేందుకు అనేక విశాలపోరాటాలు చేసింది. ఈ పోరాటాల్లో వేలమంది నేలకొరిగారు. స్వాతంత్ర్యోద్యమానికి వెన్నుపోటు పొడిచిన శక్తులు మనం సాధించుకున్న హక్కుల్ని నేడు హరిస్తున్నాయి. మనువాద మతోన్మాద బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్ప్లాన్ను ఎత్తివేసింది. అత్యాచార నిరోధక చట్టాన్ని, రిజర్వేషన్లను నీరుగార్చింది. బిజెపి రాష్ట్రాలతో పాటు మన తెలుగు రాష్ట్రాల్లో దళితులపై దుర్మార్గమైన దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయి. సంవత్సరంలో సగటున 2 వేలకు పైగా రోజుకి 6 ఘటనలు జరుగుతున్నాయి.  మతోన్మాద మూకలు పేట్రేగిపోతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలకే పరిమితమైన దాడులు తెలుగు రాష్ట్రాలకు విస్తరించి పెరిగాయని జాతీయ క్రైమ్ రిపోర్ట్ తెలియజేస్తున్నది. బిజెపీ విధానాలతో రాజీ పడిన ఫలితమే ఇది. దళితులు ఎక్కువ సభ్యులు ఉన్న ఉత్తరప్రదేశ్, హర్యానా, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్,  తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లో దళితులపై దాడులు పెరిగాయి. దక్షిణాది రాష్ట్రాలలో మన రాష్ట్రం అగ్ర భాగాన ఉంది. కేరళలో అతి తక్కువ సభ్యులు ఉన్నాయి. కులాంతర వివాహాలు చేసుకున్న వారిని పరువు పేరుతో చంపుతున్నారు. వారికి రక్షణ లేకుండ పోతుంది. అనాగరికమైన సామాజిక బహిష్కరనలు కొనసాగుతున్నాయి. దళితులకు రక్షణ ఇవ్వాల్సిన పాలకులు ముద్దాయిలను కాపాడుతున్నారు. మనువాద మతోన్మాద బిజెపి మొదటి సారి అధికారంలోకి రాగానే అత్యాచార నిరోధక చట్టాన్ని సవరిస్తూ తీర్పులు వచ్చాయి. ఈ తీర్పుకు వ్యతిరేకంగా దళిత ప్రజాసంఘాలు, కమ్యూనిస్టులు అనేక ఉద్యమాలు చేశారు. చివరికి భారత బంద్ చేశారు. మనువాద మతోన్మాదుల ప్రవేట్ గుండాల కాల్పులకు 11

మంది యువ కిశోరాలు బలెయ్యారు . దీంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గినట్లు నటిస్తూ అత్యాచార కేసుల్లో ముద్దాయిలకు 41 సీఆర్పీసీ కింద బెయిల్ ఇప్పించుటకు కోర్టు తీర్పులను అడ్డంపెట్టుకుని పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చారు. ఉత్తర ప్రదేశ్ లోని హత్రాస్ ఘటనతో పాటూ మన రాష్ట్రంలో దళిత డ్రైవర్ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన శాసనమండలి సభ్యులు అనంతబాబు సహా అనేక మంది  సులభంగా బెయిల్ పొంది బయటకు వస్తున్నారు.

## సబ్ప్లాన్కు తూట్లు

దళిత, గిరిజన వాడల అభివృద్ధి కొరకు పది సంవత్సరాలు క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చేసిన పోరాటాల ఫలితంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించడం జరిగింది. ఈ పోరాటంలో సిపిఐ(యం) కీలకపాత్ర పోషించింది. సబ్ ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా తీసుకువస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని మోదీ నిలబెట్టుకోలేకపోయారు. మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయడంలో తీవ్రమైన వైఫల్యం చెందింది. సబ్ ప్లాన్ నిధులను నవరత్నాలకుమళ్లించడం వల్ల దళితవాడల అభివృద్ధి కుంటుపడింది. సబ్ప్లాన్ లక్ష్యమే దెబ్బతిన్నది.

మన రాష్ట్రంలో 84.69 లక్షలు (17.08%) దళిత జనాభా ఉన్నారు. వీరిలో 79.98% గ్రామీణ ప్రాంతంలో ఉన్నారు. 85% కుటుంబాలకు స్వంత వ్యవసాయ భూములు లేవు. 70.6% కుటుంబాలకు రక్షిత మంచినీటి సదుపాయాలు లేవు. 92.06% మాల, మాదిగ,  రెల్లి కాలనీలకు డ్రైనేజీ కాలువలు లేవు. 66.4% కుటుంబాలకు మరుగుదొడ్ల లేవు . 39.49% కుటుంబాలకు కరెంట్ సదుపాయం లేదు. మన రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న 200 యూనిట్ల ఉచిత కరెంట్ కు సాకులు పెట్టి బలవంతంగా బిల్లులు వసూలు చేస్తున్నారు.

పోరాట ఫలితంగా దళితులు, గిరిజనులకు దక్కిన భూములు అన్యాక్రాంతం కాకుండా 9/77 చట్టం వచ్చింది. కానీ వైసిపి ప్రభుత్వం దళిత, గిరిజనుల వద్ద ఉన్న భూములు పెద్దలకు కట్టబెట్టేందుకు చట్ట సవరణ చేసింది . ఈ చట్ట సవరణ దళితుల్ని ఆస్తి హీనుల్ని చేస్తుంది. స్వాతంత్ర్యానంతరం అసైన్డ్ భూములు పొందిన అసలైన లబ్దిదారులైన కుటుంబాల మహిళలకు పట్టాలు ఇవ్వాలి.

మోదీ ప్రభుత్వం నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో దళితుల హక్కులు కాలరాయడమే కాకుండ బుల్ డోజర్ రాజకీయాలు చేస్తుంది. విద్య ప్రవేటీకరించడం వల్ల షెడ్యూల్ కులాల పిల్లల పరిస్థితి మరింత దిగజారి పోయింది. షెడ్యూలు కులాల అక్షరాస్యత జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. దళితుల జాతీయ అక్షరాస్యత 66.1% ఉంటే ఆంధ్ర ప్రదేశ్ లో 64.47% ఉంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం విద్యారంగాన్ని నాశనం చెయ్యడమే కాకుండ దళితులను విద్యకు దూరం చేస్తోంది. అలాంటి దుర్మార్గమైన విధానాన్ని కేరళ రాష్ట్రంతో పాటు కొన్ని బిజెపి పాలిత రాష్ట్రాలు అమలు చెయ్యం అని చెప్పినా మన రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా అమలు చేస్తోంది.

## సంక్షేమ నిధుల జాడలేదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం పెడుతున్న బడ్జెట్ జనాభా ప్రాతిపదికన కేటాయింపు చేయడం లేదు. దళితుల సంక్షేమానికి 15% వరకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలిసి ఉంటే 8% కూడా కూడా కేటాయింపులు లేవు. కేటాయించిన నిధుల్లో విడుదల తక్కువ కాగా, ఖర్చులు ఇంకా తక్కువగా ఉంటోంది. మన రాష్ట్రంలో గత పదేళ్లలో (విభజనానంతరం) 123348.79 కోట్ల రూపాయలు కేటాయిస్తే 88701.09 కోట్ల రూపాయలు అంటే 74.90% ఖర్చు చేశారు.

1975 నుండి పనిచేస్తున్న ఎస్ సి కార్పోరేషన్ ను మూడు ముక్కలు (మాల , మాదిగ, రెల్లి ) చేసి ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించలేదు. యువతకు స్వయం ఉపాధి, శిక్షణ రుణ సదుపాయాలు లేకుండ చేసింది. ఎస్ సి కార్పోరేషన్ ద్వారా భూములు కొనుగోలు చేసి ఇవ్వాలని చెప్పినా సెంటు భూమి కొన్న పాపాన పోలేదు. ఉన్న భూములను ప్రభుత్వ అవసరాల పేరిట దళితుల నుండి లాక్కొంటున్నారు.

## స్మశానాలకు దిక్కులేదు

దళితులకు స్మశాన వాటికలు మరియు బాటలు లేక ఉన్న వాటిని ఆక్రమణలు జరిగిన పరిస్థితిలో వీటి కోసం కెవిపియస్ ఉద్యమం వల్ల రాజశేఖర రెడ్డి ప్రభుత్వం జీవో 1235 ఇచ్చింది. స్మశాన స్థలాలకు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని, లేనిచో ఎకరా ప్రవేట్ భూమి కొనివ్వాలని, ఆక్రమణ జరగకుండా ప్రహరీ, కంచె ఏర్పాటు చేసి బోరింగ్, కరెంటు సదుపాయాలు కల్పించాలని ఆ జీవోలో పొందుపరిచారు. ఆ జీవోను విస్మరించి వైసీపీ ప్రభుత్వం 45 రోజుల్లో స్మశాన స్థలాలు గుర్తించండి అని సిసియల్ 2-10-2022 మరో ఉత్తర్వులు ఇచ్చారు. అదికూడా అమలుకావడం లేదు.

## ఐక్య పోరాటమే శరణ్యం

**ఈ స్థితిలో కింది డిమాండ్ల సాధనకు విశాల ఐక్య ఉద్యమాల్లో కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.**

(1) ఎస్సీ,ఎస్టీ ఉప ప్రణాళికా చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలి. బడ్జెట్లో నిధులు 17.01% తప్పనిసరిగా  కేటాయించాలి. కేటాయించిన నిధులు విడుదల చెయ్యాలి . ఖర్చు చెయ్యని నిధులు మురిగిపోకుండా తదుపరి సంవత్సరానికి తిరిగి

కేటాయించి ఖర్చు చేయాలి.

(2) ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక కేసుల్లో 41 సిఆర్పిసి ప్రకారం స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చట్టాన్ని సవరించాలి. కౌంటర్ కేసులు పెట్టినా, రాజీలు చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి.

(3) ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, స్త్రీలపై అత్యాచారాల కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి కాలపట్టిక ప్రకారం త్వరితగతిన తీర్పులు వచ్చేట్లు చూడాలి.

(4) జస్టిస్ పున్నయ్య కమీషన్ కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలి. ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి దళిత, గిరిజన ప్రజాసంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి.

(5) కులవివక్షత, అంటరానితనంపై ప్రభుత్వమే ప్రచార క్యాంపెయిన్ నిర్వహించాలి. టోల్ ఫ్రీ నెంబర్ పెట్టాలి.

(6) నిలుపుదల చేసిన సంక్షేమ పథకాలను అమలు చెయ్యాలి.

(7) స్మశానాల అభివృద్ధి జీవో 1235 మరియు సిసిఎల్ఎ 2-10-2022 ఇచ్చిన ఉత్తర్వులు అమలు చెయ్యాలి.

(8) దళితులను హత్య చేసినా, శాశ్వత వికలాంగులను చేసిన వ్యక్తుల యొక్క ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధితులకు నష్ట పరిహారం ఇచ్చే చట్టాన్ని రూపొందించాలి.

(9) డప్పు కళాకారులు, చర్మకారులకు **వయస్సుతో నిమిత్తం లేకుండా** పెన్షన్ ఇవ్వాలి. 5 వేలకు పెంచాలి.

(10) అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి 3 సెంట్ల ఇంటి స్థలం, 2 ఎకరాల సాగుభూమి కేటాయించాలి. పక్కా ఇంట నిర్మాణానికి రూ.5 లక్షల ఇవ్వాలి.

(11) అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి. అసైన్డ్‌దారుల కుటుంబాల మహిళల పేరుతో పట్టాలివ్వాలి. అసైన్డ్ భూమికలిగి ఉన్న రెండున్నర ఎకరాలలోపు రైతుల్ని మినహాయించాలి.

(12)డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ తిరిగి ప్రారంభించాలి. విదేశీ విద్యోన్నతి కి నిధులు పెంచాలి.

(13) దళిత, గిరిజనులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు 300 యూనిట్లకు పెంచాలి.

(14)దళిత క్రైస్తవులను ఎస్ సి జాబితాలో కలపాలి.

(15)ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం. బ్యాక్‌లాగ్ పోస్టుల్ని భర్తీ చేయాలి. ప్రమోషన్స్‌లో రోస్టర్ పద్ధతిని పాటించాలి.

# గిరిజన సమస్యలపై

2023 అక్టోబర్ 9న కేంద్రంగా రాష్ట్ర గిరిజన అభివృద్ధిపై రాష్ట్ర సదస్సు సిపిఎం పార్టీ నిర్వహించింది. ఈ సదస్సులో గిరిజను సమస్యలపై గిరిజన అభివృద్ధి మీద ప్రణాళిక రూపకల్పన చేసింది. ఈ సదస్సుకు గిరిజనులు, గిరిజన మేధావులు, విద్యావంతులు, గిరిజన, అభివృద్ధిని ఆకాంక్షించే వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నది.

మన రాష్ట్రంలో 34వ ఆదివాసీ తెగలు నివసిస్తున్నారు. వీరు ప్రధానంగా పాత పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో గల ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తున్నారు. మొత్తం గిరిజన జనాభా 27,39, 919 మంది సుమారు 5.53 కాతంగా ఉన్నారు. అక్షరాస్యత 45 శాతం మాత్రమే జిల్లాల పునర్వవస్థీకరణలో భాగంగా పార్వతిపురం మన్యం, అల్లూరి సీతారామరాజు ఏలూరు జిల్లా పరిధిలో (ఈ 3 జిల్లాలలోని) 53 మండలాల్లో విస్తరించి ఉన్నారు. 35 మండలాలు షెడ్యూల్ మండలాలుగా ఉన్నాయి. పాడేరు, సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, చింతూరు, వీఆర్‌పురం, ఐటిడిఏల ద్వారా పాలన సాగుతోంది.

మిగత 5 జిల్లాలలో సుమారు 13 లక్షల మంది మైదానప్రాంత తెగలు ఉన్నారు. యానాది. ఎరుకల, సుగాలి, రెండు తెగలకు చెందినవారు. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు, కృష్ణ, అనంతపురం, కర్నూలు జిల్లాలలో ఉన్నారు. యానాదుల కోసం ప్రత్యేక ఐటిడి నెల్లూరులోనూ, చెంచుల కోసం మరో ఐటిడిఏ శ్రీశైలంలో పనిచేస్తున్నాయి. ఐటిడిఏలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావాల్సిన నిధులు రాక గిరిజన అభివృద్ధికి లేక ఐటిడిఏలు ఉత్సహ విగ్రహాలుగా వున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సమస్యలపై గిరిజన ప్రాంతంలో పోరాటానికి సిపిఎం సిద్ధపడుతుంది. దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు తీవ్రమైన భంగం కలుగుతుంది. వాలపై తీవ్రమైన అణిచివేత జరుగుతుంది. వామపక్షాలు పోరాడి సాధించిన అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తోంది.

15,6- షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా ఉన్న అడవి, భూమి సహజ వనరులు, హక్కులను హరిస్తుంది. అటవీ పర్యావరణ చట్టాన్ని సవరించి ఆదివాసీ ప్రాంతంలో అడవులు ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తుంది. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా ఉ న్న గ్రామసభ అధికారాలను ధ్వంసం చేస్తుంది. ఆదివాసీ సంకృతీ ఆధారాలు నాశనం చేసే ఆర్ఎస్ఎస్

మనువాద భావజాలం వ్యాప్తి చేస్తుంది. బిజెపి పాలన దేశాన్ని నుడి గుండంలో దించుతుంది. వైఎస్ఆర్ పార్టీ ప్రభుత్వం కేంద్రంతో పోరాడి హక్కులు సాధించడానికి బదులు రాష్ట్రాన్ని మోదీకి తాకట్టు పెట్టింది. టిడిపి, జనసేన బీజేపీకి తందాన అంటున్నాయి. ఈ స్థితి రాష్ట్రంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించి ఐక్య పోరాటాలే నిర్వహించి పాలక పార్టీలు విధానాలను ఎదుర్కోవడానికి మార్గం దీనితో పాటు మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి లౌకిక శక్తుల్ని ఐక్యం చెయ్యాలి. బిజెపిని ఒంటరి చేసి ఓడించడం, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాల ద్వారానే వామపక్ష ప్రజాతంత్ర వర్తుల సమీకరణకు మార్గం సుగమం అవుతుంది. ఈ క్రింది కనీస కార్యక్రమం ఆధారంగా ఈ శక్తులను ఏకం కావాలి. రాష్ట్ర గిరిజన సామాజిక న్యాయం గిరిజన సంక్షేమం, కార్మిక హక్కులు, ఉద్యోగ ఉపాధి, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు స్థానిక సంస్థలకు అధికారాలే లక్ష్యంగా ప్రత్యమ్నాయ కార్యక్రమంలో ఈ క్రింది అంశాలు ఉంటాయి.

1) ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు రక్షణ

ఎ) పార్లమెంట్ ఆమోదించిన 1980 అటవీ పర్యావరణ సవరణ చట్టం రద్దు చేయాలి. చట్టాన్ని యదావిధిగా కొనసాగించాలి.

బి) గ్రామసభల అధికారాలను రక్షించాలి.

సి) జి.ఓ నెంబర్ 3 కు చట్టబద్ధత కల్పించాలి.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి.

(డి) ఐటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు చేసి పోడు పట్టాలు మంజూరు చేయాలి.

2. గిరిజనులకు ఉచిత విద్య అందించాలి.

ఎ) ప్రతి గ్రామానికి ప్రాథమిక విద్య, విద్యాభివృద్ధికి స్కూల్స్ ఏర్పాటు,

(బి) ఏకలవ్య స్కూల్లో స్థానిక గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

(సి) గిరిజన జిల్లా కేంద్రాల్లో వున్న పాలిటెక్నిక్స్, ఐటిఐలను అభివృద్ధి చేయాలి. లేని చోట్ల మంజూరు చేయాలి.

3) గిరిజన యూనివర్సిటీ వెంటనే నిర్మించి తరగతులు ప్రారంభించాలి.

4) విద్యాహక్కు చట్టం అనులు చేయాలి. మాతృభాసతోనే ప్రాథమిక విద్యా బోధన చేపట్టారు.

(ఎ) మాతృభాష విద్యావాలంటీర్ల వ్యవస్థను బలోపేతం చేయాలి. భాషా వాలంటీర్లను పర్మినెంట్ చేయాలి.

(5) ఉచిత ఆరోగ్య సేవలు కల్పించాలి..

(ఎ) ఏజెన్సీలో గల పిహెచ్ సిలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. రక్తపరీక్షల ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి.

(బి) నిపుణులను నియమించాలి. వైద్య సిబ్బంది నియమాకం చేయాలి.

(సి) రంపచోడవరం, పాడేరు, అరకు, బుట్టయ్యగూడెం, మన్యం పార్వతిపురం కేంద్రంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి.

(డి) పాడేరులో నిర్మిస్తున్న వైద్య కళాశాలలో స్థానిక గిరిజనులకు 70% సీట్లు కేటాయించాలి.

(ఇ) అన్ని గిరిజన గ్రామాలకు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలి.

(ఎఫ్) 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలి.

(జి) పెన్షన్ 5వేలకు పెంచాలి.

(హెచ్) 5 లక్షల రూపాయలలో ఉచిత ఇళ్ళ నిర్మాణం చేపట్టాలి.

(ఐ) ప్రతి గిరిజనుడికి 5 ఎకరాల భూమి ఇవ్వాలి.

(జె) ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి 18 రకాల నిత్యావసర వస్తువులు అందించాలి. జిసిసిని బలోపేతం చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

(కె ) పివిటికి అదివాసులకు సిసిడిపి నిధులు విడుదల చేయాలి. అర్హులకు అంత్యోదయకార్డులు మంజూరు చేయాలి.

(ఎల్) ఇరిగేషన్ సదుపాయాలు కల్పించాలి. చెక్డ్యామ్ నిర్మాణం చేయాలి. వ్యవసాయ యంత్రాలు సబ్సిడి ద్వారా ఇవాలి..

(ఎం) కాఫీ, జీడి, సుగంధ ద్రవ్యాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

(ఎన్) అన్ని సంతలలో గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. కోల్డ్ స్టోరేజీని నిర్మించాలి.

విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ చేయాలి.

(ఓ) గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్సీ ప్రతి ఏడాది భర్తీ చేయాలి.

(పి) వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలి.

(క్యూ) చిన్న తరహా మైనింగ్ వనరులను ఐటిడిఏ సహకారంతో స్థానిక గిరిజన సహకార సంఘాల ద్వారా తవ్వకాలు జరిపి ఉపాధి కల్పించాలి. బినామీ సహకార సంఘాలతో తవ్వకాలు జరుపుతున్న మైనింగ్ అనుమతులను రద్దు చేయాలి.

ఎఫ్) జిసిసిని రక్షించాలి, నిధులు పెంచాలి అటవీ ఉత్పత్తులు సేకరించి ఉపాధి కల్పించాలి. అరుకులో సబ్బుల తయారి కేంద్రాన్ని వెంటనే తెరవాలి.

(ఆర్) ఔషధ మొక్కలు, వనమూలికలు పరిశ్రమ ఏర్పాటు చేయాలి.

(ఎస్) స్థానిక సంస్థలకు 73, 74 రాజ్యాంగ అధికారాలు బదలాయింపు, పీసా చట్టం ప్రకారం అధికారాలు బదలాయించాలి.

(6) గిరిజన సంస్కృతి పరిరక్షణ

(ఎ) ఆదివాసీ కళలు, భాష, ఆధారాలు, పండుగలు రక్షించడం.

(7) అవినీతి నిర్మూలన సూపరిపాలన

(ఎ) అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయితీ నిధులు, విధులు అభివృద్ధి వికేంద్రీకరణ ప్రణాళిక

(ఎ) ప్రతి గిరిజన కుటుంబానికి 5 ఎకరాల భూమి, 10 ఎకరాల పోడు భూమి పట్టా, ఇళ్ళ స్థలాలు కేటాయించాలి.

(బి) గిరిజన ఉద్యోగస్తులను కూడా మండల కేంద్రాల్లో ఇళ్ళ స్థలాలు కేటాయించాలి. ఇక నిర్మాణానికి బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలి.

(8) నిర్వాసితులకు సంపూర్ణ పునరావాసం

(ఎ) పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులలందరికీ మండల యూనిట్లుగా పూర్తిస్థాయి పరిహారం, ఆర్ఆర్ ప్యాకేజీ అమలు.

– 1986 – 22 వరదల ఆధారంగా మునక గ్రామాలు గుర్తించాలి.

(బి) భూసేకరణ పునరావాస చట్టం 2013 ను పక్కగా అమలు చేయాలి.

(9) ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టబద్ధత..

(10) హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం వెంటనే రద్దు చేయాలి.

(11) జీలుగుమిల్లి ఆదాని ఆయుధ కర్మాగారం అనుమతులు రద్దుచేయాలి.

(12) నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు షెడ్యూల్ ప్రాంతంలో కలపాలి.

# మైనారిటీ సమస్యలపై

కేంద్రంలో 2014లో బిజెపి అధికారంలో వచ్చిన తర్వాత మైనారిటీలపై దాడులు పెరిగాయి. దేశ బడ్జెట్లో వరుసగా మైనారిటీలకు కేటాయింపుల్లో కోత, వివిధ పథకాల నిలిపివేత, కేంద్ర ప్రభుత్వ స్కాలర్షిప్పులో, ఆర్థికపరమైన దాడులే కాకుండా హిజాబ్, హలాల్, అజాన్, లవ్ జిహాద్ ఘర్ వాపసీల పేరుతో సామాజిక వేదింపులు అనిధివేత, సామూహిక దాడులకు బి.జె.పి. తెరలేపింది. ముస్లింలు మరియు దళితులపై గో రక్షక దళాల పేరిట ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసి హత్యాకాండలకు తలపడుతున్నారు. ఎన్.ఆర్.సి.సి.ఎ.ఎ. లాంటి దుర్మార్గమైన చట్టాలను తీసుకువచ్చి మత ప్రాతిపదిక పౌరసత్వం అంటూ ముస్లింల ఉనికే ప్రమాదంలో నెట్టివేయబడే స్థితి ఏర్పడింది. ముస్లింలను ప్రధాన జీవన స్రవంతి నుంచి వేరుచేసి రెండవ తరగతి పౌరులుగా మార్చడం అజెండాగా బి.జె.పి ప్రభుత్వ పాలన సాగుతున్నది. బిల్కిస్ భాను కేసులో దోషులను విడుదల చేయడం, మహిళల పట్ల వారికి ఏమాత్రం గౌరవం లేదనే విషయం స్పష్టం చేస్తుంది. ఎన్నికల సందర్భంగా మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మత పరంగా ప్రజలను విడదీసే ప్రయత్నాలు చేయడం, బుల్డోజర్ రాజకీయాలు, ప్రశ్నించే వారిపైన ఊపాలాంటి చట్టాలు ప్రయోగించి దేశద్రోహం పేరుతో జైళ్ళపాలు చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో మైనార్టీలకు అండగా నిలవాల్సిన వైయస్సార్సీపి ప్రభుత్వం కేంద్రంతో రాజీ పడుతూ బిజెపి దుర్మార్గ విధానాలను బే షరుతుగా సమర్థిస్తుంది.

రాష్ట్రంలో వై.యస్.ఆర్ పార్టీ అధికారంలో వచ్చి నాలుగున్నర ఏళ్లు గడిచినప్పటికీ మైనార్టీలకు సంబంధించి అభివృద్ధి మరియు సంక్షేమం విషయంలో పూర్తిగా వైఫల్యం చెందింది. వక్స్ ఆస్తుల పరిరక్షణ, దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, విదేశీ విద్య, దుకాన్ – మకాన్ ఏవీ అమలు చేయలేదు. ముస్లిం మైనార్టీలు: అత్యంత పేదరికంలో ఉన్నారని, విద్యా, ఉపాధి రంగాలలో వారికి ప్రత్యేక నిధులను కేటాయించి రిజర్వేషన్ల కల్పించడం ద్వారా వారి అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జస్టిన్ సతార్. మరియు జస్టీస్ రంగనాథ్ మిశ్ర కమీషన్లు చేసిన సిఫారస్లు రాష్ట్ర ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. మైనార్టీలను ఓట్ల వేసే యంత్రాలుగా మాత్రమే వై.సి.పి భావిస్తుంది. అటు సంక్షేమము ఇటు భద్రతా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఈ సదస్సు నిరసిస్తుంది. వెంటనే మైనార్టీలకు ప్రత్యేకమైన నిధులు కేటాయించి. విద్యార్హతతో నిమిత్తం లేకుండా దుల్హన్ పథకం ఒక లక్ష రూపాయలు విదేశీ విద్య వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, విద్యా, ఉపాధితోపాటు ప్రభుత్వపథకాలన్నింటిలో 10% రిజర్వేషన్, ఉర్దూ భాషాభివృద్ధి, 0% వడ్డీతో ప్రభుత్వ మూలధనంతో బ్యాంకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి మరియు కేంద్రంలోని బిజెపి మైనారిటీలపై చేస్తున్న. దాడులను ఖండించటమే కాక మైనార్టీలకు అండగా ప్రభుత్వం నిలవాలి.

## మహిళా సంక్షేమం సాధికారత లక్ష్యంగా విధానాలు మారాలి

ఆకలి, అవిద్య, అసమానతలు, వేధింపులు, అత్యాచారాలు, ఉపాధిలేమి, హీనమైన వేతనాలు, పెరుగుతున్న భారాలు కష్టాలు, కన్నీళ్లు అంతులేని వ్యధ. ఏ నిముషంలో ఏ విపత్తు పొంచి ఉందో తెలియని ఆందోళన. ప్రతిరోజు 86 మంది మహిళల మీద లైంగిక వేధింపుల కేసులు నమోదవుతున్నాయి. హింసకు సంబంధించి 1151 కేసులు నమోదవుతున్నాయి. 74% కేసులలో ఎలాంటి శిక్షలు లేవు. దిశా స్టేషన్ కు వస్తున్న ఫిర్యాదులలో 10 శాతం కూడా ఎఫ్ఐఆర్లు గా నమోదవడం లేదు. 16 సంవత్సరాల భవ్యశ్రీ కన్పించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆ అమ్మాయి శవాన్ని జనం చూసేవరకు పోలీసులకు పట్టనే లేదు. 2018 – 22 లలో 31 వేల మంది మహిళలు,బాలలు అదృశ్యమయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వాలు మద్యంపై వచ్చే ఆదాయాన్ని ఏటేటా పెంచుకుంటూ పోతున్నాయి. మద్యనిషేధం హామీని నీరుగార్చారు. ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహిస్తున్నా పారదర్శకతలేదు. మద్యం, మత్తుమందులు పోర్న్ సైట్స్ ప్రభావములో మహిళలపై నేరాల ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయి.

కోటి మంది ఉన్న డ్వాక్రా గ్రూపులను ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం వారి సభలకు శ్రోతలుగా తరలిస్తున్నారు. అనేక చోట్ల అధికారులు, రాజకీయ నాయకుల ప్రభావంతో పొదుపు మహిళలను అవినీతితో జలగల్లా పీడిస్తున్నారు. జగనన్న మార్టులకు ప్రభుత్వ సహాయం లేదు. ఇచ్చిన ఇళ్ల స్థలాలలో భారీ అవినీతి లేకపోతే అందరికీ అన్ని సదుపాయాలతో నివాస యోగ్యమైన ఇళ్ళ నిర్మాణం అయుండేది.

నూతన విద్యా విధానంతో ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఒంటరి మహిళల సంఖ్య పెరుగుతుంది. పోలవరం ప్రాజెక్టు కింద గిరిజన నిర్వాసిత కుటుంబాలు, రాజధాని సమస్యతో వేల మంది మహిళలు ఆందోళనతో రోడ్డెక్కుతున్నారు. నిత్యావసర సరుకులు రేట్లతో అప్పుల పాలవుతున్నారు. గ్రామీణ ఉపాధి చట్టాన్ని మోడీ ప్రభుత్వం నీరు గార్చుతున్నది. ఉద్యమిస్తున్న అంగన్వాడీలు, ఉపాధ్యాయులపై పోలీసుల నోటీసులు, కాపలాలు, బెదిరింపులు తప్పుడు కేసులు నిత్య కృత్యం అయ్యాయి.

మహిళల ఓట్ల కోసం ఎప్పుడు అమలు అవుతుందో స్పష్టత లేని రిజర్వేషన్ల చట్టం తెచ్చి మహిళలను మోసం చేస్తున్నాడు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకి మద్దతు ఇస్తున్నారు. మనువాద, పితృస్వామ్య అసమానతలను పెంచడంలో, కుల, మత వైషమ్యాల దాడులను జతగా చేసుకుని కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ విచ్చలవిడిగా అమలు చేయడంలో వైసీపీ, బీజేపితో కలిసి సాగుతున్నది. ప్రతిపక్ష టిడిపి జనసేన కూడా బిజెపిని బలపర్చడంలో పోటీపడుతున్నాయి.

స్వాతంత్రోద్యమ కాలం నుండే మత వాదుల ఆటంకాలను ఎదురొడ్డి బాల్యవివాహాల నిషేధంలో, సమాన ఆస్తి హక్కు కొరకు, విడాకులు హక్కు కొరకు స్త్రీ పురుషులు సమానత కొరకు మహిళలను ప్రోత్సహించి అండగా నిలిచి హక్కులను సాధించడంలో కమ్యూనిస్టులు ముందున్నారు. రాజ్యాంగ సవరణ కంటే ముందే ప.బెంగాల్ లో మహిళలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు ప్రకటించి అమలు చేసింది. మొట్టమొదటిగా స్త్రీల హక్కును గుర్తిస్తూ భూపంపిణీ, ఇళ్లస్థలాల పంపిణీలో జాయింట్ పట్టాలు ఇవ్వడం మొదలు పెట్టింది కూడా అక్కడే. మహిళను మిగిలిన పార్టీలకు భిన్నంగా పరిశ్రమల శాఖా మంత్రిగా నియామకం చేసింది కేరళ ప్రభుత్వం. కేరళలో పనిచేసే మహిళలకు కూర్చునే హక్కును కల్పించింది. మన రాష్ట్రంలో మహత్తర సారా వ్యతిరేక ఉద్యమంలో సీపియం ముఖ్య భూమిక పోషించింది. డ్వాక్రా మహిళలకు రుణాల సాధనలో, మైక్రోఫైనాన్స్ ఆగడాలను ఎదిరించడంలో ముందు పీఠిన నిలబడింది. 1996 నుండి మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని తక్షణం తేవాలని మద్దతిస్తున్నవి వామపక్షాలు మాత్రమే.

మహిళలు సాగిస్తున్న పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నది. హింసను వ్యతిరేకించడంలో, కార్మిక మహిళల వేతనాల సాధనలో అండగా నిలబడడంలో ముందు పీఠిన ఉంది. మన రాష్ట్రంలో మహిళలపై హింసను అరికట్టేందుకు త్వరితగతిన విచారణ పూర్తి చేసేలా, నేరాలు జరగకుండా స్త్రీలకు అన్ని విధాలా సాధికారత కల్పించేందుకు సిపిఎం కట్టుబడి ఉంది. మద్యం, మత్తుమందుల వ్యసనాన్ని నిర్వీర్యం చేయడం, మండలానికి ఒక షాప్ వరకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా మద్యం వలన జరుగుతున్న దుష్పరిణామాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. గ్రామీణ ఉపాధి చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంతో పాటు పట్టణ ఉపాధి చట్టాన్ని తేవాలి. చదువుకున్న యువతులకు నైపుణ్య శిక్షణ వివిధ రంగాల్లో ఇవ్వడం, విద్యా హక్కు మాదిరే ఉపాధి హక్కును కల్పించడం చేయాలని కోరుతుంది. ఇంటి శ్రమని గుర్తించని సామాజిక వివక్షత వలనే స్కీము వర్కర్లు చేస్తున్న శ్రమకు తగిన వేతనాన్ని ఇవ్వకుండా అణచివేస్తున్నారు. వారిని ఉద్యోగులుగా గుర్తించాలి.

మహిళల సమానత్వ సాధనకు, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు రాష్ట్రంలో మహిళా ఉద్యమాలను బలపరుస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలు మార్చుకోవాలని డిమాండ్ చేస్తుంది.

# వ్యవసాయ,ఆక్వారంగ సమస్యలు పరిష్కరించాలి

**దేశంలో, రాష్ట్రంలో వరి, ఆక్వాతో సహా అన్ని పంటల రైతులు చాలా తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు.** రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీగారు మాటలు నీటి మూటలై అప్పులు, ఆత్మ హత్యలు మాత్రం రెట్టింపయ్యాయి. పైగా కేంద్రం 3 రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి వ్యవసాయాన్ని, సాగుచేసే చేనుని రైతుకు దూరంచేసి కార్పోరేట్ శక్తులు, బడాబాబుల కబంధ హస్తాల్లో బంధించాలని చూసింది. ఢిల్లీ వీధుల్లో లక్షల మంది రైతాంగం సంవత్సరం పైగా ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి వణికి,కరోనాకు ప్రాణాలు ఎదురొడ్డి గుండె నిబ్బరంతో, ఆత్మస్థైర్యంతో పోరాడారు.

**వ్యవసాయ రంగం అభివృద్ధికి ఈ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు అమలు చేయాలని కోరుతోంది.**

1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలి. (ఇప్పటికీ దేశంలో 50–60 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు) ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.
2. రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు అన్ని రకాల బ్యాంకుల రుణాలు మాఫీ చేయాలి. కేరళ తరహాలో రాష్ట్రంలో రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలి.(లక్షల కోట్లు బడాబాబులు,కార్పోరేట్లకు మాఫీ చేస్తున్నారు)
3. రైతులకు వ్యవసాయపెట్టుబడులకు రూ.2.లక్షల వరకు సున్నా వడ్డీకి, రూ.5లక్షల వరకు పావలా వడ్డీకి బ్యాంకు రుణాలు ఇవ్వాలి.
4. వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లు గా మార్చే ప్రయత్నాలను విరమించుకోవాలి.సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రైవేటు వ్యాపారులు, కంపెనీల పరం కాకుండా సహకార సంఘాలను నిలబెట్టాలి.ఎరువుల ధరలు తగ్గించాలి.
5. ఆక్వా రైతుల చేపలు, రొయ్యలకు ధర కల్పించి ఆదుకోవాలి.నాణ్యమైన సీడ్,ఫీడ్ సరఫరా చేయాలి.విద్యుత్‌రాయితీ పునరుద్ధరించాలి.
6. ఎంపెడా, కేంద్ర వాణిజ్యశాఖ, రాష్ట్ర మత్స్యశాఖలు ఆక్వా రైతుల్ని ఆదుకునే ప్రణాళికలు చేపట్టాలి. అమలు చేయాలి.
7. కౌలురైతులు,దేవాలయ కౌలురైతులు వ్యవసాయ కార్మికులు, చేతివృత్తి దారుల సమస్యలు పరిష్కరించి వారిని అదుకోవాలి.
8. కాలుష్య నివారణకు ప్రభుత్వాలే బాధ్యత వహించి తగు చర్యలు చేపట్టాలి.వ్యాధులను అరికట్టాలి.అన్ని వ్యాదులను ఆరోగ్యశ్రీలోచేర్చాలి.
9. డెల్టా ఆధునీకరణ పనులు పూర్తిచేసి సాగునీరు, మురుగునీటి పారుదల, త్రాగునీటి వ్యవస్థలను మెరుగుపర్చాలి.
10. వ్యవసాయ, అనుబంధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.అవసరమైన కొత్తపోస్టులు ఇవ్వాలి.
11. ప్రతి మూడు నెలలకు ఒకసారి వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకర్లు, జలవనరుల శాఖలు రైతు, కౌలురైతు సంఘాలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించాలి.

# ప్రత్యామ్నాయ విధానాలతోనే అందరికీ ఉద్యోగం

రాష్ట్రంలో నిరుద్యోగ యువత సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం యువతకు తీరని ద్రోహం చేసింది. మోడీ చెప్పిన సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇవ్వలేదు, నల్లధనం బయటకు రాలేదు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా లేదు. విభజన హామీలు అమలు కాలేదు. కడప ఉక్కు, రామాయపట్నం పోర్టు నిర్మించి ఉంటే ఈపాటికి వేలమందికి ఉపాధి లభించి ఉండేది. మోడీ విద్రోహమే దీనికి కారణం. రెండు కోట్లు ఉద్యోగాలు గురించి అడిగితే బజ్జీలు, పకోడిలు అమ్ముకోండి అంటూ అమిత్ షా యువతకు ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఏ దేశంలోనైనా యువత యొక్క శక్తి సామర్థ్యాన్ని సక్రమంగా సరైన మార్గంలో ఉపయోగించుకుంటేనే ఆ దేశం అభివృద్ధి సాధ్యమవుతుంది. గత 76ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను నిర్వీర్యం చేశాయి.

దేశంలో గత 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ లెక్కలు చెబుతున్నాయి. సిఎమ్ఐఇ చెబుతున్న లెక్కల ప్రకారం 5 కోట్లమందికి తక్షణమే ఉపాధి కల్పించాలని లేదంటే దేశం తీవ్ర సంక్షోభంలో పడుతుందని హెచ్చరించింది. మోడీ అధికారంలోకి వచ్చాక 5 లక్షల చిన్న మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. వారి విధానాల వల్ల నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరిగింది. చదువుకు తగ్గ ఉద్యోగాలు రావడం లేదు. ఇంజనీరింగ్ చదివిన వారిలో 15 శాతం మందికి మాత్రమే వారి చదువుకు తగ్గ ఉద్యోగాలు వస్తున్నాయి. పిహెచ్‌డి, బిటెక్ చదివిన వారు సైతం పోలీస్ కానిస్టేబుల్ ఉ

ద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్న తీరే ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతుంది. కొందరు ఉపాధి పనికి పోతుంటే మరికొందరు ఆటోలు నడుపుకుంటున్నారు. నిస్పృహతో డ్రగ్స్‌కు, నేరాలకు అలవాటుపడుతున్నారు. ప్రభుత్వాలు యువతరాన్ని నేరస్తులుగా, ఉగ్రవాదులుగా మారుస్తున్నది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ ఆర్థిక విధానాలే నిరుద్యోగం పెరుగుదలకు ప్రధాన కారణం.

కేంద్ర ప్రభుత్వం నియమించిన కమల్ నాథన్ కమిటీ రిపోర్టు ప్రకారం ప్రకారం 13 జిల్లాలలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను గుర్తించేందుకు నిర్వహించిన సాధికారత సర్వేలో 34 లక్షల మంది నిరుద్యోగులన్నారని లెక్కలు తీశారు. గత తొమ్మిది సంవత్సరాల్లో రాష్ట్రానికి ఒక్క భారీ పరిశ్రమ రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి. కడప ఉక్కు ఫ్యాక్టరీ పెట్టకపోగా ఉన్న విశాఖ ఉక్కును అమ్మివేసే కుట్ర పన్నుతోంది.

**రాష్ట్రంలో యువత పరిస్థితి దారుణంగా ఉంది**

జగనన్న చెప్పిన 2.35 లక్షల ఉద్యోగాలు భర్తీ కాలేదు. ప్రతియేటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి నాలుగేళ్లలో ఒక క్యాలండర్ ఇచ్చి అందులో కూడా ఉద్యోగాలు లేకుండా విడుదల చేశారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు లేక మరోవైపు ఉపాధి పరిశ్రమలు రాక యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రతుకుదెరువు భారమై ఆత్మహత్యలు చేసుకోవడం లేదా మద్యం, డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటోంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాల్సిన యువత భవిష్యత్తు నాశనం అవుతుంటే అధికార పార్టీ ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి.

ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వని ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వమే. పార్లమెంటులో చెప్పిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 56వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి, రాష్ట్రంలో దాదాపు 9వేల పాఠశాలలో ఏకోపాధ్యాయునితో తరగతులు నిర్వహించడమంటే పేదల విద్య పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించడమే. లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూసే గ్రూప్ 1,2 నోటిఫికేషన్ రాలేదు. ఇప్పుడు ఎన్నికల ముందు హడావుడిగా ఎపిపియస్సి గ్రూప్ 1,2 కలిపి 500 పోస్టులు ఇస్తామని చెప్పడం దుర్మార్గం. కనీసం 7లక్షల మంది నిరుద్యోగులు గ్రూప్ 1, 2 కోసం ఎదురుచూస్తుంటే ఖాళీలతో సంబంధం లేకుండా నాయకులు, అధికారులు మాట్లాడుతున్నారు. స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు.

## డిమాండ్స్

1) ఆంధ్రప్రదేశ్ నూతన యూత్ పాలసీని ప్రకటించాలి.
2) కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 9.64 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టులను భర్తీ చేయాలి.
3) మెగా డీఎస్సీ ప్రకటించి 40వేల ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు పిఈటీలతో కలిపి భర్తీ చేయాలి. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి.
4) గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలకు 5వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి.
5) పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగ, ఉపాధి జి.వోను అమలు చేయాలి.
6) పే&ప్లే విధానాన్ని రద్దు చేసి క్రీడా రంగంలో శాశ్వత ప్రాతిపదికన కోచ్‌లను నియమించాలి. ప్రతి జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు భర్తీ చేయాలి.
7) ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలి.
8) ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.
9) కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సహా అన్ని రకాల ప్రభుత్వ నియామకాలలో రిజర్వేషన్లు అమలు చేయాలి. ప్రయివేటు రంగంలోను రిజర్వేషన్లు అమలు చేయాలి.
10) ప్రయివేటీకరణ విధానాలు విడనాడాలి. ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించాలి. విశాఖ ఉక్కును ప్రభుత్వ ం ం ం ం లో కొనసాగించి అభివృద్ధి చేయాలి.

# నేటి విద్యారంగం - ప్రత్యామ్నాయం

ప్రపంచాన్ని మార్చాలంటే శక్తివంతమైన ఆయుధం చదువొక్కటే అని చెప్పిన నెల్సన్ మండేలా నుండి అనేక మంది విద్య యొక్క ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. 70 ఏళ్ళ స్వాతంత్ర్యంలో విద్యలో అంతరాలు పెరిగాయి. విద్య సరుకుగా మారింది. ప్రధానంగా పేదవారికి వాణ్యమైన విద్య అమడదూరంలో నెట్టివేయబడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జాతీయ సగటు అక్షరాస్యత 77.6 ఆంధ్రప్రదేశ్ 6729 బీహార్, జార్కండ్, రాజస్థాన్, తెలంగాణలని మినహాయిస్తే ఇతర అన్ని రాష్ట్రాల కంటే వెనుకబడి ఉన్నాయి. జాతీయ సగటుతో పోల్చి చూస్తే మనం ఎక్కడో ఉండిపోయాం కేరళ రాష్ట్ర దరిదాపులకు కూడా రాలేకపోయాం. అందరికీ విద్య కోసం అందుబాటులో బడి ఉండాలన్న దృక్పథం ఇప్పటికీ లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

కాంగ్రెస్ పాలనలో విద్య కార్పోరేట్ల పరం అయితే, నేటి బిజెపి హయాంలో కొంతమందికే. చదువు అనే మనుధర్మ సిద్ధాంతపు దిశగా సాగుతుంది. అందుకోసమే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకు వచ్చింది. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రీకరణ చేస్తుంది. రాష్ట్ర స్థాయిలో ఉన్న అన్ని సంస్థలపై కేంద్రం అజమాయిషీ పెంచింది. ఉన్నత విద్య కేంద్ర సంస్థల (గుప్పెట్లోకి వెళుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలపై కూడా కేంద్రం పెత్తనం చేయబోతోంది. యూనవర్శిటీల స్వయం ప్రత్తిపత్తిన దెబ్బతీసే విదేశీ యూనివర్శిటీలను తీసుకువస్తుంది. అకడమిక్, పాలనాపరమైన ప్రజాస్వామ్యాలు అడుగంటి పోతున్నాయి. రిజర్వేషన్లు ఊసే ఉండదు. చరిత్రను మార్చే కుట్ర చేస్తుంది. అశాస్త్రీయ భావాలను చొప్పించేందుకు జ్యోతిష్యం లాంటి కోర్సులను కూడా పాఠ్యాంశాలలో చేరుస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే విద్యను మరింత వ్యాపారమయం చేసి విద్యార్థుల్లో కాషాయ బీజాలు నాటడమే దీని లక్ష్యం.

వీటిని రాష్ట్రంలో ఉన్న గత పాలకులు నేటి పాలకులు ఎర్రతివాచి పరిచి రాష్ట్రంలోకి ఆహ్వానించారు. కొనసాగిస్తున్నారు. విద్యలో విప్లవాత్మక మార్పులు తెస్తామని చెస్తున్న నేటి రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అధికార అమలు చేస్తూ, గోడలకు రంగులు వేసామని ఉచ్చాటాం చేసుకుంటూ, విద్యను పేద వారికి దూరం చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం, ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య లక్షలకు పడిపోయింది.

**నూతన విద్యా విధానం రాష్ట్రంలో అమలు**

నూతన విద్యా విధానం అమలుతో రాష్ట్రంలో పాఠశాల విద్యలో తరగతుల విలీనం, ఉన్నత విద్యలో నాలుగేళ్ళ డిగ్రీ విశ్వవిద్యాలయాలకు నిధులు కోత వంటివి ప్రభుత్వ విద్యలో తీవ్ర ప్రభావాన్ని చూపాయి. విలీనంతో పాఠశాలల మూసివేత. వెలవెలబోతున్నాయి. కేంద్రం నుండి వచ్చిన పాఠ్య పుస్తకాలను బోధిస్తున్నారు. ఈ పాఠాలు వాస్తవ చరిత్రను చెరిపి అవాస్తవాలను భోదిస్తున్నాయి. నాలుగేళ్ళలో అడ్మిషను తీవ్ర స్థాయిలో పడిపోయాయి. దీనిని రాష్ట్ర ప్రభుత్వ వేగంగా అమలు చేస్తూ కేంద్రానికి దాసోహం అంటుంది యువతకు ఉపాధిలేని చదువులు మాత్రమే లభించడంతో నాసిరకం విద్య మాత్రమే పేదలకు మిగలటంతో రాష్ట్రాభివృద్ధి కూడా దీనికి తగ్గట్టే నిలకడలేనిదిగా, ఉపాధి రహితంగా, స్థానిక అవసరాలకు దూరంగా ఉండిపోతోంది.

**అమలుకు నోచుకోని విభజన చట్టం హామీలు**

రాష్ట్ర విభజన సమయంలో విభజన చట్టం షెడ్యూల్ 13లో రాష్ట్రానికి 11 జాతీయ విద్యాసంస్థలు ఇస్తామని హామీ ఇచ్చారు. వాటి నిర్మాణం, అభివృద్ధి కోసం 11వేల కోట్లు ఖర్చు చేయాలి. కానీ ఇప్పటి వరకూ 3వేల కోట్లు రూ. మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికీ అనంతపురం సెంట్రల్ యూనివర్శిటీ అద్దె భవనంలో నడుస్తుంది. సరైన హాస్టల్ సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం గిరిజన విశ్వవిద్యాలయం విజయనగరం ఎయు పిజి కేంద్రంలో నడుస్తుంది. ఐఐఎం, పెట్రోలియం, ఎ.యూ.లో తాత్కాలిక భవనాలలో నడుస్తున్నాయి. ఎన్ఐడీఎం సదరన్ క్యాంపస్ తాత్కాలికంగా అద్దె భవనంలో గన్నవరంలో నడుస్తుంది. ఐఐటి, ఐఐఎస్ఇఆర్ కొంతమేర నిర్మాణాలు పూర్తిచేసి క్లాసులు నడిపిస్తున్నారు. ఎయిమ్స్ మంగళగిరిలో నడుపుతున్నారు. తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న 6. విద్యాసంస్థలు నేటికి అద్దె భవనంలో నడుస్తున్నాయి. మిగిలిన విద్యాసంస్థలు కొద్దిమేర నిర్మాణాలు పూర్తిచేసి, క్లాసులు నడిపిస్తున్నారు. సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు గురౌతున్నారు.

**పాఠశాల విద్య:**

పాఠశాల విద్యలో ప్రపంచ బ్యాంకు ప్రవేశంతో పాఠశాలలు విస్తరించాయి. అందరికి అక్షరాని చేరుకోలేకపోయింది. బలమైన పాఠశాల వ్యవస్థను ఏర్పాటును విస్మరించింది. నిధులతోపాటు సరితులు వరించి విద్య అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఎయిడెడ్ విద్యావ్యవస్థను నెమ్మదిగా దివాళాతీయించింది. మరోవైపు ఆర్థిక విధానాల ప్రభావంతో ప్రయివేటు విద్యాసంస్థలు పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం దాదాపు 50 శాతం పిల్లలు వీటిలోనే చదువుతున్నారు. చైతన్య విద్యా సంస్థలలోనే 31 జూనియర్ కళాశాలలు, 322 టెక్నో స్కూలు 107 సిబిఎస్సీ న్యూళ్ళు ఉండగా, వాటిలో 3.5 లక్షల మంది చదువుతున్నారు.

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామని, ప్రయివేటుకు అడ్డుకట్ట వేస్తామని

ప్రచారం చేసుకుంది. వాటి అమలు పేపరుకే పరిమితం అయింది. అమ్మఒడి, నాడు- నేడు, కానుక, గోరుముద్ద లాంటివి వచ్చాయి. వీటితోపాటు ఆంగ్లమాధ్యమం, సీబీఎస్, టోఫెల్, ఐబి లాంటివి ప్రవేశించాయి. కానీ నేటికి 12,386 ఏకోపాధ్యాయ పాఠశాలు ఉన్నాయని, 40 వేల పైబడి టీచర్ పోస్టులు ఖాళిగా ఉన్నామని మాత్రం చెప్పడంలేదు. ఈ నేపథ్యంలో ఏ రాష్ట్రాలలో అమలుకు నోచుకోని కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దింది. 3,4,5 తరగతులను హైస్కూల్స్ విలీనం చేసింది. దీని ప్రభావంగా 4,752 పాఠశాలలు నేడు పిల్లలు లేక దిక్కుతెలియని స్థితిలో ఉన్నాయి. చివరికి పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం లక్షల మంది విద్యార్థులు తగ్గిన సంగతి వెలుగులోకి రావడంతో ప్రభుత్వం కంగుతిన్నది గణాంకాలు ఎక్కడా లభించకుండా తొక్కిపట్టేసింది. ఈ పథకాల్లో నాడు నేడుతో దాదాపు 40 వేల గదులు నిర్మించే పూనుకోవడం కూడా ఆహ్వానించతగ్గదే. కానీ టాయిలెట్లు బిల్డింగులే చదువు చెప్పవు కదా.

ఏది ఏమైనా మొత్తం పాఠశాల విద్య అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఈ సంవత్సరం ఎప్పుడూ లేనంతగా ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్ళు కిటకిటలాడుతున్నాయి. మాటలు ఏమి చెప్పినా ప్రభుత్వ లక్ష్యం ఇదేనా అనిపిస్తోంది. మొరటుగా కాకుండా పాపులర్ పథకాల చాటున ఇదంతా జరుగుతోంది.

### ఇంటర్‌మీడియట్ విద్య

ప్రస్తుతం 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 2885 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. దాదాపు 79% మంది ప్రైవేటు సంస్థల్లో ఉండగా, 21% మాత్రమే ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నేటికి 60% కలేజీల్లో పర్మినెంట్ ప్రిన్సిపాల్స్ లేరు. పర్యవేక్షణచేసే డిఈవో అధికారులు ఒక్కరు కూడా లేరు. ఇప్పటికీ 4 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత రెండు సంవత్సరాల నుండి కనీసం పాఠ్యపుస్తకాలు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. తీవ్రమైన వసతుల లేమితో సరిపడా తరగతి గదులు లేక కళాశాలలు వెలవెలబోతున్నాయి. మరోవైపు కార్పోరేటు కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వ అజమాయిషీ తగ్గించింది. ఫీజు రెగ్యులేటర్ కమిటీని నియమించినప్పటికీ అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది.

### ఉన్నత విద్య:

డిగ్రీ చదువు మన రాష్ట్రంలో నామమాత్రంగా మారింది. ఇంజనీరింగ్ ప్రాధాన్యత పెరిగింది. 14.5 లక్షల మందికి పైగా ఇంటర్మీడియట్ చేరినా వీరిలో 1.42లక్షలే డిగ్రీలో చేరగా 1.20 లక్ష మంది ఇంజనీరింగ్ విద్యలోకి ప్రవేశిస్తున్నారు. అయితే పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో మొత్తం 16వేలకు మించి చేరడంలేదు. పాలిటెక్నిక్, మెడిసిన్, మేనేజ్మెంట్ తదితర కోర్సుల్లో గణనీయంగానే ఉంటున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో నానాటికి కోర్సులు మూతపడుతున్నాయి. డిగ్రీ విద్యలో ఎయిడెడ్ విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాయి. వాటిని నిర్వీర్యం చేసారు. దాదాపు 270 ఉండాల్సిన ఎయిడెడ్ కళాశాలలు నేడు ప్రభుత్వ విధానాల వలన 47 కుదించబడ్డాయి. ఎన్ఈపిలో భాగంగా నాలుగేళ్ళ డిగ్రీతో సాంకేతిక కోర్సులు వచ్చాయి. దీంతో చివరికి సైన్స్ గ్రూపుల్లో సైతం సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ఇంటర్న్‌షిప్ ద్వారా స్కిల్ నేర్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ప్రయివేటు కంపెనీలకు విద్యార్థులను కూలీలుగా తయారు చేస్తుంది. వేలం వెర్రిగా ప్రభుత్వం చెల్లించే ఫీజుల కోసం ఇంజనీరింగ్ కళాశాలలు వెలిసాయి పట్టాపుచ్చుకున్న వారు కూడా 17% కు మించి ఉద్యోగార్హత పొందడం లేదు. 'ఉన్నత విద్య సామాజిక అవసరాలకు తగ్గట్టు కోర్సులు లేకపోవడంతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని పట్టాపుచ్చుకున్న వారు. నిరుద్యోగులుగా మిగులుతున్నారు.

### మెడికల్ విద్య వ్యాపారం

ప్రభుత్వ వైద్య కళాశాలలను వ్యాపారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది నూతనంగా నిర్మించే 12 కళాశాలల్లో 5 కళాశాలలను ప్రారంభించింది. ఈ క్రమంలో 107,108 జిఓలతో మూడు రకాల ఫీజుల విధానాన్ని తీసుకొచ్చింది. సీట్ల భర్తీ రిజర్వేషను పాటించకుండా పేద విద్యార్థులకు నష్టం చేసింది. ఈ విధానం దేశంలో ఏ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో లేదు. ఈ విధానమే! ప్రస్తుతం ప్రైవేటు మెడికల్ కళాశాలలో జరుగుతుంది. ఈ రకమైన ఫీజులు వసూలు చాలా ప్రతికూల పరిణామాలకు దారితీస్తుంది. వైద్య విద్య వ్యాపారం అవుతుంది. పేదవాడికి వైద్యం అందుబాటులో ఉండదు. దీనితో ప్రభుత్వ మరియు ప్రైవేట్ మెడికల్ కాలేజీల మధ్య వ్యత్యాసం లేకుండా పోతుంది. ఈ మెడికల్ కాలేజీలు ప్రభుత్వ నిధులు మరియు వనరులతో స్థాపించబడినప్పటికీ, ఈ సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానం కొనసాగితే భవిష్యత్తులో ఈ ప్రభుత్వ నిర్వహణలోని వైద్య కళాశాలలన్నీ ప్రైవేటీకరణకు దారితీసే అవకాశాలు లేకుండాపోలేదు.

### విశ్వవిద్యాలయాలు

మేధావుల కేంద్రాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు వైసిపి హయాంలో రాజకీయ కేంద్రాలుగా మార్చారు. వాటి అభివృద్ధి గాలికొదిలేసారు. నిధుల కేటాయింపు తగ్గింది. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు, సెల్ఫ్ సపోర్ట్ కోర్సుల ద్వారా విద్య ఖరీదయింది.

వేల పోస్టుల ఖాళీలతో విశ్వవిద్యాలయాలలో నాణ్యత కరువయింది. సీట్లు భర్తీ కాకపోవండతో కోర్సులను మూసివేస్తున్నారు. ప్రయివేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై అజమాయిషీ తగ్గడంతో విచ్చలవిడిగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ఒక్క కె.ఎల్.యూ.లోనే 24వేల మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు.

**సంక్షేమ వసతి గృహాలు**

రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు విద్యలో కీలక పాత్ర పోషించాయి. వాటిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. హాస్టళ్ళ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా, మెస్ చార్జీలు పెంచకుండా ఆధ్వాన స్థితికి చేరుకున్నాయి. గురుకులాలలో పూర్తి స్థాయిలో అధ్యాపకులటే లేరు.

**ప్రత్యామ్నాయం**

చదువుకునేందుకు అర్హత ఉన్న ప్రతి వారికి ప్రభుత్వమే నాణ్యమైన ఉచిత విద్య అందించాలి. విద్యను వ్యాపారంగా మార్చకుండా నో ప్రాఫెట్ – నోలాస్ విధానంలో నడపాలి. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం రద్దు చేయాలి శాస్త్రీయ విద్యను అందించే దిశగా మంచి బడికి పునాదులు వేయాలి. ఉన్నత విద్యలో సామాజిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టాలి యూనివర్శిటీల స్వయంప్రతిపత్తిని కాపాడాలి. నిధులు కేటాయించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి. ప్రభుత్వ బడులకు అభివృద్ధి చేసి కార్పోరేటు విద్యాసంస్థలపై ప్రభుత్వం జోక్యం పెరిగాలి. ఫీజుల నియంత్రణా చట్టం చేయాలి బడ్జెట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం ప్రోత్యాహం అందించాలి. వసతి గృహాల విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచి వాటి అభివృద్ధికి దోహదపడాలి. దేశానికి విద్యలో కేరళ వాసుపక్ష ప్రభుత్వం ఆదర్శంగా నిలిచింది. విద్యలో 94% అక్షరాస్యత సాధిస్తూ అగ్రభాగాన నిలిచింది. శాస్త్రీయ విద్యను అందుబాటులో ఉండే విద్య, ఓ మంచి బడి ఎలా ఉండాలో కేరళ వాపమక్ష ప్రభుత్వం రుజువు చేసింది. చేస్తూనేఉంది. ఇటువంటి ఉచిత, నాణ్యమైన విద్య అందించాలని సదస్సు తీర్మానించింది.

# చరిత్ర పాఠాలు తొలగింపు శాస్త్రీయ విద్యకు దూరం

చరిత్రలో ఏం జరిగిందో ఎలా తెలుసుకోవడం ఆ కాలం గురించి చెప్పేవారు ప్రస్తుతం ఈ కాలంలో ఎవరు ఉండరు. ఈ కాలంలో ఉన్నవారు గతించిన కాలం గురించి తెలుసుకోవాలి అంటే ఏదో ఒక శాస్త్రీయ ఆధారం ఉండాలి. ప్రధాన శాస్త్రీయ ఆధారం శిలాజాల నుంచి విడుదలయ్యే కార్బన్ ఆధారంగా అంటే కార్బన్ డేటింగ్ లేదా పురావస్తు త్రవ్వకాలలో బయలు పడిన ఆనాటి ఆధారాలు లేదా ఆనాటి జీవన పరిస్థితుల్ని తెలిపే ఏమైనా పుస్తకాలు వీటన్నింటి ఆధారంగా ఒక వాస్తవ చరిత్రను నేటి తరానికి అందించాలి. గత ప్రజల జీవన విధానం, ఇప్పుడు మనం నివసిస్తున్న జీవన విధానం ఎందుకు మారిందో ఈ మార్పులకు వాస్తవ పరిస్థితులు ఏమిటో అధ్యయనం చేస్తే భవిష్యత్తులో మానవుడు సుఖవంతంగా నివసించడానికి కావలసిన జీవన పద్ధతుల్ని రూపొందించుకోవటానికి చరిత్ర అవసరం. రాజ్యాంగం ఆర్టికల్ 51ఏ (హెచ్)లో ఈ దేశ ప్రజలందరికీ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి అనే మాట రాసుకున్నాము. శాస్త్రీయ దృక్పథాన్ని అందించటం అంటే విద్యలో నిరూపించిన అంశాలు, పురావస్తు శాఖ ద్వారా తెలిసిన వాస్తవాలు విద్యార్థులకు అందించాలి.

* 1961లో ఎన్‌సిఇఆర్‌టిని స్థాపించారు 1960లోను 1970లోను నేటి చరిత్రకు సంబంధించిన, సైన్స్ కు సంబంధించిన పాఠ్యాంశాన్ని రూపొందించి ప్రింట్ చేశారు. ఈ పుస్తకాలను రాసిన వాళ్ళు రోమిల్లా థాఫర్, బిపిన్ చంద్ర, సతీష్‌చంద్ర, రామ్‌చరణ్ శర్మ లాంటి ప్రముఖ చారిత్రకారులు ఉన్నారు.
* హిందుత్వ ఐడియాలజీని పాఠ్యపుస్తకాలలో ప్రవేశపెట్టడానికి 1990, 2002, 2005లో ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలు సక్సెస్ కాలేదు.
* 2017లో 182 పుస్తకాన్ని అప్డేట్ చేసే పేరుతో కొత్తగా స్వచ్ఛభారత్, డిజిటల్ ఇండియా, బేటి బచావో బేటి పడావో అనే అంశాలను చేర్చారు.
* 2019 లో విక్రమ్ సంవత్సరం శివాజీ మహారాజ్ లాంటి పాఠాన్ని ఏడవ తరగతిలో యాడ్ చేస్తారు. ఇప్పుడు 2022లో

చాలా మార్పులు చేస్తున్నారు.

* 10,11,12 తరగతిలో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని, 12వ తరగతి 9వ అధ్యాయంలో కింగ్ ఆఫ్ హిస్టరీ మొగల్ దర్బార్ పాఠంలో 28 పేజీల చరిత్రని, 6 అధ్యాయంలో భక్తి, సూఫి సాంప్రదాయాలను, హిందూ మతతత్వవాదుల పట్ల గాంధీజీకి ఉన్న అయిష్టతను, గాంధీ హత్య తర్వాత ఆర్ఎస్ఎస్ పై నిషేధం, నాథురామ్ గాడ్సేకు సంబంధించి "ఆయన పుణే బ్రాహ్మణుడు "అనే వాక్యాలను, 11వ తరగతి సోషియాలజీ పుస్తకం నుండి 2002 గుజరాత్ అల్లర్లకు సంబంధించిన అంశాలను, 9,10 తరగతులలో ఉన్న ఆవర్తన పట్టికలను, భగత్ సింగ్ చరిత్రను తొలగించారు.
* 2020–22 మధ్యకాలంలో కరోనా వల్ల పిల్లలకి బోధన చేయటం సాధ్యం కాలేదు కనుక, కరోనా అంతరం పాఠ్యాంశాల పుస్తకాల బరువు తగ్గించడానికి పాఠ్యాంశాన్ని కుదిరించాము, తప్ప మరొక ఏ అంశాలు దీనిలో దాగిలేవని ప్రభుత్వం చెబుతున్నది. ఇది అవాస్తవం.
* వాస్తవ చరిత్రను ఈ జీవుల పుట్టుక గురించి ఒక్కొక్క నమ్మకం ఒక్కొక్క రకంగా చెప్పుతున్నది. ఏ నమ్మకాన్ని నమ్మాలి అంటే సైంటిఫిక్‌గా నిరూపించిన డార్విన్ పరిణామ సిద్ధాంతం కనుక ఈ శాస్త్రీయ దృక్పథం కలిగిన డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ఆచరిస్తే వాస్తవం వైపు విద్యార్థు వెళ్తారు. కనుక చరిత్రలో ఆ పాఠాన్ని తొలగిస్తే ఏదో ఒక నమ్మకాన్ని నమ్మాల్సిన పరిస్థితిని సృష్టిస్తారు.
* కొన్ని మూలకాల వల్ల సంక్లిష్ట పదార్థాలు ఏర్పడతాయని అక్కడి నుంచే జీవపదార్థాలు ఉద్భవిస్తాయని, నిర్జీవ పదార్థాల నుండి జీవపదార్థాలు పుట్టటం అనేది మూలకాల కలయిక వల్ల అనేది విద్యార్థులకు బోధపడితే, వాస్తవం తెలిస్తే ప్రశ్నించడం ప్రారంభిస్తారు. పరిశోధించడం, పరిశీలించటం, సృజనాత్మకతను పెంపొందించుకోవటం విద్యార్థులకు అలవాటవుతుంది. ఇది లేకుండా ఉండాలి అంటే మూలకాల వర్గీకరణ తొలగించాలి.
* మొగల్ సామ్రాజ్యాన్ని తొలగించడం అంటేనే ఆ కాలంలో ఉన్న జీవన పరిస్థితుల్ని, ఈ దేశ ప్రజలకు తెలియకుండా చేయటం. ఎన్నో రకాలైన కళలు ఉద్భవించిన కాలం యొక్క వాస్తవ చరిత్ర తెలియకుండా చేయడం దీని ఉద్దేశం.
* ఈ దేశ స్వాతంత్రోద్యమానికి తన జీవితాంతం కట్టుబడి పని చేసిన మహాత్ముడుగా పిలవబడిన గాంధీ గారి దృక్పథాన్ని సైతం రూపుమాపే ప్రయత్నం చేస్తున్నారు.
* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఎస్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాలను పక్కనపెట్టి ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాలను సీబీఎస్ఈ సిలబస్ ని ముందుకు తీసుకోస్తుంది. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలలో అదనపు భారమని పేరుతో కొన్ని పాఠ్యాంశాలను ఐచ్ఛికం చేస్తూ ఉంది. మూలకాల వర్గీకరణ, చరిత్ర, గాంధీ పాఠ్యాంశాలని ఐచ్ఛికం చేస్తుంది. అలాగే సిబిఎస్ఇ సిలబస్ పేరుతో గణితం, సైన్స్ వరకు కంపల్సరీ చేసి, తెలుగు, హిందీని ఐచ్ఛికం చేసింది. అలాగే సంస్కృత భాషని ప్రథమ భాషగా ప్రవేశపెడతామని చెప్పి ప్రకటనలు చేస్తుంది. తెలుగు, హిందీ ఐచ్ఛికమైన తర్వాత విద్యార్థులకు ఆ భాషల మీద ఆసక్తి ఉండదు. అంటే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చరిత్ర పాఠ్యాంశాల తొలగింపుని ఒక్కొక్కటి చాపకింద నీరులా తొలగించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంది. ఎస్‌సిఇఆర్‌టి మొత్తాన్ని ఎన్‌సిఇఆర్‌టితో అనుసంధానం చేసి ఆ పుస్తకాలని అమలు చేసే దానికోసం ఈ సంవత్సరం ప్రయత్నం చేస్తుంది. ప్రత్యేకించి హిందీలో 9వ తరగతి పాఠ్యాంశంలో మొత్తం ఉత్తర భారత దేశ హిందీ మాండలికాలను ప్రవేశపెట్టింది. దక్షిణ భారతదేశ చరిత్రను హిందీ పాఠ్యాంశాల నుంచి తొలగించేసింది. భవిష్యత్తులో చరిత్ర పాఠాన్ని, సైన్స్ పాఠాలను కూడా ఒక్కొక్కటి తొలగించడానికి ప్రణాళిక రూపొందిస్తుంది. అందువల్ల ఎస్‌సిఇఆర్‌టిని పునరుద్ధరించకుండా ఎన్‌సిఇఆర్‌టిని, సీబీఎస్ఈని ప్రవేశపెట్టడం అంటేనే మన రాష్ట్రం యొక్క విద్య హక్కు స్వేచ్ఛను కేంద్ర పెత్తనం పరిధిలోకి తీసుకెళ్లడమేనని మనం గుర్తుపెట్టుకోవాలి
* స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్న ప్రజలకు స్వాతంత్రోద్యమ ఫలాలకి కారకులు ఎవరో తెలియనీకుండా చేయడం అంటే ఇంతకంటే దారుణం ఏమి ఉంటుంది.
* శాస్త్రీయపరమైన, హేతుబద్ధమైన ఆలోచనలపై ప్రత్యక్ష దాడి చేసి పిల్లల మెదడులో సృష్టి వాదాన్ని బోధించి, మూఢత్వాలను నింపే ప్రయత్నం చేస్తున్నారు.
* ప్రపంచాన్ని హేతుబద్ధకోణం నుంచి పరిశీలించడానికి దోహదపడే వాస్తవ చరిత్ర నుండి విద్యార్థుల్ని దూరం చేసి, ప్రశ్నించే తత్వాన్ని చంపుతున్నారు.

* సైన్స్ ఎడ్యుకేషన్ అడ్డుకోవడమంటే మతతత్వపు ఆలోచనల్ని ప్రవేశపెట్టడమే.
* ఎన్‌సిఇఆర్‌టి హేతుబద్ధమైన ఆలోచనల యొక్క పునాది సూత్రాలను తొలగించినట్లయితే వర్ణమాల మరియు ఒకటి నుండి పది వరకు సంఖ్యల్ని తెలుసుకోవడం మినహా విద్యలో ఏమి మిగిలి ఉండదు.
* వాస్తవ చరిత్రను రక్షించుకోవడం ఉపాధ్యాయుల బాధ్యత. రాజ్యాంగంలో నిర్దేశించిన సైంటిఫిక్ టెంపర్‌ని విద్యార్థుల్లో పెంపొందించటం ఉపాధ్యాయుల కర్తవ్యంగా భావించాలి.
* ఆశాస్త్రీయ అంశాలను ప్రవేశపెట్టడాన్ని, చరిత్ర అంశాలను తొలగించడాన్ని వ్యతిరేకిద్దాం.

# ఆరోగ్య రంగం

మన దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ వైద్యరంగం అమోఘంగా అభివృద్ధి చెందింది. గతంలో పెద్ద వైద్యాల కోసం విదేశాలకు వెళ్లి వైద్యం చేయించుకునే స్థితి నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్యాలను కూడా విదేశీయులకు కూడా మనదేశంలో చేయగల స్థాయికి మనదేశమే కాకుండా మన రాష్ట్రం కూడా అభివృద్ధి చెందింది. ఈ వైద్య రంగ అభివృద్ధి ప్రధానంగా కార్పొరేట్ వైద్యంగా ముందుకు వచ్చింది. ప్రభుత్వ వైద్యం పేదవాడికే అన్నట్లుగా వెనుకబడి ఉంది. మనదేశంలో దరిదాపుగా 80% వైద్యం ప్రైవేటు లేదా కార్పొరేట్ రంగంలోనే జరుగుతుంది. మిగిలిన 20 శాతం మాత్రమే స్వచ్ఛంద సేవా సంస్థలు మరియు ప్రభుత్వాసుపత్రులలో జరుగుతుంది. ధనికుడికి ప్రైవేట్ మరియు కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉంది.వారికేమి ఇబ్బంది లేదు. వచ్చిన ఇబ్బందల్లా పేదవారికే. ఎక్కువ శాతం పేదలు సరైన, నాణ్యమైన, అవసరమైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విధంగా వైద్యరంగంలో అసమానతలు తీవ్రంగా ఉన్నాయి. ఈ అసమానతలు తగ్గడానికి ప్రభుత్వం ఏమి చేయాలి? ప్రజలు ఏం చేయాలి? ప్రజా నాయకులు ఏం చేయాలన్నదే ఇప్పుడు మనం ముందున్న చర్చ.

ప్రజా వైద్యాన్ని ప్రజలకు అందించాలంటే ఏ అంశాల మీద కేంద్రీకరించాలి? ఆ అంశాలలో ఉన్నటువంటి లోటుపాట్లు ఏంటి? వీటిని సరిదిద్దడం ఎలా?అనే కొన్ని ప్రధానమైన విషయాలను మీ ముందు ఉంచుతాను.

**1. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) పనితీరును పెంచాలి.**

ఇవి ఇప్పుడు పగటిపూట మాత్రమే పనిచేస్తున్నాయి. వీటిని రోజంతా అంటే 24 గంటలు పని చేసే విధంగా చూడాలి. ఇలా 24 గంటలు పని చేయాలంటే ఇందులో ఒక్కొక్క ఆసుపత్రిలో 5గురు డాక్టర్లు పనిచేసే విధంగా నియామకాలు జరగాలి. ప్రస్తుతం మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు చాలా మంచి పని. కానీ ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లతోనే కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ ఇద్దరిలో ఒకరు మాత్రమే ఆరోగ్య కేంద్రంలో ఉండగలుగుతున్నారు మరొకరు 104 సేవలకు, విలేజ్ హెల్త్ క్లినిక్ లకు పోవాల్సి వస్తుంది. ఈ కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అవసరమైన స్థాయిలో జరగడం లేదు..

**2. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యాన్ని పెంచాలి.**

కొన్ని సెంటర్లలో సరిపోయిన వైద్య సిబ్బంది ఉన్నా అవసరమైన పరికరాలు లేక వైద్యం అందడం లేదు.. కొన్ని సెంటర్లలో పరికరాలు ఉన్నా సరిపోయినంత వైద్యులు లేక సేవలు అందడం లేదు. గైనకాలజిస్టు ఫిజీషియన్లు, చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉన్నప్పటికీ సిజేరియన్ ఆపరేషన్లు జరగని కేంద్రాలు చాలా ఉన్నాయి. వైద్యులను, వైద్య సిబ్బందిని, పరికరాలను సరిపోయిన మోతాదులో సమకూర్చి వైద్య సేవలను పెంచాలి.

**3. గవర్నమెంట్ ఆసుపత్రులలో అవసరమైన మందులన్నీ ఉచితంగా ప్రజలకు అందించాలి.**

చాలా ఆసుపత్రులలో అవసరమైన పూర్తి మందులు అందించక కొన్ని మందులను బయట కొనుక్కోమని చెబుతున్నారు. ఆసుపత్రిలో చేరకుండా ఓపిలో చూపించుకొని మందులు రాయించుకొని వెళ్లే ఓపికేసులకే కాకుండా ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకుంటున్న వారికి కూడా పూర్తి మందులు అందించక కొన్ని మందులను బయట కొనుక్కోమని చెబుతున్నారు. ఈ మందుల కొనుగోలునే భరించలేక చాలామంది పేదలు మరింత నిరుపేదలుగా మారిపోతున్న పరిస్థితి వుంది. అందుకే ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన మందులన్నీ ప్రభుత్వమే ఉచితంగా అందించాలి.

**4.జనరిక్ మందుల షాపులను విరివిగా అందుబాటులోకి తేవాలి.**

జనరిక్ మందులను అందుబాటులోకి తేగలిగితే మందుల కొరకు ప్రజలకు అయ్యే జేబు ఖర్చును చాలా వరకు తగ్గించవచ్చు. బ్రాండ్ పేరుతో ఉన్న మందు రూపాయికి అందుబాటులో ఉండే మందు జనరిక్ మీద 20 నుంచి 30 పైసలకే అందుబాటులోకి వస్తుంది.

జనరిక్ మందుల మీద ప్రజలకు కొంత అవగాహన లోపం ఉంది. జనరిక్ మందులు బ్రాండెడ్ మందులతో సమానంగా పనిచేస్తాయని, జనరిక్ మందులు ఎందుకు తక్కువ ధరకు వస్తున్నాయనే సమాచారం మీద ప్రజల్లో అవగాహన కల్పించాలి. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు జనరిక్ మందులు షాపులు ఏర్పరిచే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. జనరిక్ మందులను రాసే విధంగా డాక్టర్లను తయారు చేయాలి.

**5.విలేజ్ హెల్త్ క్లినిక్ లను మెరుగుపరచాలి.**

విలేజ్ హెల్త్ క్లినిక్ అన్నది మంచి కాన్సెప్ట్. గ్రామస్థాయిలో జి.ఎన్. ఎమ్ చేసిన ఒక నర్సులను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా నియమించి ప్రాథమిక వైద్యాన్ని గ్రామస్థాయిలో అందించడం మంచి పరిణామం. దెబ్బ తగిలితే కట్టు కట్టే దిక్కులేని పరిస్థితి,జ్వరం వస్తే ఇంజక్షన్ వేసే దుస్థితి నుంచి గ్రామ ప్రజలు కొంత ఊరట పొందుతున్నారు. ఈ విలేజ్ హెల్త్ క్లినిక్ కు టెలి కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసి టెలి మెడిసిన్ అందించడం మంచిది. ఈ విలేజ్ హెల్త్ క్లినిక్ లకు ప్రతిరోజు కనీసం రెండు గంటలైనా ఒక మెడికల్ ఆఫీసర్ సమయాన్ని కేటాయించగలిగితే మరింత మెరుగైన సేవ అందేదానికి అవకాశం ఉంటుంది.

**6. ఆరోగ్యశ్రీ బీమా పథకం ప్రజా వైద్యానికి పూర్తి పరిష్కారం కాదు. ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయాలి.**

2007లో డాక్టర్ వై.యస్ రాజశేఖర్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకాన్ని రోజురోజుకీ పెంచుకుంటూ పోతున్నారు. 1000 రూపాయలు కంటే మించి బిల్లు అయ్యే ప్రతి కేసును ఆరోగ్యశ్రీలో చేరుస్తామని ప్రస్తుత ప్రభుత్వం నవరత్నాలలో చెప్పింది. వాస్తవానికి ఇది జరగడం లేదు. కొన్ని ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ పథకాన్నించి వెనక్కి వెళ్ళిపోతున్నాయి. కారణం ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం.ఈ పథకం ద్వారా కొద్ది మంది పేదలకు ప్రభుత్వ వైద్యశాలలు అందించలేని వైద్యం కూడా అందుతుంది. అంతే వరకు బాగానే ఉంది. ఈ పథకం ప్రభుత్వం యొక్క దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుంది.. ప్రభుత్వం ఎప్పుడు ఈ పథకాన్ని రద్దు చేస్తుందో ఏ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందో మనం చెప్పలేం. అందుకని బీమా పథకాలను నమ్ముకుని ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేయకపోవడం చాలా ప్రమాదకరం. ఆరోగ్యశ్రీకి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు ఏమి లేవు. ఆరోగ్య రంగంలో కేటాయించిన బడ్జెట్ నుంచి దరిదాపుగా 25% ఆరోగ్యశ్రీ కోసం ఖర్చు పెడుతున్నారు. ఈ కారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి తగ్గిపోయింది. భీమా పథకాలను నమ్ముకుని భీమా పథకాలను అభివృద్ధి చేయడం కాదు ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయాలి. వైద్యం ప్రజల హక్కుగా ఉండాలి తప్ప ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండకూడదు. ఇప్పటికైనా మేల్కొని ప్రభుత్వాసుపత్రులను అభివృద్ధి చేయాలి. భీమా పథకాన్ని కొనసాగించాలి అంటే ఆరోగ్యంగ బడ్జెట్ కేటాయింపులను ఉపయోగించకుండా దాని కంటూ ప్రత్యేకమైన బడ్జెట్ ను కేటాయించాలి.

**7. ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి.**

ఏ పని జరగాలని బడ్జెట్ కేటాయింపు లేనిది జరగదన్నది అందరికీ తెలుసు కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగా కేటాయింపులు 3.5% మించి మంచిది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు అందరికీ ఆరోగ్యం ఉండాలంటే ఆరోగ్య బడ్జెట్లో జిడిపిలో కనీసం ఐదు శాతానికి పెంచాలని సూచనలు. ఈ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్లో 15000 ఎనిమిది వందల ఎనభై రెండు కోట్లు పెట్టండి ఇది రాష్ట్ర బడ్జెట్లో 8.3% నేను కనీసం 12 సార్లు పెంచుకోవడం ఈ కార్యక్రమంలో సాధ్యం కాదు ఇందులో నుంచి ఆరోగ్యశ్రీ కోసమే 2000845 కోట్లు ఖర్చు పెట్టారు నేడు కింద 2002 2014 కోట్లు కేటాయించారు

**8. వైద్య పరికరాలు మరియు మందులపై జి.ఎస్టి.ని తీసివేయాలి.**

వైద్యం కోసం చేస్తున్న ఖర్చులు తగ్గించడం అనేది చాలా అవసరం. దరిదాపుగా 70 శాతం వైద్య ఖర్చులను ప్రజల జేబునుంచి( అవుట్ ఆఫ్ పాకెట్ ఎక్స్పెండిచర్) పెట్టుకోవడం వలన చాలా కుటుంబాలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నాయని అనేక రిపోర్ట్ లు తెలియజేస్తున్నాయి. కొన్ని ప్రత్యేకమైన మందుల మీద జిఎస్టి లేకపోయినా ఎక్కువ మోతాదులో మందులు మరియు వైద్య పరికరాల మీద 12 శాతం జీఎస్టీ కొనసాగుతుంది. మందులు మరియు వైద్య పరికరాల మీద జిఎస్టి ని తీసివేయగలిగితే వైద్య ఖర్చు తగ్గుతాయి జేబులో నుంచి ఖర్చు పెట్టే పరిస్థితి తగ్గుతుంది. పేదలకి తక్కువ ధరకే వైద్యం అందే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి మందులు మరియు వైద్య పరికరాల మీద జిఎస్టి తీసివేయాలి.

**9. గవర్నమెంట్ మెడికల్ కాలేజీలలో సీట్లు అమ్ముకోవడాన్ని విరమించుకోవాలి.**

ప్రజలకు వైద్యం అందాలంటే డాక్టర్లు మరియు పేరా మెడికల్ సిబ్బంది సంఖ్య సరిపోయినంత ఉండాలి. ప్రస్తుతం మన దేశంలో డాక్టర్ల సంఖ్య సరిపోయినంత లేదు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాల ఏర్పరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేస్తున్నారు. మన రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలను గవర్నమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే 5 కళాశాలలు ప్రారంభమయ్యాయి. మరో రెండు సంవత్సరాలలో మరో 12 కళాశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఇన్ని కళాశాలను ప్రారంభించడం ఆనందకరమైన విషయం. ఇందులో అంతర్గతంగా దాగి ఉన్న భయంకరమైనమరియు బాధాకరమైన విషయం ఏమిటంటే సగం (50%) సీట్లను ప్రభుత్వమే అమ్ముకోవడం. ఈ 50 శాతం సీట్లలో 35 శాతం సీట్లను సెల్ఫ్

ఫైనాన్స్ పేరుతో సంవత్సరానికి 12 లక్షల చొప్పున, మిగిలిన 15% సీట్లను ఎన్నారై పేరుతో సంవత్సరానికి 20 లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇలా చేయడం కారణంగా అన్ని రకాల రిజర్వేషన్లు సగానికి కుదించబడతాయి. రిజర్వేషన్లే కాదు ఓపెన్ కేటగిరి సీట్లు కూడా కుదించబడతాయి. భవిష్యత్తులో అన్ని గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో సీట్లను అమ్మ కోదనే నమ్మకమేమీ లేదు. కచ్చితంగా అమ్ముకుంటుందనే భావించాలి. గవర్నమెంట్ ఈ విధంగా చేయడం వలన రిజర్వేషన్లు దెబ్బతింటాయి. పేద ప్రజలు వైద్య విద్యను అభ్యసించగలిగే అవకాశం తగ్గిపోతుంది. కోటి రూపాయలు ఖర్చుపెట్టి చదివిన వారి చేత ప్రజలకు సేవ చేయించడం ఎంతవరకు సాధ్యం? వైద్యులు వ్యాపారం వైపుకు మళ్ళే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గవర్నమెంట్ హాస్పిటల్ ద్వారా వైద్యం అందాలన్నా, ప్రైవేటు వైద్యుల ద్వారా తక్కువ ధరకే వైద్యం అందించాలన్నా వైద్య విద్యను ఉచితంగా గవర్నమెంట్ అందిస్తేనే సాధ్యమవుతుంది. లేదంటే వైద్యం వ్యాపారం వైపుకు పోతుంది. అందుకే ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు అమ్ముకోవడం నుంచి రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలి.

**10. ఆరోగ్య హక్కు చట్టాన్ని తేవాలి.**

ప్రతి పౌరుడు ఆరోగ్యంగా జీవించే పరిస్థితిని కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అందరికీ వైద్యం ఉచితంగా, ఎల్లవేళలా, ఎక్కడైనా, అందుబాటులో ఉండే విధంగా ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి పరచాలి. ఏ పార్టీ ప్రభుత్వానికి వచ్చినా వైద్యం అందరికీ అందేలాగా ఉండాలి. అలా వైద్యం అందుతుందనే భరోసా ప్రజలకు ఉండాలి. అందుకొరకు ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావాలి. దాని పేరే ఆరోగ్య హక్కు చట్టం. ఆరోగ్య హక్కు చట్టం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉండాలి.

వీటిని ఆచరించగల్గితే తక్కువ ఖర్చుతో ప్రజలందరికీ వైద్యం అందే పరిస్థితి వస్తుంది. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకోసం మనం ప్రయత్నించాలి.

# వ్యవసాయాభివృద్ధికి సహకార రంగం అవసరం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలతో సమానంగా వ్యవసాయ రంగంలో సహకార రంగం అభివృద్ధి చేయబడింది. రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న సహకార సంఘాల్లో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహాలతో సహకార రంగం రైతులకు, ప్రజలకు సేవ చేస్తూ అభివృద్ధి బాటలో నడిచింది. అటువంటి సహకార రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు కూలగొట్టేపని సరళీకరణ విధానాల అమలు క్రమంలో ప్రారంభమైంది.
ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వరంగ, సహకార రంగ సంస్థలను మూసివేసేందుకు, ప్రైవేటీకరించేందుకు, వాటి సైజులను తగ్గించేందుకు నాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించి అమలు చేసింది. ప్రపంచ బ్యాంకు వద్ద వ్యవస్థీకృత సర్దుబాటు రుణం తీసుకుని దాని షరతులకు అనుగుణంగా సహకార రంగంలో సంస్కరణలు అమలు చేసింది.

ఆ సమయంలోనే ఒకపుడు వెలుగొందిన సహకార రంగం కుదేలయింది. సహకార చక్కెర మిల్లులు, నూలు మిల్లులు కనుమరుగయ్యాయి. ఇపుడు ఉన్న కొద్దిపాటి సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూత దశలో ఉన్నాయి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరువాత అధికారంలోకి వచ్చిన రాజశేఖర రెడ్డి ప్రభుత్వం, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వాలు సహకార రంగంలో సంస్కరణలను కొనసాగించాయి, కొనసాగిస్తున్నాయి. ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం కల్పించాయి.
రాష్ట్రంలో పాల వెల్లువలో ప్రముఖ పాత్ర పోషించిన సహకార పాల రంగం క్రమేపీ కనపడకుండా పోయింది. అక్కడక్కడ మినుకు మినుకు మంటోంది. ప్రముఖ సహకార డెయిరీలు కంపెనీలుగా మారిపోయాయి. సహకార చక్కెర మిల్లులను పునరుద్ధరిస్తామని కాంగ్రెసు, వైసీపీ ప్రభుత్వాలు తాము చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోలేదు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలు ఒకే ఫెడరేషన్ కింద లేకుండా అనేక ఫెడరేషన్లుగా విచ్ఛిన్నమయ్యే, ఆ తర్వాత ఆ ఫెడరేషన్లు కంపెనీలుగా మారే విధంగా చట్ట సవరణలు చేశారు.

సహకార రంగంలో మిగిలి ఉన్న ఏకైక వ్యవసాయ పరపతి విభాగాన్ని కూడా ప్రైవేట్ పెట్టుబడులకు అప్పగించే ప్రక్రియను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించింది. 50 శాతం వాటాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తూ చట్ట సవరణలు చేసింది.
అదే సమయంలో సహకార రంగానికి పూర్వ వైభవం తెస్తామంటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పరిధిలో సహకార శాఖను ఏర్పాటు చేసింది. సహకార రంగాన్ని తన చేతిలోకి తెచ్చుకునేందుకు మోడీ ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టానికి సవరణ చేసి రాష్ట్ర పరిధిలో ఉన్న సహకార సంఘాలు బహుళ రాష్ట్ర సహకార సంఘాలుగా మారే దారి

కల్పించింది. అపుడు అవి కేంద్ర అధీనంలోకి పోతాయి.

గుజరాత్ రాష్ట్రంలోని అమూల్ డెయిరీ ఇప్పటికీ గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (GCMMFL) పేరుతో ఒక రాష్ట్ర సహకార సంఘంగా ఉంది. రాష్ట్ర సహకార శాఖ పరిధిలో ఉంది. అది తన పాల ఉత్పత్తులను దేశంలో, విదేశాల్లో అమ్ముకుంటోంది. ఇతర ఐదు సహకార సంఘాలతో (ఇతర రాష్ట్రాలవి) విలీనం చేసి బహుళ రాష్ట్ర సహకార సంఘంగా మారుస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా 2022 లోనే ప్రకటించారు.

ఈ క్రమంలో అమూల్ డెయిరీ బహుళ రాష్ట్ర సహకార సంఘంగా మారినట్లు ఇంకా వార్తలు ఎక్కడా రాలేదు. మన రాష్ట్ర పాల ఫెడరేషన్‌ను కూడా బహుళ రాష్ట్ర సహకార సంఘంగా మార్చిన దాఖలాలు లేవు. అలా మారకుండానే మన రాష్ట్రంలో అమూల్ విస్తరణకు వైసిపి ప్రభుత్వం తోడ్పడుతోంది. ఒంగోలు, చిత్తూరు డెయిరీలను అది స్వాధీనం చేసుకుంది. పాల సేకరణ, పంపిణీ, పాల ఉత్పత్తుల తయారీ కోసం రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రజలతో, రైతులతో సంబంధం లేకుండా మోడీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైసిపి ప్రభుత్వం నడుస్తోంది. చివరికి ఇది ఒక పెద్ద ప్రైవేటు కంపెనీగా మారే ప్రమాదం ఉంది.

ఒకే సహకార సంఘం పేరుతో గ్రామీణ సేవలన్నింటినీ ఒక గొడుగు కిందికి తెచ్చే విధానాన్ని మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఒకే సొసైటీలో పాలు, చేపలు, వ్యవసాయ రుణాలు మరియు ఇతర వ్యవసాయ సేవలు, కామన్ సర్వీసులు తదితరాలన్నిటినీ కలుపుతామని పదే పదే కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. మోడీ ప్రభుత్వ విధానానికి అనుగుణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని రకాల సేవలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోకి వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో తెస్తోంది. అలా తేవటమేగాక పీఏసిఎస్ లలో వాటాలను 50 శాతం ప్రైవేట్ వ్యక్తులకు, కంపెనీలకు అమ్ముతూ 1964 ఏపి సహకార సంఘాల చట్టానికి సవరణలు చేసింది. ఆర్.బి.కె. లను ఈ చట్ట సవరణ ద్వారా పీఏసిఎస్ లలో విలీనం చేసింది. ధాన్య సేకరణ, ఎరువులు, గోడౌన్‌లతో సహా సహకార సేవలన్నీ ప్రైవేటుపరం కానున్నాయి.

ఒక పెద్ద మోడీ ప్రభుత్వ కుట్రలో రాష్ట్ర వైసిపి ప్రభుత్వం పాలు పంచుకుంటోంది. రాష్ట్రంలో సహకార వ్యవస్థ మొత్తం ఒకే గొడుగు కింద ప్రైవేటుపరం కానుంది. ఇది దేశం మొత్తంలో జరగబోయే పరిమాణానికి ప్రారంభ సూచిక కానుంది. ఒకపుడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు అనుగుణంగా సహకార విభాగాలను ఒక్కోటిగా కూలగొట్టారు. ఇపుడు వైసిపి ప్రభుత్వం ఇంకా మిగిలి ఉన్న ఆ విభాగాలన్నిటినీ ఒకే చోటికి చేర్చి ప్రైవేట్ పెట్టుబడులకు అప్పగిస్తున్నారు.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ప్రధానంగా ఈ కుట్రకు వేదిక కానున్నాయి. వ్యవసాయ పరపతి రంగానికి సంబంధించిన పీఏసిఎస్‌లు, డిసిసిబిలు, ఆప్కాబ్ తదితరాలు మొత్తం ప్రైవేటీకరణకానున్నాయి. ఈ రంగంలో ఉన్న ఉద్యోగులు మేల్కొనాలి. ఉద్యోగుల కంటె మించి పీఏసీఎస్ లలో వాటాదారులుగా, పాలక వర్గాలుగా ఉన్న రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించాలి. ప్రైవేటీకరణ కుట్రను తిప్పికొట్టాలి.

సహకార రంగాన్ని కాపాడుకోకపోతే పూర్వకాలంలో లాగే రైతులు వడ్డీవ్యాపారుల కబంధ హస్తాల్లో పడి నలిగిపోతారు. ఒకరికొకరు సహాయం చేసుకునే వ్యవస్థ కుప్పకూలిపోకుండా కాపాడుకోవాలి. ఒక పక్క ప్రభుత్వ రంగంపై దాడి జరుగుతోంది. విద్యుత్తు, రైల్వే, బ్యాంకులు, ఇన్సూరెన్సు, ఆయిలు వంటి కీలక రంగాల ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం బాటలు వేసింది. మరో పక్క ప్రైవేటు పెట్టుబడుల విస్తరణకు ఆటంకంగా ఉన్న సహకార రంగంపై వేటు వేస్తోంది. నక్కబావ జిత్తుల మాదిరిగా కేంద్ర మంతి అమిత్‌షా వేసే ఎత్తులకు మోసపోకుండా వాటిని తిప్పికొట్టాలి.

ఇది ఒక్క వ్యవసాయ పరపతి సహకార సంఘపరిధిలోని రైతుల సమస్య మాత్రమే కాదు. మొత్తం రైతుల సమస్య. సహకార వ్యవస్థను ఒక చోటకు చేర్చి ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పే కుట్రను రైతులు, ప్రజలు అందరూ ఏకమై ఓడించాలి.

కేరళ రాష్ట్రంలో సహకార సంఘ వ్యవస్థలు నడుస్తున్న తీరు కార్మిక, కర్షక ప్రజానీకానికి, చిరువ్యాపారులకు తోడ్పాటునందిస్తున్న తీరు హర్షణీయమైంది. మనం కూడా అనుసరణీయమైంది.

మన రాష్ట్రంలో సహకార వ్యవస్థను సమూలంగా మారుస్తున్నానన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిగారు ఈ రంగ పరిస్థితిని ఇంకా దినాలో స్థితికి తీసుకెళ్ళారు. దీనిని ప్రతిఘటించాలి.

**డిమాండ్స్ :**

(1) 1964 సహకార చట్టం పునరుద్దరించి, సహకార సంఘాలకు ప్రజాస్వామ్య ఎన్నికలు నిర్వహించాలి.

(2) 50% షేర్లు ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు అప్పగించే ఎం.ఎ.సి. చట్టాన్ని రద్దు చేయాలి.

(3) సహకార డైరీలను పునరుద్దరించాలి. అమూల్‌కు ప్రభుత్వ మద్దతు ఉపసంహరించుకోవాలి.

(4) రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా పాల సహకార సంఘాల సభ్యులకు ప్రతి లీటరుకు రూ.4లు చొప్పున ఇవ్వాలి.

# వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి

రాష్ట్రంలో రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ఉత్తరాంధ్రలోని ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు మరియు ప్రకాశం జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతాలు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఈ ప్రాంతాలు తరతరాలుగా వెనుకబడ్డాయి. ఈ ప్రాంతాల వెనుకబాటు గురించి ప్రభుత్వాలు నియమించిన అనేక కమీషన్స్ నిర్దిష్ట ప్రతిపాదనలతో నివేదికలు ఇచ్చాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో నియమించిన శ్రీకృష్ణ కమీషన్ ఈ ప్రాంతాల వెనుకబాటు గురించి మరింత సమగ్రంగా వివరించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లేక విభజన చట్టం -2014 రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, రాయలసీమలోని 7 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజి ప్రకటించింది. విభజన చట్టంలోని సెక్షన్ 46 (2) ప్రకారం **'రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు తగిన ప్రయోజనాలు మరియు ప్రోత్సహకాలను అభివృద్ధి ప్యాకేజీ రూపంలో ఇవ్వాలి'** అని పేర్కొంది. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహాలో, బొలంగీర్- కలహండి- కోరాపుట్ (బికెకె) తరహాలో సహాయం అందిస్తామని ప్రకటించారు. నాటి ప్రధాన ప్రతిపక్షపార్టీ బిజెపి ఈ ప్రతిపాదనలను ఆమోదించింది. బుందేల్‌ఖండ్ కు 9వేల కోట్లు, బికెకె ప్యాకేజికి 15 వేల కోట్లు కేటాయించారు. అయితే రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు మాత్రం ఆ తరహా ప్యాకేజీలు అమలు చేయలేదు.

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విభజన చట్టంలో పేర్కొన్న ఈ ఉమ్మడి 7 జిల్లాలకు జిల్లాకు సంవత్సరానికి 50 కోట్ల చొప్పున మూడు సంవత్సరాలు 1050 కోట్లు మాత్రమే ఇచ్చి, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇవ్వకుండా ఈ జిల్లాలకు కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది.

రాష్ట్రజనాభాలో రాయలసీమ జనాభా 30శాతం. రాష్ట్ర సాగుభూమి విస్తీర్ణంలో 36.8శాతం. అయితే సాగుభూమిలో కేవలం 7.6 భూమికి మాత్రమే సాగునీటి వసతి వుంది. కనీసం పదివేల మందికి ఉపాధి చూపే ఒక్క పరిశ్రమ కూడా ఈ ప్రాంతంలో లేదు. అనేక దశాబ్దాల క్రితం నిర్మించిన తుంగభద్ర హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి కాల్వలు వ్యవసాయ అవసరాలను ఏమాత్రం తీర్చేవిగాలేవు. ఈ సాగునీటి కాల్వలు క్రమంగా త్రాగునీటి కాల్వలుగా మారిపోతున్నాయి. హంద్రీనీవా పథకం ద్వారా పంటపొలాలకు నీరు ఇవ్వాల్సిందిపోయి, చెరువులకు నీరు నింపే పథకంగా మారింది. ఉత్తరాంధ్ర జిల్లాల జనాభా కోటి మందికి పైగా వున్నారు. విశాఖపట్నం నగరం మినహా మిగిలిన ఉత్తరాంధ్ర ప్రాంతమంతా తీవ్రంగా వెనుకబడి ఉంది. వేల కుటుంబాలకు జీవనాధారంగా, ఆంధ్రరాష్ట్ర ఆత్మాభిమానానికి ప్రతీకగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నది. ప్రకాశం జిల్లా కూడా వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో బాగా వెనుకబడివుంది. రాష్ట్ర తలసరి ఆదాయం బాగా తక్కువగా ఉన్న జిల్లాలో ప్రకాశం జిల్లా ఒకటి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నాటికి వున్న 13 జిల్లాల్లో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో విజయనగరం 13వ స్థానం, శ్రీకాకుళం 12వ స్థానం, అనంతపురం 11వ స్థానం, కర్నూలు 10వ స్థానం, చిత్తూరు 9వ స్థానం, ప్రకాశం 8వ స్థానం, కడప జిల్లా 7వ స్థానంలో వున్నాయి. అనంతపురం జిల్లా మొత్తం సాగుభూమిలో వర్షంపై ఆధారపడిన భూమి 85.39 శాతం వుండగా, కర్నూలు జిల్లాలో 72.31 శాతం ఉంది. ప్రకాశం జిల్లాలో 14 లక్షల ఎకరాల సాగుభూమిలో సుమారు తొమ్మిదన్నర లక్షల ఎకరాలు వర్షాధారం మీదనే సాగవుతుంది. రాయలసీమ జిల్లాల్లో 64 రకాల ఖనిజ సంపద ఉన్నట్టుగా శాస్త్రీయ సర్వేలు చెబుతున్నాయి. ఇనుము, బైరైట్స్, స్లైలైట్, అస్బెస్టాస్, రాగి, వజ్రాలు, కాల్‌సైట్, బంగారం, డోలమైట్, క్లై ఇలా ఖనిజసంపదకు కొదవలేదు. కడప, చిత్తూరు జిల్లాల్లో లభించే పులరిన్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఖనిజం. దీని ధర బంగారం కన్నా 150 రెట్లు అధికం అంటారు. నల్లమల అడవుల్లో దొరుకుతున్న అత్యంత విలువైన ఎర్రచందనం, శ్రీగంధం, శేషాచలం కొండల్లోను, కదిరి, కుప్పం గుట్టలలోనూ, ప్రకాశం జిల్లాల్లోని శింగరాయకొండ, కొణిజేడు, వై.పాలెం, ఒంగోలు, అద్దంకి, కనిగిరి కొండల్లో అపారమైన ఖనిజ సంపద ఉంది. అత్యంత విలువైన ఔషధమొక్కలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఉత్తరాంధ్రలో విలువైన గనులు ఉన్నాయి. అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ పాలకుల చిత్తశుద్ధిలోపం వల్ల వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గత పదిసంవత్సరాల్లో ఈ ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి వనరులు కలిపించడం లోనూ, పరిశ్రమలు స్థాపించడంలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నాయి.

ప్రభుత్వాలు ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేసిన అనేక పథకాలు శిలాఫలకాలు కూడా కనిపించని నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రత్యేకంగా 2014 రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసెన్ పరిశ్రమలు, టెక్స్‌టైల్ పార్క్, కడపలో ఉక్కు పరిశ్రమ, కర్నూలులో రూ.400 కోట్లతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి), రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై- విశాఖ పారిశ్రామిక

కారిడార్ వంటి అనేక హామీలలో గత తొమ్మిది సంవత్సరాల్లో ఒక్కటి కూడా పూర్తి అమలు కాలేదు. కొన్ని శంకుస్థాపన దశలోనే ఆగిపోయాయి.

ఉత్తరాంధ్ర సుజలస్రవంతి, వంశధార వంటి ప్రాజక్టుల నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం కలిపించలేదు. విజయనగరంలో నిర్మిస్తామన్నా గిరిజన కేంద్రీయ యూనివర్శిటీ, విశాఖపట్నంలో పెట్రోలియం యూనివర్శిటీలు ఇప్పటి వరకు పూర్తికాలేదు. ఈ ప్రాంతంలోని 24 లక్షల ఎకరాల సాగుభూమికి ఒక పంటకైనా నీటిపారుదల కలిపించాలి. అక్రమ మైనింగ్ ఆపాలి.

దళిత, గిరజన కుటుంబాలకు ప్రభుత్వ భూములు ఇచ్చి స్వయం కాళ్ళపై నిలపాల్సిన ప్రభుత్వాలు కేవలం కొన్ని స్కీమ్‌లు ఇచ్చి ఉద్ధరిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ కార్పొరేషన్‌ల ద్వారా ఒక్క శాశ్వత సదుపాయం కలగలేదు. బీడు భూమలు అన్యాక్రాంతం అవుతుండడంతో పాటు, జీవాలకు వస్తున్న వివిధ వ్యాధులవల్ల గొర్రెల, మేకల పెంపకందార్లు, ముడి సరుకుల ధరలు, విదేశీ దిగుమతుల పోటీతో చేనేత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రజకవృత్తిదార్లు సామాజిక వివక్షతో పాటు వృత్తిరక్షణ లేక కష్టాలకు గురవుతున్నారు. కుమ్మరి, కమ్మరి, వడ్డెర లాంటి అనేక వృత్తిదారులు పట్టణాలకు వలసలు వెళ్ళి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పట్టణాల్లో మైనారిటీ కుటుంబాలు స్వయం ఉపాధికి పెద్ద కంపెనీల పోటీలు, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో తీవ్ర ఆర్థిక వెనుకబాటుకు గురవుతున్నారు.

విద్య, వైద్యం, సామాజికసేవలు ప్రైవేటు పరం కావడంతో పేద, దిగువ మధ్యతరగతి ప్రజలపై అదనపు భారాలు పెరిగాయి. చదివించుకోవాలని ఆసక్తి పెరిగినప్పటికి, ఆ చదువులను కొనే శక్తిలేక గ్రామీణ పిల్లలు, పట్టణాల్లో పేదలు నివసించే కాలనీల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారు. ఇందులో అమ్మాయిలు మరింతగా నష్టపోతున్నారు. ఒకవైపు చదువు కోల్పోవడం, మరోవైపు చిన్న వయసులో పెళ్ళిల్లు చేసుకోవలసి రావడం అనే చక్రబంధంలో ఇరుక్కుంటున్నారు.

ఈ పరిస్థితుల్లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల సమగ్రాభివృద్ధికి క్రింది చర్యలు తక్షణం చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.

1. రాష్ట్ర విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి.
2. రాయలసీమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50వేల కోట్లు, ఉత్తరాంధ్ర జిల్లాలకు 25వేల కోట్ల రూపాయల ప్రత్యేకప్యాకేజి కేటాయించి, 3 సంవత్సరాల్లో ఖర్చు చెయ్యాలి.
3. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల్లోని ప్రతిపాదిత ప్రాజెక్టులన్నీ 3 సంవత్సరాలలో పూర్తి చెయ్యాలి. ఈ ప్రాంతాల్లోని సాగుభూమికి సంవత్సరానికి ఒక పంటకైనా సాగునీరు అందించాలి.
4. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల్లో పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీలు కలిపించి పరిశ్రమలను స్థాపించేందుకు చర్యలు చేపట్టాలి.
5. కడప జిల్లాలో ప్రభుత్వరంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి.
6. ప్రభుత్వరంగంలోనే విద్యా, వైద్యం అందించాలి. సాంఘిక సంక్షేమ హాస్టల్స్ మెరుగుపరచాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన పడకలను, సిబ్బందిని, పరికరాలను ఏర్పాటు చేయాలి.
7. వృత్తిదారులకు రక్షణ కలిపించాలి. చేనేతలో 11 రకాల రిజర్వేషన్ అమలు చేయాలి. ఎస్.సి, ఎస్.టి సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలి. ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ, బి.సి సంక్షేమ శాఖల ద్వారా ఈ తరగుతుల అభివృద్ధికి, స్వయం ఉపాధికి నిధులు కేటాయించాలి.
8. హంద్రీనీవాకు 80 టిఎంసిల నీరు కేటాయించాలి. పిల్లకాల్వలు తవ్వి ఆయకట్టుకు సాగునీరు అందించాలి.
9. రాయలసీమలో మైనింగ్ ఇన్‌స్ట్యూట్‌ను ఏర్పాటు చేయాలి. మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో 50శాతం రాయలసీమ అభివృద్ధికి ఖర్చు చేయాలి
10. గత ప్రభుత్వం శాసనసభలో రాయలసీమకు, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలకు ప్రకటించిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయడంతో పాటు, కొత్త పరిష్కార చర్యలను చేపట్టాలి.
11. కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పచెప్పే విధానాన్ని ఆపాలి. గ్రామీణ ప్రాంతాలలోని మిగులు భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పై చర్యలు చేపట్టాలని కోరుతున్నాము. పై డిమాండ్ల సాధన కోసం జరిగే ఉద్యమాలకు రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలోని మేధావులు, ప్రజాతంత్రవాదులు మద్ధతు ఇవ్వాలని కోరుతున్నాము.

# పట్టణ సంస్కరణలు - ప్రజలపై భారాలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ విశాఖపట్నంలో 27-10-2023న **"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, సంస్కరణలు-పట్టణ ప్రజలపై దుష్ప్రభావాలు"** అనే అంశం పై రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఈ క్రింది డిక్లరేషన్‌ను విడుదల చేసింది.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా ప్రజలకు తీవ్ర హానికలిగించే పట్టణ సంస్కరణలు వేగంగా అమలు చేస్తున్నది. ఏకంగా ప్రపంచ బ్యాంకు అవతారమెత్తింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్ర పరిధిలో ఉన్న పట్టణాభివృద్ధి, పట్టణ విధానం, పట్టణ ప్రణాళికను బలవంతంగా తన పరిధిలోకి గుంజుకుంటున్నది. మోడల్ మున్సిపల్ చట్టాలను రూపొందించి అమలు చేయాలని రాష్ట్రాలపై వత్తిడి తెస్తున్నది. కరోనాని అడ్డం పెట్టుకొని అదనపు అప్పుల పేర రాష్ట్రాలను లొంగ దీసుకొని పట్టణ సంస్కరణలు, విద్యుత్ ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల మార్పు, ఒకేదేశం – ఒకే రేషన్ కార్డు వంటి విధానాలను దేశవ్యాప్తంగా అమలుకు పూనుకున్నది. ఆస్తి విలువ ఆధారంగా అస్తి పన్ను విధానాన్ని ప్రవేశ పెట్టింది. విదేశీ, స్వదేశీ బడావ్యాపార పెట్టుబడుల లాభాల కోసం పట్టణ భూమి పై ఉన్న ప్రభుత్వ నియంత్రణ లన్నింటిని ఎత్తి వేస్తున్నది. పట్టణ భూ గరిష్ట పరిమితి చట్టాన్ని రద్దు చేసింది. పట్టణ భూమిని వ్యాపార సరుకుగా మార్చేసింది. స్మార్ట్ సిటీ, స్వచ్ఛ భారత్, అమృత పథకాలను ప్రవేశపెట్టి పట్టణ మౌలిక సదుపాయాలు ప్రైవేట్ పరం చేయడంతో పాటు పట్టణ ప్రజలపై భారాలు మోపే చర్యలకు వొడి గట్టింది. పేదలకు, దిగువతరగతి ప్రజలకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల్లో ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలను భాగస్వామ్యం చేసి పేదలపై భారీగా లబ్ధిదారుల వాటా పేరుతో భారం మోపింది.

కేంద్ర ఆర్థిక సంఘం నిధులన్నింటిని ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు ముడిపెట్టింది. స్వచ్ఛ సర్వేక్షణ పేర ర్యాంకులు ప్రవేశ పెట్టి పారిశుద్ధ్యాన్ని ప్రైవేట్‌పరం చేస్తున్నది. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పేరా పట్టణ స్థానిక సంస్థల ఆస్తులను బడా సంస్థలకు ధారాదత్తం చేస్తున్నది. కేంద్ర, రాష్ట్ర స్థాయిలోని ప్రణాళికా సంఘాలను ఏకపక్షంగా రద్దు చేసి పట్టణ స్థానికసంస్థల నిధులకు తీవ్ర దెబ్బ కొట్టింది. ఇప్పుడు మున్సిపల్ సంస్థలను అప్పుల ఊబిలోకి దించేచర్యలకు దిగింది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకు, అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ తదితర అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుండి మౌలిక సదుపాయాల కొరకు అప్పులు తీసుకోమని మరియు బాండ్స్ విడుదల ద్వారా, ప్రైవేట్ సంస్థల నుండి కూడా రుణాలు సేకరించుకోవాలని తీవ్ర వత్తిడి తెసున్నది. నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వాల పై ఆధార పడొద్దని అంతర్గతంగా పన్నులు పెంచుకోవడం, అదనంగా కొత్త పన్నులు ప్రవేశ పెట్టడం, అప్పులద్వారా ఆదాయాలను పెంచుకోవాలని స్థానిక సంస్థలను ఆదేశిస్తున్నది.

పట్టణాల్లో సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తూ మరోవైపు మతోన్మాద కార్యకలాపాల ద్వారా బలపడటానికి బిజెపి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని అనేక నగరాల్లో ఘర్షణలు సృష్టిస్తున్నది. పురాతన కట్టడాల పేర్లు, రహదార్లు, రోడ్డు కూడళ్ల పేర్లపై వివాదాలు సృష్టిస్తున్నది. పండగలను సైతం తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్నది. దాడులకు సైతం తెగబడుతున్నది. పచ్చి మూఢనమ్మకాలు, అశాస్త్రీయ, తిరోగమన భావాలను వ్యాప్తి చేస్తున్నది. ఈ చర్యలు పట్టణ ప్రజల అభివృద్ధికి, సమైక్యతకు తీవ్ర ప్రమాదం వాటిల్లింది.

నరేంద్ర మోడీ ప్రభుత్వానికి రాష్ట్ర వైసిపి ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయి ప్రమాదకర పట్టణ విధానాలను అమలు చేస్తున్నది. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు కూడా కేంద్ర బిజెపి పట్టణ విధానాలను, సంస్కరణలను అమలు చేసింది. ఇప్పుడు జగన్-మోడీలు ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు ప్రయోగశాలగా మార్చేశారు. మానవత్వం కూడా లేకుండా కరోనా కాలంలో ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధానాన్ని తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలపై సుమారు రు॥600 కోట్ల భారం మోపారు. ప్రతి ఏడాది 15శాతం ఆస్తి పన్ను ఆటోమేటిక్‌గా పెరిగేలా చట్టం తెచ్చారు. పైపెచ్చు భావనాల ప్లాన్‌ల అతిక్రమణల పేర పెనాల్టీలు, బిల్డింగ్ పీనలైజేషన్ చార్జీలు ప్రజలపై రుద్దుతున్నారు. ఖాళీ స్థలాల పై కూడా పన్ను విధించారు.

రాష్ట్ర వ్యాప్తంగా చెత్తపై పన్ను (యూజర్ చార్జీలు) విధించారు. ప్రజలనుండి తీవ్ర నిరసనలు వెల్లువెత్తినా, బలవంతాన డబ్బులు వసూలు చేస్తున్నది. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ వున్న చోట మురుగు నీటి కనెక్షన్ డిపాజిట్‌లతో పాటు మంచినీటి చార్జీల్లో 33 శాతం మురుగు నీటి చార్జీ గా వసూలు చేయాలని వత్తిడి తెస్తున్నది. రాష్ట్రంలో అమృత్ పథకం అమలు చేస్తున్న 32 పట్టణాల్లో తప్పని సరిగా మురుగు నీటి చార్జీలు వసూలు చేస్తామని కేంద్ర బిజెపి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అంతేగాక మంచినీటి చార్జీలు పెంచడం, కొళాయిలకు నీటిమీటర్లు బిగించాలని, పెద్ద మున్సిపల్ కార్పొరేషన్ లల్లో నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వ షరతులను కూడా రాష్ట్ర వైసిపి ప్రభుత్వం అంగీకరించి అమలుకు పూనుకుంది.

రాష్ట్ర ప్రభుత్వమే పట్టణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ముమ్మరం చేసింది. గతంలోనే పట్టణ భూగరిష్ట పరిమితి

చట్టాన్ని రద్దుచేశారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూముల మారకంపై వున్న నిబంధనలన్నింటిని సరళతరం చేసింది. ఆహార భద్రతకు ముప్పు తెస్తున్నది. ఇప్పుడు గిరిజన జిల్లాలు మినహా ఏకంగా జిల్లాకొక పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటుచేసి విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేపట్టింది. గత చంద్రబాబు నాయుడు అమలు చేసిన లాండ్ పూలింగ్ విధానాన్ని ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నది. బలవంతపు భూసేకరణకు పూనుకుంటున్నది. పేదల భూములను కొల్లగొడుతున్నది. బడా పెట్టుబడి దారులకు ధారాదత్తం చేస్తున్నది. పట్టణ ప్రణాళిక, జోనింగ్ నిబంధనలన్నింటిని ప్రైవేట్ పెట్టుబడుల లాభాలకు అనుకూలంగా మార్చేస్తున్నారు. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు.

పేదలకు, దిగువ, మధ్య తరగతి ప్రజలకు గృహకల్పనలో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు నష్టం కలిగించేలా వుంది. గత టిడిపి ప్రభుత్వం పట్టణాల్లో అందరికీ ఇల్లు పథకంలో భాగంగా లక్షల టిట్కో ఇళ్ళు నిర్మిస్తున్నట్లు ఎన్నికల ముందు హడావుడి చేశారు. ఈ ప్రభుత్వం కూడా చంద్రబాబు దారిలోనే నడుస్తున్నది. లక్ష లాది ఇళ్ళ నిర్మాణాలను అర్థంతంగా నిలిపి వేసింది. కట్టిన ఇళ్ళను కూడా లబ్ధిదారులకు కేటాయించలేదు.

ఇక పట్టణాల్లో జగనన్న సెంటు ఇంటి స్థలం పేదలకు తీవ్ర సమస్యలు తెచ్చిపెట్టింది. పెద్ద కార్పొరేషన్‌లలో 15 నుండి 30 కిలోమీటర్ల దూరంలో సెంటు స్థలం ఇచ్చారు. గ్రామాల నుండి ఉపాధి కోసం పట్టణాలకు వలసలు వస్తే జగనన్న ఇంటి పథకం మాత్రం పేదలను తిరిగి సెంటు ఇంటి జాగాకోసం సుదూర గ్రామాలకు పంపుతున్నది. ఇప్పుడు ప్రతి లబ్ధిదారుడు వాటాగా రు॥ 35 వేలు చెల్లించాలని షరతు విధించింది. ప్రభుత్వం ఇంటికి కేటాయించే లక్షా 80 వేల రూపాయలు ఏమాత్రం సరిపోవడం లేదు. మౌలిక సదుపాయాల కల్పన లేదు. ఎన్నికల దృష్టితో ప్రభుత్వం ఈ పథకం తీసుకురావడంతో భవిష్యత్తులో ఇల్లు లేని పట్టణ పేదలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు. మధ్య తరగతి ప్రజలకు ప్రవేశ పెట్టిన జగనన్న టౌన్‌షిప్‌లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

దశాబ్దాల పాటు పట్టణ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల భూములు, పోరంబోకు, కొండవాలు ప్రాంతాల్లో లక్షల్లో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలో ఈ నివాసాలను క్రమబద్ధీకరించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించింది. అదేమంటే రైల్వే, రోడ్లు, చెరువు, కాలువ అనేవి అభ్యంతరకర భూములని చెబుతున్నది. గత ప్రభుత్వాలు ఇచ్చిన పట్టాలు బదిలీకి, బ్యాంకు రుణాలు పొందే హక్కులు కల్పించడం లేదు. దేవాదాయ భూముల వివాదం ముడి పెట్టి వేలాది కుటుంబాల నివాస హక్కులను పునరుద్ధరించడం లేదు.

ప్రస్తుతం రాష్ట్రంలో పట్టణ జనాభా 36 శాతానికి పెరిగిందని అంచనా వేస్తున్నారు. అలాగే రాష్ట్రంలో నేడు 123 మున్సిపల్ సంస్థలు వున్నాయి. వీటిల్లో 17 కార్పొరేషన్‌లు, 77 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయతీలు వున్నాయి. ఇవన్నీ తీవ్ర నిధులకొరతతో సతమత మౌతున్నాయి. కనీస స్థాయిలో కూడా పౌర సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించలేక పోతున్నాయి. చిన్న పట్టణాల దుస్థితి వర్ణణాతీతం. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిదులు వికేంద్రీకరించాలి. కానీ ఈ దిశగా పాలకుల విధానాలు లేకపోగా కేంద్రీకరణ దిశగా వున్న కొద్దిపాటి స్థానిక సంస్థల అధికారాలను హరిస్తున్నారు. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించిన 18 రకాల అధికారాలు, విధులు పూర్తి స్థాయిలో నేటికీ బదిలీ చేయలేదు. ఈ విధులు అమలుకు అవసరమైన నిధులు విడుదల చేయడం లేదు. ఎన్నికైన మున్సిపల్ కౌన్సిళ్ళను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసారు. రాష్ట్ర ప్రభుత్వం 5 ఏళ్ల కొకసారి ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించకుండా, పట్టణ స్థానిక సంస్థలకు నిధులు గండి కొడుతున్నది. ప్రత్యేక నిధులు, గ్రాంట్లు, ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ నిధులు కూడా ఇవ్వడం లేదు. పైపెచ్చు పట్టణ స్థానిక సంస్థల పన్నులు, పన్నేతర ఆదాయాలు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, వివిధ పథకాల నిధులన్నింటిని తన అధీనంలోవున్న సిఎఫ్ఎంఎస్ అనే సంస్థకు తరలించుకుపోతూ స్థానిక సంస్థలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నది.

దేశంలో అత్యధిక మంది మురికివాడల్లో నివసిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్ర రాష్ట్రం ఒకటిగా నిలిచింది. ప్రతి ముగ్గురిలో ఒకరు మురికి వాడల్లో నివాసం ఉంటున్నారు. వీటిల్లో మౌలిక సదుపాయాలు, పౌరసేవల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. మున్సిపల్ బడ్జెట్స్‌లో 40శాతం నిధులు వీటి అభివృద్ధికి కేటాయించాలనే నిబంధనలు ఉన్నా అమలు చేయడం లేదు. నగర శివార్లకు తరలించిన మురికి వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. ప్రభుత్వ స్కీం ఇళ్ళు నిర్మించిన కాలనీల్లో కూడా కనీస పారిశుధ్య సౌకర్యాలు లేవు. కొత్తగా మున్సిపాలిటీల్లో విలీనం చేసిన గ్రామాల్లో మౌలిక సదుపాయాలను గాలికొదిలేశారు. మంచినీటి సదుపాయాలు కూడా అత్యధిక విలీన ప్రాంతాలకు లేని దుస్థితి నెలకొన్నది.

ఇక పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పెరుగుతున్న విద్య, వైద్యం ఖర్చులు, ఇంటి కనీస అవసరాలు, అద్దెలు, కరెంటు చార్జీల భారం, విచ్చలవిడి మద్యం అమ్మకాలు ఇవన్నీ పట్టణ ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. ప్రైవేట్ అప్పుల ఊబిలోకి ప్రజలను దించాయి.

ప్రపంచ బ్యాంక్ ఆదేశిత మోడీ–జగన్ ప్రభుత్వాల పట్టణ విధానాలు, సంస్కరణలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పన్ను భారాలు, యూజర్ చార్జీల విధింపు, మౌలిక సదుపాయాలు, పౌరసేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి

ఉద్యమిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పట్టణ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తున్నది. పట్టణాలు, నగరాలు కార్పొరేట్ల ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజన్లుగా చూసే విధానాన్ని పాలకులు విడనాడాలని, ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసే కేంద్రాలుగా, సమానత్వం, గౌరవం, మెరుగైన స్థిర జీవితాలకు పునాదులు వేసే విధానాలు చేపట్టాలని సీపీఎం పోరాడుతున్నది. సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం అధికారంలో కేరళ రాష్ట్రం స్థానిక సంస్థల పురోభివృద్ధిలో దేశంలో ఆదర్శంగా నిలిచింది. ఈ నేపథ్యంలో సీపీఎంకు ప్రజా మద్దతు ఎంతో అవసరం. అలాగే ఈ దుష్ట విధానాలు ఓడించేందుకు ప్రజలందరూ ఐక్యంగా సీపీఎంతో కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

(1) ఆస్తి విలువ ఆధారంగా తీసుకొచ్చిన నూతన ఆస్తిపన్ను విధానాన్ని రద్దు చేయాలి. పెంచిన ఆస్తిపన్నును, ప్రతి ఏడాది 15% ఆస్తిపన్ను పెంపును ఉపసంహరించాలి. ఆస్థిపన్ను, మంచినీరు, డ్రైనేజీ ఛార్జీలు పెంచే యాక్ట్ 44/2020,196,197,198 జీవోలు రద్దు చేయాలి.

(2) చెత్తపై పన్ను (యూజర్ ఛార్జీలు), భూగర్భ డ్రైనేజీ ఛార్జీలు రద్దు చేయాలి. అందరికి ఉచితంగా యుజీడీ కనెక్షన్స్ ఇవ్వాలి.

(3) ప్రతి పట్టణంలో నెలకి 20 వేల లీటర్లు మంచినీరు ఉచితంగా అందరికి ఇవ్వాలి.కుళాయిలకు మీటర్లు పెట్టే చర్యలు ఉపసంహరించాలి.

(4) మంచినీరు, మురుగునీరు, పారిశుద్ధ్యం, కళ్యాణ మండపాలు, పార్కులు, క్రీడాసదుపాయాలు తదితర మౌలిక సదుపాయాలు ప్రైవేట్‌పరం చేసే విధానాలకు స్వస్తిపలకాలి.

(5) ప్రపంచబ్యాంకు పట్టణ సంస్కరణలు అమలు నిలిపివేయాలి.

(6) స్థానిక సంస్థలకు రాష్ట్ర బడ్జెట్‌లో 40 శాతం నిధులు కేటాయించాలి.

(7) క్రమం తప్పకుండా రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించి ప్రతి ఏడాది స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలి. ఆర్థిక సంఘం సిఫార్సులు ఖచ్చితంగా అమలు చేయాలి.

(8) 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం పట్టణ స్థానిక సంస్థలకు విధులు, నిధుల బదిలీతోపాటు స్వయం ప్రతిపత్తి అధికారం కల్పించాలి.

(9) ఎన్నికైన మేయర్‌లు, ఛైర్మన్లు, కౌన్సిల్స్‌కు కార్యానిర్వాహక, పరిపాలన అధికారాలు కల్పించాలి. నిధులు ఖర్చు చేసుకునేందుకు ఎన్నికైన కౌన్సిళ్ళకు పూర్తి అధికారం ఇవ్వాలి.

(10) మున్సిపల్ సంస్థలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీలు, సంస్థల పెత్తనం తొలగించాలి.మున్సిపల్ నిధులు, పన్నులను సిఎఫ్ఎంఎస్‌లో జమచేసే విధానం రద్దు చేయాలి.

(11)100 చ॥గజాల లోపు ఇంటి నిర్మాణానికి ప్లాన్ అనుమతులు నుండి మినహాయించాలి.

(12) కొండవాలు,చెరువు,రోడ్డు,కాలువ,రైల్వే, ఇతర ప్రభుత్వ అభ్యంతరకర భూములనే సాకుతో పేదల అవాసాలను క్రమబద్ధీకరించడం లేదు. తక్షణం వీటినన్నింటిని క్రమబద్ధీకరించి రిజిష్టర్ చేయించి ఆధీకృత పట్టాలు ఇవ్వాలి.

(13) "అందరికి ఇళ్ళు" పథకంలో ఇళ్ళ నిర్మాణాలకు ఒక్కొక్కరికి 5లక్షలు ఇవ్వాలి. టిట్కో ఇళ్ళు పూర్తి చేయాలి. లబ్దిదారులకు తక్షణమే కేటాయించాలి.

(14) జగనన్న సెంటు స్థలంలో ప్రభుత్వమే ఎన్నికలలోపు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి. లబ్ధిదారుని వాటా రద్దు చేయాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి.

(15) పట్టణాల్లో దేవాదాయ భూములు, చెరువు, నదీ పరివాహక ప్రాంతాలు, కాలువ కట్టలు, రైల్వే స్థలాలు, ఇతర అనేక పేర్లతో ప్రజల నివాస కాలనీలను నిషేద భూముల్లో పెట్టారు. వెంటనే వీటిని మినహాయించి నివాస దారులను హక్కుదారులుగా గుర్తించాలి. పట్టాలివ్వాలి.

(16) మధ్యతరగతి ప్రజలకు 200 గజాలు చొప్పున ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు కేటాయించాలి.

(17) స్మార్ట్ సిటీ, అమృత్ పథకాలలో షరతులు తొలగించాలి. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ఉన్న షరతులను రద్దు చేయాలి.

(19) ప్రతి 10వేల జనాభాకు నలుగురు డాక్టర్స్ బృందంతో కూడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలి.

(20) మున్సిపల్ సంస్థల పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో మెరుగుపర్చాలి. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలి. మూసివేసిన పాఠశాలలను పునరుద్ధరించాలి.

(21) మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న అధికారులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, బడ్జెట్, టైం స్కేల్ పేర్లతో ఉన్న ఉద్యోగులందరిని పర్మినెంట్ చేసి రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలి.పట్టణ ఉపాధి హామీ పథకం

ప్రవేశపెట్టాలి.

(22) మున్సిపల్ బడ్జెట్‌లలో మురికివాడలకు 40శాతం నిధులు కేటాయించాలి. విలీన గ్రామాల్లో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

(23) వార్డు సచివాలయాలను పట్టణ స్థానిక సంస్థల పరిధిలోకి తీసుకురావాలి.

(24) ప్రతిపట్టణంలో గ్రంథాలయాలు, కాంపిటేటివ్ డిజిటల్ జాబ్ ఓరియంటెడ్ లైబ్రరీలు, ఫిట్‌నెస్ జిమ్ములు, బాలల సైంటిఫిక్ కేంద్రాలు, సైన్స్ మ్యూజియమ్‌లు, ప్లానిటోరియంలు, కల్చరల్ థియేటర్లు, క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలి.

(25) అపార్ట్‌మెంట్స్ రీడెవలప్‌మెంట్ కొరకు తమిళనాడు తరహా చట్టం తీసుకురావాలి.

# జీడికి గిట్టుబాటు ధర - జీడిపంట సమగ్రాభివృద్ధికై బోర్డు ఏర్పాటు

రాష్ట్రంలో కోస్తా తీర ప్రాంతం జిల్లాలలో సుమారు 1,86,000 హెక్టార్లలో జీడి మామిడి తోటలు పండిస్తున్నారు. 4 లక్షల మంది రైతు కుటుంబాలు జీడి తోటలపై ఆధారపడి ఉన్నారు. శ్రీకాకుళం నుండి ప్రకాశం జిల్లా వరకు కొండనాలు ప్రాంతాలు, ఉ దానం, అనకాపల్లి వంటి మైదాన ప్రాంతాలలో జీడి పంట విస్తరించి ఉన్నది. పేద రైతులు, గిరిజనులు అధిక సంఖ్యలో జీడి తోటలు పెంచుతూ జీవిస్తున్నారు. జీడిపిక్కలకు నిలకడైన ధరలు లేక రైతులు దళారీల దోపిడీకి గురవుతు తీవ్రంగా నష్టపోతున్నారు. 2021 ఏప్రిల్ సీజన్లో బస్తా(80 తేజీలు) జీడిపిక్కలు 12 వేల రూపాయలకు కొనుగోలు చేసేవారు. ఈ ఏడాది సీజన్ మొదటి వారంలోనే బస్తా 8 వేల రూపాయలకు పడిపోయింది. మార్కెట్లో పప్పు ధరలు స్థిరంగానే ఉంటున్నా రైతులు వద్ద కొంటున్న పిక్కలు ధరలు అమాంతంగా తగ్గిపోవడంలో వ్యాపారుల స్వార్థము. ప్రభుత్వాల అలసత్వం అందుకు కారణంగా ఉంటున్నాయి. ధరలు నిర్ణయించడంలో ఎటువంటి శాస్త్రీయతగాని, పారదర్శకత గాని లేదు. ప్రస్తుతం జీడిపిక్కలు 80 కేజీలు బిస్తా వ్యాపారులు 5 వేల రూపాయలకు కొంటున్నారు. ఒక బస్తా జీడిపిక్కల నుండి – 25 కేజీల పప్పు వస్తుంది. కేజీ పప్పు ధర ఎనిమిది వందల రూపాయలు అంటే బస్తాకు రూ. 20,000 వస్తుంది. ప్రాసెసింగ్ ఖర్చులు 2 వేల రూపాయలు పోను, రైతులు కోరిన ధర 10 వేల రూపాయలు చెల్లించినా వ్యాపారులకు బస్తాకు 12 వేలు రూపాయలు మిగులుతుంది. పైగా ఉప ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు. అయినప్పటికీ రైతులకు న్యాయమైన ధర ఇవ్వడానికి వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రభుత్వము పట్టించుకోలేదు.

కేరళ రాష్ట్ర ప్రభుత్వం జీడి రాష్ట్రంలో జీడి పరిశ్రమ ప్రధానంగా పలాస, వేటపాలెం, మోది, దేవరాపల్లి ప్రాంతాలలో ఉన్నది. సుమారు 550 పైనా జీడిపప్పు తయారీ పరిశ్రమలు ఉంటే ఇందులో శ్రీకాకుళం జిల్లా 450 పైగా పరిశ్రమలు ఉన్నాయి. జీడి పరిశ్రమ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నది. పరిశ్రమలో పనిచేస్తున్న వారికి పియస్, ఈఎస్ఐ, వేతనాలు కానీ అమలు చేయడం లేదు. పరిశ్రమలలో మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కార్మికుల కోసం, పరిశ్రమల అభివృద్ధి కోసం పట్టించుకోవడం లేదు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విదేశ జీడిపిక్క దిగుమతులపై సుంకాన్ని తగ్గించి వేసింది. యస్ ఎడ్లకు మరింత స్వేచ్ఛగా దిగుమతులకు అధికాను కల్పించింది... ఈ విధానం వలన దేశీయ జీడి రైతులు నష్టపోతున్నారు. కేరళ రాష్ట్రం మాదిరిగా జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచాలి. ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.

**డిమాండ్స్:**

1) జీడిపిక్కలు 80 కేజీల బస్తాకు 16 వేల రూపాయలు గిట్టుబాటు ధర ప్రకటించి ఆర్బికేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

2) రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

3) స్థానికంగా పండిన జీడిపిక్కలను కొనుగోలు చేసిన తరువాత మాత్రమే విదేశీ జీడిపిక్కలు దిగుమతికి అనుమతించాలి.

4) జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాలవారీగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలి.

5) పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలి..

6) రైతు వారీ సాగు విస్తీర్ణం నమోదు చేసి జీడి పంటకు వాతావరణ బీమా అమలు చేయాలి.

7) జీడి పంట పండే ప్రాంతాలలో జీడి పండ్లు మరియు ఒక్కలు ప్రాసెసింగ్ యూనిట్లు ప్రభుత్వమే ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలి..

8) తిత్లీ తుఫానులో నష్టపోయిన జీడి కొబ్బరి మొదలగు ఉద్యానవన పంటలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలి.

# స్థానిక సంస్థలు - వికేంద్రీకరణ - సచివాలయాలు

ఆంధ్రప్రదేశ్ లో 125 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి .ఇందులో 17 మున్సిపల్ కార్పోరేషన్లు, 76 మున్సిపాలిటీలు, 30 నగర పంచాయితీలు. రాష్ట్రంలో 13,325 పంచాయితీలు ఉన్నాయి. 685 మండలాలు ఉన్నాయి. 9,939 ఎమ్‌పిటిసి సభ్యులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 13 జిల్లా పరిషత్తులు ఉన్నాయి.

స్థానిక సంస్థలు లక్ష్యాలు: సుపరిపాలన, స్వపరిపాలన, గ్రామ స్వరాజ్యం, ప్రజల భాగస్వామ్యం, ప్రజా ప్రణాళికలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, కనీస పౌర సౌకర్యాలు, హేతుబద్ధమైన పన్నుల విధానం, అధికార వికేంద్రీకరణ, ప్రజలకే అధికారం లక్ష్యాలుగా చెప్పబడ్డాయి.

**73, 74 రాజ్యాంగ సవరణ:** ఈచట్టాలు అమల్లోకి వచ్చి 30 సంవత్సరాలు గడిచాయి.

అందులో కీలక అంశాలు : స్థానిక సంస్థలను మూడవ అంచ ప్రభుత్వంగా గుర్తింపు ,రాజ్యాంగబద్ధత కల్పించడం. ఐదు సంవత్సరాలకు ఒకసారి క్రమం తప్పకుండా ఎన్నికల నిర్వహణ. ఎస్సీ, ఎస్టీ, మహిళలు బలహీనవర్గాలకు రిజర్వేషన్లు.

అధికారాల బదలాయింపు. ప్రభుత్వాల ఆదాయంలో స్థానిక సంస్థలకు నిధుల వాటా. వార్డ్స్ కమిటీలు, గ్రామ, వార్డు సభల నిర్వహణ. రాష్ట్ర ఆర్థిక సంఘం(SFC) ఏర్పాటు, జిల్లా ప్రణాళికా, మహానగర ప్రణాళిక కమిటీల ఏర్పాటు, తదితరములు.

వార్డు కమిటీలు, గ్రామ సభలు, ప్రజల భాగస్వామ్యం: మూడు లక్షల జనాభా దాటిన మున్సిపాలిటీలలో ప్రజల ప్రాతినిధ్యంతో వార్డు సభలు ఏర్పాటు చేయాలి. గ్రామ వార్డు సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలి. ఇవేవీ అమలు జరగలేదు. గిరిజన ప్రాంతాలలో గ్రామసభల అభిప్రాయం లేకుండా ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదు. కేంద్ర ప్రభుత్వం చట్టాలనే సవరించింది. షెడ్యూల్ ఏరియాలో కూడా గ్రామసభల పాత్ర లేకుండా పోతున్నది.

- ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం తదితర కీలక అంశాలపై ప్రజలు లక్షలాదిగా అభ్యంతరాలు తెలియజేసినా ప్రభుత్వము, మున్సిపల్ కౌన్సిళ్ళు వాటిని పరిగణనలో తీసుకోకుండా నిర్ణయాలు గైకొన్నాయి. చెత్త పన్ను, యూజర్ చార్జీలపై ప్రజల అభ్యంతరాలు కూడా స్వీకరించలేదు.
- మున్సిపాలిటీలలో ఎన్నికైన కౌన్సిల్ సమావేశాలు మొక్కుబడితంతుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసే సంస్థలుగా మారిపోయాయి. జిల్లా ప్రణాళిక, మహానగర ప్రణాళిక కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదు.

  వికేంద్రీకరణ స్థానంలో కేంద్రీకరణ: గతంలో ఏనాడు లేని విధంగా మున్సిపాలిటీలలో వసూలు చేసే పన్నులను CFMS పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకుంటున్నది. ప్రభుత్వ ఇష్టాఇష్టాలను బట్టి ఆ నిధులను విడుదల చేస్తున్నారు. ప్రభుత్వం నిధులను కేటాయించకపోగా స్థానిక సంస్థల నిధులు పై కూడా ప్రభుత్వమే పెత్తనం చేస్తున్నది.
- పర్మినెంట్ సిబ్బంది నియామకంపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం పెట్టుకున్నది, ఇప్పుడు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కూడా ప్రభుత్వ అనుమతి లేకుండా నియమించ రాదు. దీనికి ఆప్కాస్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. (పట్టణ స్థానిక సంస్థల్లో 20% పోస్టులు ఖాళీగా ఉన్నాయని కాగ్ ఎత్తి చూపింది.)
- శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులు స్థానిక సంస్థల్లో గౌరవసభ్యులుగా ఉండాలి, కానీ వారే స్థానిక సంస్థలపై పెత్తనం చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులు నిమిత్తమాత్రులుగా మారారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడుతున్న పథకాలలో స్థానిక సంస్థలు తమ వాటా భరించాలని నిబంధనలు పెడుతున్నారు. దీనికై అప్పులు చేసి స్థానిక సంస్థలు అప్పుల ఊబిలో దిగిపోతున్నాయి.
- పన్నులు ఫీజులు ఏ మున్సిపాలిటీలో ఎంత వసూలు చేయాలో ఆయా స్థానిక సంస్థలు కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే విధానపరమైన నిర్ణయాలు చేసి రుద్దుతున్నాయి.
- మున్సిపాలిటీల పర్యవేక్షణలో నడిపే పాఠశాలలను ప్రభుత్వ పర్యవేక్షణలోకి మార్చారు.

**సారాంశం:**

స్థానిక సంస్థల స్వపరిపాలన పూర్తిగా లోపించింది. వికేంద్రీకరణ లేకపోగా మరింత కేంద్రీకరణ పెరిగింది. ప్రజల భాగస్వామ్యం శూన్యం. 73 ,74 రాజ్యాంగ సవరణ స్ఫూర్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయి. నిధులను కేటాయించరు, విధులను బదలాయించరు. కేటాయించిన నిధులను మళ్లిస్తారు. స్థానిక సంస్థలు నిధుల లేమితో కునారిల్లుతున్నాయి. మౌలిక సదుపాయాలు కాదు కదా, కనీస నిర్వహణకు కూడా నిధులు లేని దురావస్థలో పడ్డాయి. స్థానిక సంస్థల లక్ష్యాలను పూర్తిగా ప్రభుత్వాలు విస్మరించాయి.

**ఈ స్థితికి కారణాలు:**

- కేంద్రంలోని గత ప్రభుత్వాలు, నేడున్న బిజెపి సర్కార్ విధానాలలో సంస్కరణల పేరుతో వచ్చిన మార్పులు, స్థానిక సంస్థలను సేవా సంస్థలుగా కాకుండా వ్యాపార సంస్థలుగా పరిగణించే ధోరణి. ప్రజల నుండి ప్రభుత్వాలు వసూలు చేస్తున్న పన్నులలో స్థానిక సంస్థలకు చట్టబద్ధంగా నిధులు కేటాయించాలన్న రాజ్యాంగ స్ఫూర్తి విస్మరించి స్థానిక సంస్థలే నిధులు వసూలు చేసుకోవాలని సూత్రీకరించటం. ప్రతి సదుపాయాల కల్పనకు, నిర్వహణకైనా అయిన ఖర్చులు ప్రజల నుండే రాబట్టాలని విధానాలు. నిధులకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడకుండా ప్రజల నుండే వసూలు చేయాలని, రుణాల ద్వారా, బాండ్ల ద్వారా సమకూర్చుకోవాలని మార్గదర్శక సూత్రాలు రూపొందించడం,
- ఆర్థిక సంఘం, ఇతర కేంద్ర ప్రభుత్వ స్కీములు, గ్రాంట్లకు షరతులతో ముడిపెట్టి విడుదల చేయటం, షరతులు అమలు చేయని స్థానిక సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు విడుదల చేయకుండా నిలిపివేయటం
- రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసులను పట్టించుకోకపోవడం, వాటి అమలుపై ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడం, అమలకు సంబంధించిన రాజ్యాంగపరమైన వ్యవస్థలు పనిచేయకపోవడం.
- సంస్కరణలలో భాగంగా వివిధ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, స్కీములు అమలుకు స్పెషల్ పర్పస్ వెహికల్( SPV) ఏర్పాటు, విధానపరమైన ముఖ్యమైన నిర్ణయాలను ఎన్నికైన స్థానిక సంస్థలు కాకుండా కన్సల్టెంట్లు, అధికారులు నిర్ణయాలు గైకొనటం
- అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి స్థానిక సంస్థలపై వాటి ద్వారా పెత్తనం చేయటం.ఈ అథారిటీలలో ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వమే పెత్తనం చేయటం.
- రాజకీయ ప్రయోజనాల కోసం స్థానిక సంస్థలు ఎన్నికలను కుంటి సాకులతో వాయిదా వేయటం. లిటిగేషన్‌లతో కాలయాపన చేయటం, లిటిగేషన్లకు ప్రభుత్వమే అవకాశం కల్పించడం.
- స్థానిక సంస్థల పరిధిలోని భూములను ప్రజా ప్రయోజనాలు కాకుండా కార్పొరేట్లు, అధికారపక్ష రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం, కేటాయించడం.

**సచివాలయాలు:**

11,163 గ్రామ సచివాలయాలు,3842 పట్టణ సచివాలయాలు మొత్తం కలిపి15005 సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాలలో సి1,34,694 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 2,54,229 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారు.

లక్ష్యం: వివిధ విభాగాల సేవలు ,పథకాలు ప్రజలకు చేరువ కావటం. ప్రజల భాగస్వామ్యం పెంచడం. వికేంద్రీకరణ స్ఫూర్తిని అమలు చేయడం తదితరములు.

**ప్రయోజనం:** ప్రజలకు అందుబాటులో కార్యాలయాలు ఉండటం. ప్రజలు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేయటం. పథకాలు అందజేయటం. కొన్ని సమస్యలు పరిష్కరించటం.

**నష్టాలు:**

- వైసీపీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కొరకు ప్రభుత్వం వీటిని సాధనంగా వినియోగించడం. స్థానిక సంస్థల పాత్ర లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పెత్తనం చేయటం. స్థానిక సంస్థలకు ప్రజలకు జవాబుదారీతనం లేకుండా పోవడం.
- రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, సచివాలయాల మధ్య సమన్వయం లోపించి గందరగోళం ఏర్పడటం.
- అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల జేబు సంస్థలుగా వీటిని మార్చటం. రాజకీయ దురుద్దేశాలతో ప్రతిపక్ష పార్టీల వారిపై కక్ష సాధించటం.
- పన్నుల వసూళ్లకు సంక్షేమ పథకాలకు ముడిపెట్టి ప్రజలను బెదిరించి వసూలు చేయటం.
- పథకాలకు, ఎన్నికలకు ,ఓట్లకు రాజకీయాలకు ముడిపెట్టి అధికార పార్టీకి అనుకూలంగా మలుచుకోవడం. స్థానిక ప్రజల కదలికలు ,కార్యకలాపాలు, రాజకీయ స్పందనలు ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వారిపై నిర్బంధం ప్రయోగించడం. ప్రజలు ప్రజా ఉద్యమాలను అణిచివేయటానికి పోలీసులు, ప్రభుత్వం ..సచివాలయాలను, వాలంటీర్లను సాధనాలుగా వినియోగించుకోవడం. ప్రజలపై నిరంతర నిఘా, అణిచివేతకు, రాజకీయ ప్రయోజనాలకు వీలుగా ఈ సంస్థలను మార్చటం.

**సారాంశం:** సచివాలయ వ్యవస్థ ఉద్దేశం మంచిదే అయినా అమలు చేస్తున్న ప్రభుత్వ వైఖరి వలన ఇవి రాజకీయ సాధనాలుగా ప్రజలపై

పెత్తనం చేసే సాధనాలుగా మారిపోయాయి. స్థానిక సంస్థలతో సంబంధం లేకుండా సచివాలయాల ఏర్పాటు, నిర్వహణతో ప్రజాస్వామ్య విరుద్ధంగా మారిపోయాయి. ప్రజల భాగస్వామ్యంతో ,స్థానిక సంస్థల పర్యవేక్షణతో ఈ సంస్థలు నడిస్తేనే ప్రయోజనం ఉంటుంది. ఇది ప్రజా వ్యతిరేకంగా మారుతున్నాయి, మరింతగా మారే ప్రమాదం ఉన్నది.

**కోర్కెలు, సూచనలు:**

- రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం 40 శాతం నిధులను స్థానిక సంస్థలకు కేటాయించాలి.
- రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసులను కచ్చితంగా పాటించాలి ,అమలుపై పర్యవేక్షణ ఉండాలి.
- మున్సిపాలిటీలు, పంచాయతీలలో గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యం కల్పించాలి.
- విధానాలు, బడ్జెట్ రూపకల్పనలో కేరళ తరహాలో ప్రజల భాగస్వామ్యం కల్పించాలి.
- షరతులతో ముడిపెట్టి నిధులు విడుదల చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి.
- 73 ,74 రాజ్యాంగ సవరణ అమలుపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరగాలి, అనుభవం ఆధారంగా ఆ స్ఫూర్తిని అమలు చేయడానికి మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

**తక్షణ కోర్కెలు:**

- తక్షణం రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిన 14,15 ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం పంచాయతీలకే కేటాయించాలి.
- స్థానిక సంస్థలకు పెండింగ్ లో ఉన్న ఎన్నికలను వెంటనే నిర్వహించాలి.
- పట్టణాలలో వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలి.
- స్థానిక సంస్థల నిధులను ప్రభుత్వ గుప్పెట్లో పెట్టుకునే CFMS విధానం రద్దు చేయాలి
- సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థను స్థానిక సంస్థల పర్యవేక్షణలో నడపాలి.
- సిబ్బంది నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి కాకుండా స్థానిక సంస్థలకే కల్పించాలి. “స్థానిక పరిస్థితులు కనుగుణంగా పన్నులు, ఫీజులు నిర్ణయించుకునే అధికారం స్థానిక సంస్థలకు ఉండాలి.
- పంచాయితీల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే భరించాలి. పెనాల్టీలు రద్దు చేయాలి.
- సచివాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయితీలకు జమ చేయాలి.
- పంచాయితీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు తదితర సిబ్బంది వేతనాలను ప్రభుత్వమే భరించాలి.

# నీటిపారుదల రంగం- భూసేకరణ- పునరావాసం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పునర్విభజన అనంతరం 13 జిల్లాలు 1,62,970 చ.కి.మీ భౌగోళిక విస్తీర్ణంతో దేశంలో 8వ అతిపెద్ద రాష్ట్రంగా ఏర్పడింది. 974 కిలోమీటర్ల పొడవుతో దేశంలోనే రెండవ అతిపెద్ద తీరరేఖను కలిగి ఉంది. రాష్ట్రంలోని ప్రధాన నదులైన గోదావరి, క్రిష్ణా, పెన్నా, వంశధార, నాగవళి నదుల ద్వారా 1554 టిఎంసీల నీరు మన రాష్ట్రానికి అందుతుంది. ఇవి కాకుండా వర్షాధార అదనపు జలాలు 776.715 టిఎంసీలు, భూగర్భజలంగా మారేనీరు 355.000 టిఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఈ మొత్తం ఈ నీటిని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి వినియోగించేపద్ధతిలో సక్రమంగా పంపిణీచేసి, అవసరమైన కొత్త ప్రాజెక్టులను నిర్మించడానికి, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. **ప్రస్తుత సాగునీటి వనరులు- సాగువిస్తీర్ణం**

మన రాష్ట్రంలో గోదావరి 784.000 టిఎంసీలు, క్రిష్ణా 609.000, పెన్నా 93.000, వంశధార 46.000, నాగవళి ద్వారా 22.000 టిఎంసీల నీరు మొత్తం ఈ 5 ప్రధాన నదుల నుండి మొత్తం 1554 టిఎంసీల నీరు మన రాష్ట్రానికి లభ్యమవుతుంది. ఉమ్మడి 13 జిల్లాల్లో కలిపి ఆ నీటిలో 1476.109 టిఎంసీల నీటిని నిలుపుకునే సామర్థ్యం కలిగిన ఏర్పాట్లు ఉన్నాయి. ఇంకో 78 టిఎంసీల నికరజలాలను నిలువచేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. ఇవి కాకుండా వర్షాధార అదనపు జలాలు, భూగర్భజలాలు ఉన్నాయి. 13 జిల్లాల్లో వినియోగించ వీలున్న వర్షపుజలాలు సుమారు 776.715 టిఎంసీలు అందుబాటులో ఉండగా, ఇప్పటికీ

వినియోగిస్తున్నది మాత్రం 278.751 టిఎంసీలు మాత్రమే. అనగా ఇంకా 497.964 టిఎంసీల నీరు వినియోగించు కోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. అలాగే రాష్ట్రంలో 7,76,517 బోరుబావులు ఉన్నాయి. భూగర్భజలంగా మారేనీరు 355.000 టిఎంసీలు, వినియోగిస్తున్నది మాత్రం 245.000 టిఎంసీలు. అందుబాటులో ఉన్న నీటిని సంపూర్తిగా వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టడం ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధి చెందుతుంది.

ఆంధ్రరాష్ట్రంలో వ్యవసాయసాగుకు అనువైన భూమి 2,11,84,787 ఎకరాలు. అందులో ప్రస్తుతం సాగు అవుతున్నది 1,49,44,910 ఎకరాలు. రాష్ట్రంలో పూర్తయిన భారీ ప్రాజెక్టుల ద్వారా 50,76,074 ఎకరాలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 6,09,288 ఎకరాలు, చిన్న తరహా ప్రాజెక్టుల ద్వారా 26,14,250 ఎకరాలు మొత్తం 82,99,612 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే చిన్న తరహా ప్రాజెక్టులు అనగా చెరువులు, కుంటల కింద సాగునీరు నికరంగా ఉండదు. అందువల్ల నికరసాగు ప్రభుత్వ లెక్కల కంటే వాస్తవసాగులో తక్కువగా ఉంటుంది. ఏమైనప్పటికీ అధికారికి లెక్కల ప్రకారం చూసిన రాష్ట్రంలోని మొత్తం సాగుభూమిలో 55.5 శాతం సాగుభూమికి మాత్రమే సాగునీరు అందుతుంది.

క్రిష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల ద్వారా మన రాష్ట్రం వినియోగించుకోవడానికి వీలున్న నికరజలాలు (75శాతం ఆధారంగా) 1554 టిఎంసీలు. ఇందులో నిర్మాణం పూర్తయిన భారీ ప్రాజెక్టుల ద్వారా 821.523 టిఎంసీలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 58.116, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 267.280 టిఎంసీలు మొత్తం 1146.871 టిఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకోగలుగుతున్నాము. అనగా ఇంకో 407 టిఎంసీల నికరజలాలను ఏ ఆటంకాలు లేకుండా వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. దానికి అవసరమైన కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ప్రస్తుత ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం పెంచితే అదనంగా కనీసం 40 లక్షల ఎకరాలకు ఆరుతడి పంటలకు సాగునీరు అందించవచ్చు.

**పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు**

2014-15 నుండి 2018-19 సంవత్సరాల మధ్య కాలంలో 56 సాగునీటి ప్రాజెక్టులకు (పోలవరంతో కలిపి) రూ.80,792 కోట్లు కేటాయించి రూ.56,894 కోట్లు ఖర్చుచేసారు. అయితే వీటిలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తికాలేదు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను ఎంపికచేసుకొని దశలవారిగా పూర్తిచేయాలని చాలకాలంగా సిపిఎం, అలాగే నీటిరంగ నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు వాటిని ఖాతరుచేయకుండా అన్ని ప్రాజెక్టులపై అరకొర నిధులు ఖర్చుచేసారు. ప్రాజెక్టులను అసంపూర్తిగా ఒదిలేసారు. ఈ ప్రభుత్వం నూతనంగా 37 ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించి 4 సంవత్సరాల్లో పూర్తిచేస్తామని ప్రకటించింది. వాస్తవంగా గత 56 ప్రాజెక్టులకు, ఇప్పుడు ప్రకటించిన 37 ప్రాజెక్టులకు కలిపి రూ.1,44,262 కోట్లు ఖర్చుచేయాల్సి వస్తుంది. అంత ఖర్చుచేసి ప్రాజెక్టులను ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో పూర్తిచేయడం ఎలా సాధ్యమవుతుంది?. అసంపూర్తిగా వున్నా లేదా నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు పూర్తయితే భారీ ప్రాజెక్టుల ద్వారా 580.692 టిఎంసీల నీటితో 50,95,394 ఎకరాలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 25.111 టిఎంసీల నీటితో 2,82,238 ఎకరాలు, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 3.742 టిఎంసీల నీటితో 58,052 ఎకరాలు మొత్తం 54,35,684 ఎకరాలకు సాగునీరు అందె అవకాశం ఉంది. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం.

**ప్రాజెక్టుల నిర్మాణ ఆలస్యం వల్ల పెరుగుతున్న ఖర్చులు**

ప్రకటించిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయకపోవడంవల్ల రెండుసమస్యలు తీవ్రమవుతున్నాయి. ఒకటి పంట పొలాలకు సాగునీరు అందకపోవడం, రెండు నిర్మాణ ఖర్చులు భారీగా పెరగడం. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 9 ప్రధాన ప్రాజెక్టుల ప్రారంభఅంచనాలు, ఇప్పటి వరకు చేసిన ఖర్చులు, వీటని పూర్తి చేయడానికి అవసరమైన అంచనాల వివరాలు పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 2009 జనవరి 2న రూ.7.214 కోట్లతో "ఉత్తరాంధ్ర సుజల స్రవంతి" పథకాన్ని ప్రకటించారు. శ్రీకాకుళం 0.85 లక్షల ఎకరాలు, విజయనగరం 3.94 లక్షల ఎకరాలు, విశాఖ 3.21 లక్షల ఎకరాలు మొత్తం 8 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ఉత్తరాంధ్రలో 23.24 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. ఈ పథకాన్ని ప్రటించిన తర్వాత 2012 వరకు నిధులు కేటాయించిలేదు. ఇప్పుడు దాని వ్యయం రూ.17.411 కోట్లకు పెరిగింది. రాయలసీమ జిల్లాలకు సంబంధించి హంద్రీనీవా మొదటి, రెండు దశలు పూర్తిచేసి 4.5 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కలిపిస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఎకరానికి సాగునీరు ఇవ్వలేదు. ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వాహణ ఇలా ఉంటే ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల నుండి వలసలను ఎలా నివారిస్తారు.

ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాజెక్టుల పరిస్థితులపై 31-03-2019న సమీక్షించారు. ఆ సమీక్ష నివేదికల ప్రకారం తెలుగుగంగ,

గాలేరు, నగరి, హంద్రీ-నీవా, శ్రీశైలం కుడికాలువ, పూలసుబ్బయ్య వెలిగొండ, గుండ్లకమ్మ, వంశధార-2 (1,2), తోటపల్లి బ్యారేజి, చింతలపూడి లిఫ్ట్ లకు కలిపి ప్రారంభ అంచనాల మొత్తం రు.13,614 కోట్లు. 31-03-2019 నాటికి ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి పెరిగిన అంచనా మొత్తం రు.47,673 కోట్లు. ఇదే తేదీ నాటికి ఖర్చుచేసిన మొత్తం రు.36,597 కోట్లు. ఈ ప్రాజెక్టులను 2023 చివరి నాటికి పూర్తి చేయడానికి అయ్యే అంచనా ఖర్చు రు.19,208 కోట్లు. ప్రారంభ అంచనాలకు నేటికి 409.9 శాతం పెరుగుదల జరిగింది. ఈ లెక్కన సకాలంలో ప్రాజెక్టులను పూర్తిచేసివుంటే అదనంగా మరో 30 ప్రాజెక్టులను నిర్మించి వుండవచ్చు.

ప్రాజెక్టుల నిర్ణయించుకున్న సమయంలో పూర్తికాకపోవడం వెనుక ప్రభుత్వ ఆర్థికసమస్యలతో పాటు, కాంట్రాక్టర్లకు, రాజకీయనాయకులకు ఉన్న బంధం, రాజకీయపార్టీల రాజకీయప్రయోజనాలు ఉంటున్నాయి.

**చిన్ననీటి పారుదల ప్రాధాన్యత**

రాష్ట్రం మొత్తం మీద మైనర్ ఇరిగేషన్ కింద చెరువులు, కుంటలు 34,147 ఉన్నాయి. వీటికింద సుమారు 26,72,302 ఎకరాల సాగుభూమి ఉంది. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో చెరువులు, కుంటలు అత్యధికంగా ఉన్నాయి. ఉత్తరాంధ్ర మూడు జిల్లాలలో అత్యధికంగా 13,791, రాయలసీమ నాలుగు జిల్లాలలో 13,098 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిని సక్రమంగా వినియోగించుకోవడం వల్ల ఈ ప్రాంతాల్లో 14 లక్షల 78 వేల ఎకరాలకు కనీస నీటివసతి కలిపించడానికి అవకాశం ఉంది. రాజుల కాలం నాడు నిర్మించిన ఈ చెరువులు, కుంటల పరిస్థితి చాలా ప్రాంతాల్లో దయనీయంగా ఉంది. పూడికతో పాటు, కట్టలు తెగిపోవడం, నాశిరకంగా ఉండడంతో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోతుంది. వీటి నిర్వహణ మెరుగుచేయడం వల్ల గ్రామాల్లో సాగునీటికి, త్రాగునీటికి కనీస రక్షణ కలిపించవచ్చు.

**ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కేటాయింపులు- ఖర్చులు**

సాగునీటి ప్రాజెక్టులను ప్రకటిసైనే పూర్తికావు. వాటి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించి, వాటిని సకాలంలో ఖర్చు చేయాలి. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వాల అనుభవం చూస్తే ప్రకటనలకు, కేటాయింపులకు, వాస్తవ ఖర్చులకు పొంతనలేదు.

| సంవత్సరం | బడ్జెట్‌లో కేటాయింపులు (కోట్లలో) | వాస్తవంగా చేసిన ఖర్చులు (కోట్లలో) |
|---|---|---|
| 2014-15 | 11,763 | 9,224 |
| 2015-16 | 10,861 | 9,546 |
| 2016-17 | 13,255 | 10,562 |
| 2017-18 | 19,663 | 12,100 |
| 2018-19 | 25,250 | 14,462 |
| **మొత్తం** | **80,792** | **56,894** |

**గడచిన ఐదు సంవత్సరాల్లో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన మొత్తాలు, ఖర్చుల గురించి నీటిపారుదల శాఖ మంత్రి సెప్టెంబర్ 21న అసెంబ్లీలో లిఖితపూర్వకంగా ఇచ్చిన వివరాలు**

| | | |
|---|---|---|
| 2019-20 | 13,139.50 | 6,812.9 |
| 2020-21 | 11,805.74 | 6,057.47 |
| 2021-22 | 13,237.79 | 7,144.06 |
| 2022-23 | 11,482.37 | 7,102.48 |
| 2023-24 | 11,908.2 | 4,942.7 |
| **మొత్తం** | **రూ.61,573.15** | **రూ.32,059,61 కోట్లు** మాత్రమే |

**భూసేకరణ- నిర్వాసితులు**

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల క్రింద 5,00,934.94 ఎకరాల భూమి సేకరించాల్సిఉంది. ఒక్క పోలవరం ప్రాజెక్టు కోసమే 1,66,878.53 ఎకరాలు సేకరించనున్నారు. అన్ని ప్రాజెక్టులకు కలిపి ఇప్పటి వరకు 3,12,548.79 ఎకరాల భూమిని సేకరించారు. ఈ భూములు కోల్పోయిన రైతులకు సకాలం పరిహారం చెల్లించడంలోనూ, పునరావాసం కలిపించడంలోనూ ప్రభుత్వాలు

తీవ్రనిర్లక్ష్య ధోరణి కొనసాగిస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి దశాబ్దాల క్రితం సేకరించిన భూములకు ఇప్పటికీ పరిహారం అందని పరిస్థితి చాలా ప్రాంతాల్లో ఉంది. గ్రామాలు, పంటపొలాలు నీటిమయమైన తమకు చట్టప్రకారం పరిహారం అందలేదని, పునరావాసం ఏర్పాటు చేయలేదని కోర్టులకెక్కిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. పోలవరంప్రాజెక్టు కింద తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 8 మండలాలు, 356 గ్రామాలు, 1,05,601 కుటుంబాలు పూర్తిగా మునిగిపోతాయి. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఈ ప్రాజెక్టు నిర్మాణ పూర్తి బాధ్యత కేంద్రానిది. నిధులన్నీ కేంద్రం ఖర్చుపెట్టాలి. 1,05,601 కుటుంబాలకు గాను ఇప్పటివరకు 4వేల కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. మరో 18,166 కుటుంబాలను తక్షణం ఖాళీ చేయించాలని ప్రభుత్వం చెబుతుంది.

వెలిగొండ ప్రాజెక్టు ఏడు ప్యాకేజీల కింద నిర్మించబడుతుంది. ఈ ప్రాజెక్టువల్ల ప్రకాశం జిల్లాలో 23 మండలాలు, నెల్లూరు జిల్లాలో 5 మండలాలు, కడప జిల్లాలో 2 మండలాల్లోని 4,38,000 ఎకరాలకు సాగునీరు, త్రాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు కింద 7,200 కుటుంబాలు నిర్వాసితులు అవుతున్నారు. ఈ కుటుంబాలకు పునరావాసం కలిపించడానికి రూ.1100 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో నిర్వాసితుల్లో తీవ్ర ఆందోళన ఉంది. హంద్రీ-నీవా, వంశధారా, నాగవళి ఇలా ప్రతి ప్రాజెక్టు కింద నిర్వాసితుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కలిపించకుండా ప్రాజెక్టులు నిర్మాణం చయడమంటే నిర్వాసితులను దగా చేయడమే.

### ముగింపు

ఈ సంవత్సరం తీవ్రమైన వర్షాభావ పరిస్థితి ఏర్పడింది. సుమారు 30 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకాలేదు. సాగుచేసిన ప్రాంతాల్లో కూడా సకాలంలో వర్షాలు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. గత రెండు సంవత్సరాల్లో సకాలంలో, అకాలంలో అధిక వర్షాలు రావడంవల్ల వచ్చిన నీటిని నిలుపుకునే సదుపాయాలు లేక సుమారు వెయ్యి టిఎంసీలు వృధ్ధాగా సముద్రంలో కలిసాయి. ఈ వరదనీటిని నిలుపుకునే సామర్థ్యం పెంచుకోవడం ద్వారా సాగు వ్యవసాయాన్ని స్థిరీకరించి రైతులకు వ్యవసాయం పట్ల విశ్వాసాన్ని కలిపించవచ్చు. అయితే రాష్ట్రాన్ని పాలిస్తున్న గత, ప్రస్తుత పాలకులకు సాగునీటి రంగం పట్ల సరైన శ్రద్ధలేదు. ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ కూడా రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల నుండే పాలకు పార్టీలు చూస్తున్నాయి. అందువల్ల నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయడంలోనూ, ఈ ప్రాజెక్టులకు భూములు కోల్పోయిన రైతులకు సకాలంలో సక్రమమైన పరిహారం చెల్లించడంలోనూ, పునరావాసం కలిపించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తున్నాయి.

# పారిశ్రామికాభివృద్ధి, సేవా రంగం

సమాజ అభివృద్ధిలో పారిశ్రామిక రంగంలో సాంకేతిక అభివృద్ధి శరవేగంగా పెరుగుతున్నది. ఉదా: 1990 నాటికి ఫైబర్ ఆఫ్టిక్ ద్వారా కమ్యూనికేషన్ రంగంలో అనుహ్యమైన మార్పులు వచ్చాయి. ఇంటర్‌నెట్ ప్రవేశంతో ఈసౌకర్యం ఊహాతీతమైనది. కానీ దాని ప్రయోజనాని పెట్టుబడిదారులు తమ లాభార్జనకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయంతో కమ్యూనికేషన్ రంగంలో జియో తిరుగులేని శక్తిగా ఎదిగింది. క్రోనీ కాప్టిలిజం ప్రభావమే ఇది. దీనికి ప్రత్యామ్నాయంగా సోషలిజంలోనే మాత్రమే శాస్త్ర సాంకేతిక అభివృద్ధి సమాజానికి ఉపయోగపడుతుంది.

విదేశీ, స్వదేశీ కార్పొరేట్లను మాత్రమే ఆహ్వానిస్తున్నారు. ప్రతి సంవత్సరం గ్లోబల్ సమ్మిట్‌లు నిర్వహిస్తున్నారు. రాష్ట్రాలు మధ్య పోటీలు పెట్టి  విదేశీ, స్వదేశీ, బడా కార్పొరేట్ కంపెనీలు రాయితీలు పొందుతున్నారు. ఉదా: భూములు, విద్యుత్, నీరుతోపాటు దేశంలోని మానవ వనరులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల పరిస్థితి**

రాష్ట్ర ప్రభుత్వం 6 పంచదార పరిశ్రమలను అధికారికంగా మూసివేసింది. చిట్టివలస జ్యూట్‌మిల్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం మూసివేసే ఒప్పందం చేసింది. ప్రైవేట్ రంగంలో జాతీయ పెట్టుబడులను ప్రోత్సహించింది. దానికి అనుగుణంగా గంగవరం, క్రిష్ణపట్నం పోర్టులను గౌతమ్ ఆదానీకి అప్పగించింది. గంగవరం పోర్టులోని రాష్ట్రప్రభుత్వ వాటాలు కూడా ఆదానీకి చౌకగ అమ్మింది. రాష్ట్రంలోనేడు రామాయపట్నం, మచిలీపట్నం, మూలపాడు (భావనపాడు) పోర్టులు పనులు సాగుతున్నాయి. ఈ పోర్టులను కూడా ఆదానీకి అప్పగించడానికే

సన్నాహాలు సాగుతున్నాయి. భోగాపురం విమానాశ్రయం జిఎంఆర్‌కు అప్పగించారు. అనంతపురం జిల్లాలో "కియా" కార్ల కంపెని కేవలం అసెంబ్లింగ్ పనులకు మాత్రమే పరిమితం. జగన్‌మోహన్ రెడ్డి కక్షపూరిత వైఖరి వల్ల అమర్‌రాజ బ్యాటరీ కంపెనీ తెలంగాణాకు తరలిపోయింది.

2023లో మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ ఆర్భాటంగా జరిగింది. రూ. 11.87 లక్షల కోట్లు పెట్టుబడులకు 92 ఒప్పందాలు జరిగాయి. ఈ పరిశ్రమల్లో 3.92 లక్షల ఉద్యోగాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుల్లో 8.25 లక్షల కోట్లు ఒక గ్రీన్ హైడ్రో ఎనార్జీ పేరుతో చేసిన ఒప్పందాలు. ఇప్పుడు దేశంలో ఉన్న థర్మల్‌ప్లాంట్లు అన్నీ మూసివేసి 2050 నాటికి గ్రీన్ హైడ్రో ఎనార్జీని అమల్లోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లాలోని పూడిమడకలో ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో రూ. 2.35 లక్షల కోట్లుతో 'గ్రీన్ హైడ్రో ఆక్సిజన్' ప్లాంట్ నిర్మిస్తామని ఒప్పందం చేశారు. ఇవి ఏపీ అనతికాలంలో వచ్చే అవకాశాలు లేవు. ప్రపంచంలోనే ఈ పరిశ్రమలు ఎక్కడా అమల్లోకి రాలేదు. ఈ టెక్నాలజీ అమలు కావాలంటే ఐదు రెట్లు అదనపు వ్యయం అవుతుంది. వైఎస్ఆర్. జగన్ ప్రభుత్వం ఐదేళ్ళ కాలంలో ఒకే గ్లోబల్ సమ్మిట్ నిర్వహించింది. టిడిపి ప్రభుత్వకాలంలో మూడు గ్లోబల్ సమ్మిట్‌లు నిర్వహించారు. కాని అందులో ప్రధానంగా ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ పెట్రోలియం మాత్రమే రాష్ట్రంలో రూ. 25 వేల కోట్లు పెట్టుబడులు విస్తరణలో పెట్టింది. మిగిలిన పెట్టుబడులు నామమాత్రం. ప్రైవేట్ రంగంలో స్పెషల్ ఏకానమిక్ జోనుల్లో మాత్రమే ఇటీవల కాలంలో కొత్త పరిశ్రమలు వచ్చాయి. తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ, విశాఖ జిల్లాలో అచ్యుతాపురం, నెల్లూరు జిల్లా ముత్తుకూరు ప్రాంతల్లోనే ఈ పరిశ్రమలు నెలకొల్పారు.

గత 20 సంవత్సరాల్లో రాష్ట్రంలో పెరిగిన పెద్దరంగం ఫార్మసిటీ. సముద్రతీరంలోనే ఈ పరిశ్రమలు ఏర్పడ్డాయి. ఫార్మరంగం రాష్ట్రంలో ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మా రంగం అభివృద్ధి రేటు 2022లో 11.43 శాతంగా ఉన్నది. 2022 ఆర్థిక సంవత్సరానికి భారత్ నుండి మందుల ఎగుమతులు 22.96 బిలియన్ డాలర్లు (1,89,764 కోట్ల రూపాయలు). ఈ ఎగుమతులు ప్రధానంగా వాక్సిన్లు, జనరిక్ మెడిసిన్లు మరియు ఫార్ములేషన్స్‌గా ఉన్నాయి. ఈ పరిశ్రమలో సుమారు లక్ష మంది కార్మికులు పనిచేస్తున్నారు.

రాష్ట్రంలో 2022–23లో 7 పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు జిందాల్‌కు, అదాని, షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. విశాఖ ఏజెన్సీలోని ప్రాజెక్టులను స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. మిగిలిన ప్రాజెక్టుల్లో పనులు చేపట్టారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రైవేట్ రంగం ఒక్కటే నేడు కీలకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందించాయి. ప్రభుత్వ రంగాన్ని కనీస పోటీ కూడా లేకుండా చేయడం వల్ల కార్పొరేట్ కంపెనీలు, దేశ సంపదను లూఠీలు చేస్తున్నాయి. ముఖ్యంగా మానవ వనరులను కారుచౌకగా వినియోగిస్తున్నాయి. వర్గ పోరాటాల ద్వారా ఈ విధానాల్లో మార్పు తీసుకురావడం అనివార్యం. శాస్త్ర సాంకేతికాభివృద్ధి ప్రయోజనం యావత్తు సమాజానికి ఉపయోగించాలి. కార్మికుల పని గంటలు తగ్గించాలి. నిజ వేతనాలు పెరగాలి.

ఆంధ్రప్రదేశ్‌లో 1995–2014 మధ్య నికర రాష్ట్ర అంతర్గత ఉత్పత్తి 28 శాతం నుంచి 2014–21 మధ్య నికర రాష్ట్ర అంతర్గత ఉత్పత్తి 23 శాతానికి పడిపోయింది. మరో వైపున సేవా రంగం ఈ కాలంలో 34 శాతం నుంచి 39 శాతానికి పెరిగింది.

# సేవా రంగం

**సేవా రంగం :** సేవా రంగం నేడు అత్యధిక లాభాలు ఆర్జించే రంగం. 'డిజిటల్ క్యాపిటల్' నేడు పెట్టుబడుల్లో కీలక స్థానం ఆక్రమించింది. అమెజాన్, ఫ్లిప్‌కాట్, ఓబర్, ఓలా, జుమాటోలు కనిపించని యజమాన్యాలు. రవాణా, వస్తు సేవలు, ఇంటి సేవలు అందించే సంస్థలు వేగంగా పెరుగుతున్నాయి. రానున్న కాలంలో ఇంకా పెరుగుతాయి.

ప్రజలు నేడు సౌకర్యాలు అత్యవసరంగా కావాలని కోరుకుంటున్నారు. ఫోన్‌కాల్ చేస్తే ఏ వస్తువైనా నిముషాల్లో ఇంటి ముందు వాలుతున్నాయి. డిజిటల్ ఎకానమి నాణ్యత పెరిగింది. ఐటీ సేవలు వచ్చాయి. ఐటీ రంగం గురించి మనకు తెలుసు. నానో టెక్నాలజీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉపయోగం అందుబాటులోకి రావడం పెరిగింది. సెన్సార్స్ ప్రాధాన్యత పెరిగింది. దక్షిణ కొరియాలోని పోస్కో స్టీల్ ప్లాంట్‌లో 100 టన్నుల ట్రక్కులు సెన్సార్స్ ద్వారా డ్రైవర్స్ లేకుండానే పని చేస్తున్నాయి.

**గిగ్ కార్మికులు:** యజమానితో సంబంధాల్లో సమూల మార్పులు వచ్చాయి. పనిలో స్వేచ్ఛ ఉంటుంది. పని ఎన్ని గంటలు ఉంటుంది? ఎన్ని రోజులు ఉంటుంది? ఏదీ గ్యారెంటీ లేదు. వీరికి యాజమని ఎవరో తెలియదు. సేవలు పొందేవారు ఎవరో కూడా తెలియదు. గిగ్ కార్మికులు ఎంత ఎండలో వచ్చారో, వర్షంలో వచ్చారో, ఎలా ఉంటారో సేవలు పొందేవారికి సంబంధం లేదు. ఫోన్

చేస్తే ఇంటిముందు తాము ఆర్డర్ ఇచ్చిన సరుకులు గానీ, ఆహారం గానీ అందుబాటులో ఉంటుంది. ఫోన్ ఫే ద్వారా డబ్బులు చెల్లిస్తారు.

గిగ్ వర్కర్స్‌కు సంబంధించి నీతి ఆయోగ్ డాక్యుమెంట్లు ప్రకారం 2029-30 నాటికి మనదేశంలో గిగ్ వర్కర్లు 2.35 కోట్లకు పెరుగుతారని ప్రభుత్వ అంచనా. ముఖ్యంగా రవాణా, ఆహార సరఫరా, అన్ని రకాల గృహ సేవాలు చేసే కార్మికులను సరఫరా చేస్తున్నారు. ఈ కార్మికుల గురించి రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసింది. తమిళనాడు ప్రభుత్వం చట్టం చేస్తామని హామీనిచ్చింది. జార్ఖండ్ హైకోర్టు తీర్పు కార్మికులకు అనుకూలంగా ఉంది. గిగ్ కార్మికులను కార్మికులుగా గుర్తించాలని ఈ తీర్పులో ఉంది. గిగ్ కార్మికులను సమీకరించడానికి తగిన నైపుణ్యం కార్మిక సంఘాలు నేర్చుకోవాలి.

## ఉపాధి

నేడు ప్రపంచ వ్యాప్తంగా "ఉపాధి రహిత అభివృద్ధి" (జాబ్‌లెస్ గ్రోత్) మాత్రమే సాగుతున్నది. చైనా మరియు సోషలిస్టు దేశాలు దీనికి మినహాయింపు.

ఉత్పాదనా శక్తి పెరుగుతున్నది. ఉత్పత్తి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి పెరగడంలేదు. పెట్టుబడిదారి దేశాల్లో ఆటోమేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కార్మికులను తగ్గించి వారి స్థానంలో యంత్రాలను అన్ని రంగాల్లో ప్రవేశపెడుతున్నారు. ఉదా: గార్మెంట్స్, ఆటోమెబైల్, విద్యుత్, రియల్ ఎస్టేట్ వగైరా.. పెరుగుతున్న నిరుద్యోగాన్ని అవకాశంగా తీసుకొని పెట్టుబడిదారులు తమ దోపిడిని తీవ్రతరం చేస్తున్నారు. మార్క్స్ చెప్పినట్లు నిరుద్యోగ రిజర్వు సైన్యాన్ని పెట్టుబడిదారులు బాగా పెంచుతారు. కార్మికులకు జీతాలు తగ్గిస్తున్నారు. విపరీతమైన లాభాలు ఆర్జిస్తున్నారు. చైనాలో ఉత్పత్తి నిరంతరం పెరుగుతున్నది. జీ 20 దేశాలు చైనా ఆర్థిక వ్యవస్థను దెబ్బ కొట్టడానికి కోవిడ్ కాలం నుంచి తమ దిగుమతులు తగ్గించారు. అయినా చైనా దేశీయ కొనుగోలుశక్తి పెంచడం ద్వారా ఉత్పత్తి తగ్గకుండా నిలబెట్టుకోగలుతుంది. కార్మికులకు వేతనాలు పెంచడం ద్వారా దేశంలో కార్మిక వర్గానికి కొనుగోలు శక్తిని పెంచింది.

**కొన్ని కోర్ & స్ట్రాటజిక్ కేంద్ర ప్రభుత్వ రంగాల్లో ఉపాధి :** ఆర్థిక మంత్రిత్వశాఖ నిర్వహించిన సర్వే నివేదిక ప్రకారం కొన్ని ప్రధాన మరియు వ్యూహాత్మక కేంద్ర ప్రభుత్వరంగాల్లో ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని రెగ్యులర్ వర్కర్స్, క్యాజువల్ మరియు కాంట్రాక్ట్ వర్కర్ల వివరాలు ఇవ్వబడ్డాయి. కొన్ని ముఖ్యమైన వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మొత్తం కేంద్ర ప్రభుత్వం రంగం ఉద్యోగుల్లో 2021-22 సంవత్సరానికి సంబంధించి బొగ్గు రంగం ఉద్యోగులు 25.48 శాతం, పెట్రోలియం రిఫైనరీలు 14.7 శాతం, స్టీల్ 10 శాతం, హెవీ & మీడియం ఇంజినీరింగ్ 11.81 శాతం, విద్యుత్తు ఉత్పత్తి 7.32 శాతం. బొగ్గు మరియు ఉక్కు మాత్రమే మొత్తం ఉద్యోగుల్లో 36.34 శాతం ఉన్నారు.

అధికారిక లెక్కల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 1970లలో గరిష్టంగా 22.00 లక్షలు. వారిలో రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య నేడు 8.40 లక్షలకు తగ్గింది. కాంట్రాక్ట్, క్యాజువల్ మొదలైన వారి అధికారిక సంఖ్య 6.20 లక్షలు. సర్వే నివేదికలో మరో ఆశ్చర్యకరమైన వాస్తవం వ్యక్తమైంది. **"ఆన్-రోల్ - ఆఫ్-రోల్ ఉద్యోగులు వాటా"** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలో, ఉపాధిని వివిధ పాత్రలుగా వర్గీకరించారు. అవి-పర్మినెంట్ ఉద్యోగులు, మేనేజర్, సూపర్వైజర్, నాన్-ఎగ్జిక్యూటివ్ కార్మికులను ఆన్-రోల్‌గా గుర్తించారు. క్యాజువల్ మరియు కాంట్రాక్టు కార్మికులను ఆఫ్ రోల్ అని వర్గీకరించారు. 2021-22 వార్షిక సంవత్సరంలో, కేంద్ర ప్రభుత్వ ఉ ద్యోగులు ఉపాధిలో (రెగ్యులర్ ప్లస్ కాంట్రాక్ట్ కలిపి) ఆన్-రోల్ ఉపాధి వాటా 58%. ఆఫ్-రోల్ మరియు ఆన్-రోల్ ఉద్యోగులు 42 శాతం. వేతన వ్యత్యాసాలు విపరీతంగా పెరిగాయి. ఆయిల్ రంగంలో పర్మినెంట్ కార్మికుల జీతాల్లో పదోవంతు కూడా కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు రావడం లేదు.

**సిఐటియు సెంటర్ ద్వారా ఒక కేస్ స్టడీ ఫలితాలు :** కేంద్ర ప్రభుత్వ రంగం మహారత్న పవర్ ట్రాన్సిమిషన్ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పవర్ గ్రిడ్) కేస్ స్టడీలో అంశాలు వణుకు పుట్టిస్తాయి. కేంద్ర ప్రభుత్వ రంగం అద్భుతమైన పనితీరు క్రింది విధంగా ఉంది. 1,73,815 సర్క్యూట్ కిలోమీటర్ ట్రాన్స్ మిషన్ లైన్, 275 సబ్ స్టేషన్లు భారతదేశంలోని అన్ని మూలలకు విస్తరించి ఉన్నాయి. 2,73,000 ఎలక్ట్రిక్ టవర్లు, దీని ప్రసార సామర్థ్యం 4,93,863 యం.వి.ఎ. భారతదేశంలోని 206 నగరాల్లోని 780 స్థానాల్లో 74,109 కి.మీ టెలికాం నెట్‌వర్క్ 99.83% కంటే ఎక్కువ లైన్ లభ్యతతో ఉంది. అద్భుతమైన పనితీరు 2021-2022 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన మొత్తం ఆదాయం రూ.42,698 కోట్లు నికర లాభం. పన్ను మినహాయింపు తర్వాత

16,824 కోట్లు 39.78%. పవర్ గ్రిడ్‌లో ఉద్యోగులు మొత్తం 8,175 మంది మాత్రమే. **వీరిలో సాధారణ కార్మికులు కేవలం 23% మంది మాత్రమే. మిగిలిన 77% మంది ఆఫీసర్లు మరియు సూపర్‌వైజర్లు.** కార్మికుల కంటే మూడు రెట్లు అధికారులు ఎక్కువ మంది అని అర్థమవుతుంది. బొగ్గు రంగంలో (కోల్ ఇండియా లిమిటెడ్) 1970లో 7 లక్షల మంది పర్మినెంట్ కార్మికులు పనిచేసేవారు. నేడు 1,90,012కి తగ్గింది. భారీ పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య బాగా తగ్గడంతో బేర సారాల హక్కు బలహీనపడింది. పర్మినెంట్ కార్మికులను ప్రతి భారీ పరిశ్రమలోనూ నామమాత్రంగా చేయాలనేది మోడీ విధానం. ట్రైనీలతోనే పర్మినెంట్ పనులు చేయిస్తారు. ప్రభుత్వ ఖర్చులతో స్కిల్డ్ సెంటర్లలో వీరికి ట్రైనింగ్ ఇస్తారు. లేబర్‌కోడ్ ప్రకారం "ఫిక్సడ్ టెర్మ్ ఎంప్లాయిమెంట్" పేరుతో కార్మికులను రిక్రూట్ చేసుకుంటున్నారు. వీరిని తొలగించినా జీతాలు ఇవ్వనక్కరలేదు.

శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో పర్మినెంట్ కార్మికులే పనిచేయాలి. పర్మినెంట్ కార్మికులు లేకుంటే నాణ్యత లోపిస్తుంది. ప్రమాదాలు పెరుగుతాయి. రైల్వే, ఫార్మా వగైరా రంగాల్లో ప్రమాదాలకు కారణం ఇదే. పర్మినెంట్ ఉద్యోగులు నియమించి ఎక్కువ జీతాలు చెల్లించడం ద్వారా కార్మికుల కొనుగోలు శక్తి పెరుగుతుంది.

* * *

## ప్రజా ప్రణాళిక అమలుకై ఐక్యమవుదాం.. పోరాడదాం...

- పోలవరం నిర్వాసితులకు పునరావాసం
- పోడు భూములకు పట్టాలు
- అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు, జీవో నెం.3 అమలు
- ప్రత్యేక డిఎస్సీ, నిర్వాసితుల కాలనీల్లో మౌళిక వసతులు
- పేదలకు భూపంపిణీ, ఉపాధి హామీ పనిదినాల పెంపు
- స్కీం వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు
- అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు
- నాణ్యమైన విద్య, వైద్యం, పేదలకు 300 యూనిట్ల ఉచితం
- రూ.400 లకే గ్యాస్, రూ.60లకే లీటర్ పెట్రోల్, డీజిల్
- అన్ని రకాల పెన్షన్లు రూ. 5000/-

రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని,
దాని మద్దతుదారుల్ని ఓడించండి.

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిర్బంధ
విధానాలపై పోరాడండి.

సిపియం ను బలపర్చండి.
వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత వర్ధిల్లాలి.